ప్రజలే ప్రభువులు

# జనబలం

ఫిబ్రవరి 2022 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-

## మద్యం.. తాయిలాల సంక్షేమం!







యూనియన్ బడ్జెట్ 2022-23 :

## దీర్ఘకాలిక దృష్టిని ప్రదర్శించారు గానీ..
## కొన్ని కీలక అవకాశాల్ని జారవిడిచారు



# మతాన్ని, ఆధ్యాత్మికతను సమాజానికి విస్తరించిన వివేకానంద

మనిషికి, దైవానికి మధ్య వ్యక్తిగత సంబంధంగా మాత్రమే ఉన్న మతం, ఆధ్యాత్మికతలను సమాజానికి విస్తరించి కొత్త అర్థాన్నిచ్చిన మహనీయుడు స్వామి వివేకానంద అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఆధ్యాత్మికత అంటే సమాజానికి సేవ .. జాతీయత అంటే సామర్థ్యాన్ని వికసింప చేసుకుని ఎదిగే అవకాశాల్ని ప్రతి పౌరునికీ అందించటం అని పునర్నిర్వచించారన్నారు. వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఎఫ్‌డీఆర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జేపీ మాట్లాడారు.

ఆత్మన్యూనతతో కొట్టుమిట్టాడుతున్న మన జాతికి భారతీయ ఘనవారసత్వాన్ని తెలియచేస్తూ వివేకానంద ఆత్మవిశ్వాసాన్ని అందించారని, తలెత్తుకునేలా చేశారని జేపీ అన్నారు. సమాజమే దేవాలయం, కాలే కడుపుకి అన్నం పెట్టటమే నిజమైన దైవారాధన అని చాటి చెబుతూ సామాజిక నాయకత్వ స్ఫూర్తిని రగిలించారన్నారు. ప్రపంచమంతా ఒకే కుటుంబం అనే భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లోని విశాల దృక్పథాన్ని, సమ్మిళితత్వాన్ని గుర్తించటం వల్లే ఆయన బెంగాల్‌కి పరిమితం కాకుండా ఆసేతుహిమాచలం పర్యటించి, ఇతర దేశాలకు సైతం వెళ్లి ఆధునిక భారత నిర్మాణానికి కృషి చేశారన్నారు. వివేకానంద ఆలోచనల్ని అర్థం చేసుకోకుండా కులం, మతం, ప్రాంతం వంటి ఆటవిక ఉద్వేగాలను రెచ్చగొట్టి ప్రజల్ని విభజించే రాజకీయాలు చేస్తే ఎన్ని విగ్రహాల్ని పెట్టినా, పూలమాలలు వేసినా ఫలితం ఉండదన్నారు. వివేకానంద అప్పట్లో చెప్పిన ఎల్లలు లేని ప్రపంచం ప్రాధాన్యతను ఇప్పుడు భూతాపం, కొవిడ్ నేపథ్యంలో అందరూ గుర్తిస్తున్నారన్నారు. వ్యక్తి ఔన్నత్యాన్ని, సమాజహితాన్ని సంధానం చేయటం, మిగతా ప్రపంచంతో కలిసి భూతాపం, వలసలు సమస్యలపై కృషి చేయటం నేటి యువ భారత్ ముందున్న కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో వైబీఐ అధ్యక్షుడు బొర్రా శివరామకృష్ణ, పెద్దగళ్ల రాజీవ్, సూర్యలక్ష్మి, మురళీధర్, ప్రసన్న తదితర నేతలు పాల్గొన్నారు.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 25 | సంచిక 02 | ఫిబ్రవరి 2022

సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




...ప్రభుత్వ ఆస్తులను విక్రయిద్దాం, భూముల ధరలు పెంచుదాం, బాండ్లు జారీ చేద్దాం, నిత్యావసరాలపై సుంకాలు పెంచుదాం, వరల్డ్ బ్యాంకు నుంచి అప్పు తీసుకొద్దాం... మనకు పోయేదేముంది!!


కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,
సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

# అసమానతలతో ఆర్థిక హింస

సంపాదకీయం

ప్రపంచంలో ఆర్థిక అసమానతలు ఆందోళనకరస్థాయికి చేరుకున్నాయి. ఆర్థిక హింస, వివిధ రూపాలలోని వివక్షతలు, అణిచివేత, నియంతృత్వ ధోరణులు జన జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఒక పక్క కుబేరుల సంపద కుప్పతెప్పలుగా కేంద్రీకృతమైపోతున్నది. మరోపక్క బీదరికం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నది. గత కొన్నేళ్లుగా పెరుగుతూ వచ్చిన అసమానతలు కరోనా కాలంలో మరింత తీవ్ర రూపం ధరించాయి. ప్రపంచ ఆర్థిక వేదిక దావోస్ అజెండా కోసం ఆక్స్‌ఫామ్ రూపొందించిన నివేదికలు ఆర్థిక అసమానతల విశ్వరూపాన్ని ఆవిష్కరించాయి.

'హతమార్చే అసమానతలు' పేరుతో ఆక్స్‌ఫామ్ విడుదల చేసిన నివేదిక ప్రపంచంలోనూ, భారతదేశంలోనూ పెరిగిపోతున్న ఆర్థిక అసమానతల గురించిన కఠోర వాస్తవాలను వెల్లడి చేసింది.

2020 మార్చి నుండి 2021 నవంబరు వరకూ 20 నెలల వ్యవధిలో ప్రపంచంలో 310 కోట్ల మంది ప్రజలు తమ ఆదాయాల్ని కోల్పోయారు. 21 లక్షల మంది ఆకలిచావులకు గురయ్యారు. ఉపాధి కోల్పోయి, ఆరోగ్య సంరక్షణలేక, పౌష్టికాహారలోపంతో , రక్తహీనతతో కోట్లాది మంది ప్రజలు "ఆర్థికహింస'కు గురయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలిపోయింది. నిరుద్యోగిత పెరిగిపోయింది. బడి బైటి బాలల సంఖ్య మున్నెన్నడూ లేని స్థాయికి పెరిగింది.

సామాన్య ప్రజలు దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోతుండగా కుబేరుల సంపద మాత్రం విపరీతంగా పెరిగిపోయింది. ప్రపంచ సంపన్నుల్లో తొలి పది స్థానాల్లో ఉన్న కుబేరుల సంపద 62 లక్షల కోట్ల నుండి 111 లక్షల కోట్లకు పెరిగింది. గత 20 నెలల్లో రోజుకు 9600 కోట్ల రూపాయల సంపద పదిమంది ఖాతాల్లోకి చేరిపోయింది. ప్రపంచంలోని సంపదలో 76శాతం సంపద 5 శాతం కుబేరుల దగ్గర పోగయ్యింది. వర్ణవివక్ష, లింగ వివక్ష, విధానాల కారణంగా పేదరికం మరింతగా పెరిగిపోయిందని ఆక్స్‌ఫామ్ నివేదిక వివరించింది.

ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో ఆర్థిక అసమానతల తగ్గింపునకు చేపట్టాల్సిన కార్యాచరణ గురించి చర్చించాలని ఆక్స్‌ఫామ్ సూచించింది.

భారతదేశంలో పరిస్థితుల గురించి కూడా ఆక్స్‌ఫామ్ ఒక సంచికని విడుదల చేసింది. గత 20 నెలల్లో దేశంలోని 84శాతం ప్రజల ఆదాయాలు పడిపోయాయి. కరోనా కారణంగా దుర్భర దారిద్ర్యంలోకి దిగజారిపోయినవారు 4.6 కోట్ల మంది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగిత 15శాతానికి చేరింది. 65శాతం మహిళలు రక్తహీనతతో, 72శాతం పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. దేశంలో గత 20 నెలల్లో ఆత్మహత్యలకు పాల్పడిన రోజు కూలీలు, నిరుద్యోగులు, స్వయం ఉపాధి చిరు వ్యాపారులు అత్యధికులు ఉన్నారు. నోట్లరద్దు, అరకొర జీఎస్టీ చిన్న, మధ్య తరహా పరిశ్రమలను తీవ్రంగా దెబ్బతీసాయి. కోట్లాదిమంది ప్రజలు ఉపాధిని కోల్పోయారు.

అదే సమయంలో దేశంలో బిలియనీర్ల సంఖ్య 102 నుండి 142కు పెరిగింది. దేశంలోని వందమంది కుబేరుల సంపద 23.14 లక్షల కోట్ల నుండి 53.16 లక్షల కోట్లకు పెరిగింది. 50 కోట్ల మంది ప్రజలకు సంపదలో 6శాతమే ఉండగా, పెరిగిన సంపదలో 20శాతం మొత్తం అదానీ ఖాతాలోకి చేరిందని ఆక్స్‌ఫామ్ పేర్కొన్నది. ఒకే ఒక్క ఏడాదిలో గౌతమ్ అదానీ సంపద ఎనిమిదిరెట్లు పెరిగింది.

ప్రభుత్వ విధానాలు సైతం ఆర్థిక వ్యత్యాసాలు మరింతగా పెరిగేందుకు దోహదం చేస్తున్నాయి. 2016లో సంపద పన్ను రద్దు చేయగా, కార్పొరేట్‌పన్ను 30 శాతం నుండి 22 శాతానికి తగ్గించారు. దాంతో ప్రభుత్వానికి రావాల్సిన పన్ను ఆదాయం 1.5లక్షల కోట్లు రాలేదు. పరోక్ష పన్నుల రూపంలో ప్రభుత్వానికి 8.6 లక్షల కోట్లు సమకూరింది. అందులో పెట్రోలు, డీజిలు ధరల పెరుగుదల వల్ల రూ. 3.71 లక్షల కోట్లు ప్రభుత్వానికి సమకూరింది. కుబేరులకు పన్ను రాయితీలిచ్చిన ప్రభుత్వం పేదల నుండి గోళ్లూడగొట్టి మరీ పన్నులు పిండింది.

ఆర్థికమంత్రి 2022-23 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సమ్మిళిత అభివృద్ధి, ఉత్పాదకత పెంపుదల గురించి మాట్లాడారు. కానీ అందుకు అవసరమైన ఆర్థిక చర్యలు తీసుకోలేదు. రానున్న ఐదేళ్లలో ఉద్యోగ కల్పన గురించిన లక్ష్యమే చాలా స్వల్పంగా ఉంది. సంక్షేమ రంగానికి, కోత పెట్టారు. వైద్యరంగానికి సరైన కేటాయింపులు లేవు.

సంపదపన్ను 1శాతం విధించినా వాక్సినేషన్ ఖర్చుకు సరిపోయేది. దేశంలోని 100 మంది కుబేరులపై 4శాతం పన్ను విధిస్తే వచ్చే సొమ్ముతో మొత్తం వైద్య, ఆరోగ్య రంగానికి అవసరమైన నిధులు సమకూరతాయి.

సార్వత్రిక ఆరోగ్యసంరక్షణ, సామాజిక భద్రత, వాతావరణ మార్పు వంటి రంగాలకు నిధులు పెంచాల్సిన అవసరం ఉంది. సమానత్వ చట్టాలను పటిష్టం చేసి లింగ, వర్ణ వివక్షలను అంతం చేయాలనీ, మహిళలనూ, రంగు జాతి ప్రజల్ని నిర్ణయాధికార సంస్థల్లో భాగస్వాముల్ని చేయాలని, కార్మికచట్టాలను పటిష్టం చేసి వారి పని పరిస్థితులను మెరుగుపరచాలని ఆక్స్‌ఫామ్ చేసిన సూచనలను పట్టించుకోవాల్సిన అవసరం ఉందని గుర్తించాలి.

డి. సోమసుందర్

# మద్యం .. తాయిలాల సంక్షేమం

## -మద్యం, తాత్కాలిక తాయిలాల కట్టడికి జాతీయ స్థాయి చట్టాలు తేవాలి-



వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి కోటి ఓట్లు వేస్తే మద్యం రూ.70లకే అందుబాటులోకి తెస్తామని, మిగులు ఆదాయం ఉంటే లిక్కర్ ధరని ఇంకా తగ్గించి రూ.50లకే అందిస్తామని ఒక ప్రధాన జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న నాయకుడు ఇటీవల బహిరంగ సభలో ప్రకటించారు. తమది భారతీయ సంస్కృతికి ప్రాతినిధ్యం వహిస్తామని చెప్పుకునే పార్టీ కాబట్టి.. అందులోని చెడును కూడా కళ్లు మూసుకుని ఆమోదించాలి అనుకున్నారో లేక అమూర్త నినాదాలతోపాటు ఇలా కూడా నిషా ఎక్కిస్తేనే ఓట్లు లభిస్తాయనుకున్నారో గానీ.. భారతీయ సమాజంలో అనాదిగా వస్తున్న సురాపానాన్ని జాతీయోద్యమ నేతల దృక్కోణం, ఆధునిక ప్రజాస్వామ్య విలువల కోణాల్లో చూడకుండా సదరు నాయకుడు మద్యరాయితీ హామీని ఘనంగా ప్రకటించారు. ఈ హామీ మీద తెలంగాణ ముఖ్యమంత్రి కుమారుడు, మంత్రి విమర్శ చేయగానే ఎదురుదాడికి దిగారు. తెల్లారుజాము మూడు గంటల వరకు మందులో మునిగితేలేదెవరో ప్రపంచమంతటికీ తెలుసు అని ముఖ్యమంత్రి కేసీఆర్ మీద చౌకబారు విమర్శ చేశారు.

తనను గెలిపిస్తే క్రమంగా మద్యనిషేధాన్ని కూడా అమలు చేస్తానని అత్యధిక మెజారిటీతో గెలిచిన ప్రభుత్వం ఉన్న రాష్ట్రంలో.. సదరు జాతీయ పార్టీ నేత అలాంటి హామీనివ్వటం కొంత విస్మయం కూడా కలిగిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో ఎక్కువశాతం, అందునా మహిళల్లో అత్యధిక శాతం మద్యాన్ని వ్యతిరేకిస్తున్నా రాజకీయ పార్టీల నేతలు మద్యం విచ్చలవిడి సరఫరాకే మొగ్గు చూపుతున్నారంటే, ఆ అంశంపై విధానపరంగా ఉన్న గందరగోళాన్ని కొనసాగించటం వల్లే వారు ఆ పని చేయగలుగుతున్నారు.

ఓ నాయకుడు తాను తాగుతాను అని సూటిగా చెప్పుకోవటానికి ఇంకా నామోషీ పడే దేశంలో, మద్యపానాన్ని ఎంత వీలైతే అంత ప్రోత్సహిస్తామని ఏ పార్టీ బాహాటంగా ప్రకటించలేని సమాజంలో మద్యం అమ్మకాలు నానాటికీ పెరిగిపోతున్నాయంటే.. ప్రభుత్వం నిర్వహించాల్సిన మౌలిక అంశాల పట్ల ప్రజల్లో, పలువురు రాజకీయ నేతల్లో కూడా ఉన్న గందరగోళం, అవగాహనారాహిత్యాలే అందుకు కారణం.

ప్రభుత్వం పని ఆహారపుటలవాట్లను శాషించటం కాదు. దేశంలో ఎవరు ఏ రకమైన ఆహారం తినాలో, పానీయం సేవించాలో చెప్పే అధికారం ఎవరికీ లేదు. కాకపోతే సమాజానికి సమస్య లేకుండా ఉండాలి. అందుకే కొన్ని రకాల మాంసాలు తినకూడదని కొందరిపై దాడులు చేసినప్పుడు ప్రజాస్వామ్యవాదులు గట్టిగా ఖండించారు. తోటి పౌరుల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకు ప్రాణాలొడ్డి మరీ పోరాడారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఉచితాల ద్వారా పంపిణీ చేసిన నగదును పలువురు ప్రజానీకం మద్యపానం కోసం వినియోగించటం గురించి. అమ్మ ఒడి ద్వారా పంపిణీ చేసిన డబ్బు ఆ ఇంట్లో పిల్ల, పిల్లవాడి విద్యాభ్యాసంలో నాణ్యతను పెంచటానికి కాకుండా నాన్న బుద్ది కోసం వెళ్లటం కచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమే కానీ, దానికి పరిష్కారం.. ఆ డబ్బును మద్యం కోసం వినియోగించటానికి వీల్లేదు అంటూ చట్టపరమైన నిబంధనలు విధించటం కాదు.

మద్యం తాగాలా, వద్దా, సినిమా చూడాలా వద్దా వంటివి నిర్ణయించటం ప్రభుత్వం పని కాదు. మరి మద్యం విషయంలో ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించటం అంటే.. ఒక మౌలిక కోణంలో కచ్చితంగా ప్రశ్నించాలి.

ఎందుకు ప్రశ్నించాలీ అంటే.. మద్యం విధానం ప్రభుత్వం చేయాల్సిన మౌలిక బాధ్యతలకు ఆటంకంగా మారుతోంది కాబట్టి!

రాజ్యం పాత్రను పోషించే ప్రభుత్వం అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను అందించాలి. చట్టబద్ధపాలనను అమలు చేయాలి. తద్వారా పేదరికాన్ని నిర్మూలించాలి, ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాల్ని అందించాలి. కానీ మన దేశంలో మద్యం వ్యాప్తి ఆ బాధ్యతల నిర్వహణకు చాలా రాష్ట్రాల్లో అవరోధంగా మారుతోంది. దేశ జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న

యువతలో మద్యం అలవాటు పెరుగుతుండటం ఆందోళనకర పరిణామం.

తెలుగు రాష్ట్రాలనే తీసుకుంటే, కేవలం విచ్చలవిడి మద్యం కారణంగా ఆరోగ్యం దెబ్బతినటం, అకాల మరణాలు, పేదరికం కొనసాగటం, పిల్లలకు నాణ్యమైన విద్యావకాశాలు కొరవడటం పదుల లక్షల జీవితాల్ని ఛిద్రం చేస్తోంది.

**తెలంగాణ వచ్చినప్పుడు ఏడాదికి రూ. 14,000 కోట్లు.. ఇప్పుడు లక్ష్యం రూ.60,000 కోట్లు**

తెలంగాణలో మద్యం ఎంత విచ్చలవిడిగా పెరిగిపోయిందో ఈ గణాంకాల్ని చూస్తే తెలుస్తుంది. రాష్ట్రంలో గత ఆరేళ్లలో రూ.1.24 లక్షల కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇందులో గడచిన రెండేళ్లలోనే రూ.50,000 కోట్లకు పైగా సమకూరింది. 2014-15లో తెలంగాణలో మద్యం అమ్మకాలు రూ.10,238.78 కోట్లు కాగా, 2016లో రూ.14,075.51 కోట్లకు చేరాయి. మద్యం విక్రయాలు 2020లో సరికొత్త రికార్డు సృష్టించాయి. కొవిడ్ మూలంగా నెలన్నర రోజులు మద్యం దుకాణాలు మూసినప్పటికీ 2020లో అమ్మకాల విలువ రూ.25,600 కోట్లను దాటింది. ఒక్క హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోనే 8,257.69 కోట్ల రాబడి వచ్చింది. ఉమ్మడి జిల్లాల వారీగా నల్గొండ జిల్లాలో రూ.2,844 కోట్లు, వరంగల్, మెదక్‌లలో రెండు వేల కోట్ల పైచిలుకు ఆదాయం లభించింది. 2019లో రూ.22,145 కోట్ల విలువైన అమ్మకాలు జరిగాయని, 2020లో దాదాపు రూ.3,455 కోట్ల మేర ప్రభుత్వానికి అదనంగా సమకూరిందని అబ్కారీ శాఖ తెలిపింది. 2021లో నవంబర్ నాటికే 2020 అమ్మకాల రికార్డును అధిగమించారు. డిసెంబర్ 1 నుండి అమల్లోకి వచ్చిన కొత్త మద్యం విధానంలో అమ్మకాలు 2022లో 50 శాతం వృద్ధిని సాధిస్తాయని, అమ్మకాలు రానున్న కాలంలో రూ.60,000 కోట్లను చేరతాయని ప్రభుత్వం లెక్కేసుకుంటోంది. 2021-22 విధానంలో జనాభా ప్రాతిపదికన అదనంగా 404 మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. మొత్తం 2620 దుకాణాలుండగా, ఒక్కో దుకాణానికి సగటున 26 దరఖాస్తులొచ్చాయి. దరఖాస్తుల ప్రక్రియ ద్వారానే ఖజానాకు రూ.1357 కోట్ల ఆదాయం (అంతకుముందు ఏడాది రూ.968.02 కోట్లు) సమకూరింది. వీటికితోడు 1018 బార్లు, ఇతర పబ్బులు మొత్తం కలుపుకుని 2022 నూతన సంవత్సరానికి ముందు కేవలం నాలుగు రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా రూ.759 కోట్ల విలువైన అమ్మకాలు జరిగాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోనే దాదాపు రూ.300 కోట్ల విలువైన అమ్మకాలు జరిగాయి. పేద కార్మికులు ఎక్కువ ఉండే చోట మద్యం దుకాణాలు, బార్లు పెద్దసంఖ్యలో వెలిసి ఇన్‌స్టంట్ మద్యంతో వారిని పిండుకుతింటున్నాయి. ఉదాహరణకు హైదరాబాద్ మూసాపేట పరిసర ప్రాంతాల్లో ఏడు వైన్ దుకాణాలు, ఏడు బార్ అండ్ రెస్టారెంట్లు, మూడు కల్లు దుకాణాలు, అదనంగా బెల్టుషాపులు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మద్యం అమ్మకాల టార్గెట్ 10 శాతం దాకా



ఉండగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తెరాస ప్రభుత్వం ఆ టార్గెట్‌ను 30 నుండి 50 శాతం దాకా తీసుకెళ్తోంది.

**ఏపీలో మద్యంపై చెప్పిందొకటి, చేస్తున్నది ఇంకోటి**

ఆంధ్రప్రదేశ్‌లో మద్యాన్ని ప్రభుత్వమే నిర్వహిస్తూ కట్టడి చేస్తుందని చెప్పిన వైకాపా ప్రభుత్వం తొలి నాళ్లలో షాపుల సంఖ్యను తగ్గించింది. రాష్ట్రవ్యాప్తంగా 4,380 షాపులుంటే, వాటి సంఖ్యను తొలి విడతలో 3,500కి, ఆ తర్వాత 2,940కి కుదించారు. బార్లను 840 నుండి 530కి తగ్గించారు. పర్మిట్ రూంలను రద్దు చేశారు. కొనుగోలుదారులను నిరుత్సాహ పరిచేందుకు పక్క రాష్ట్రాల కంటే మద్యం ధరల్ని భారీగా పెంచేశారు. దీంతో కొంతమేర ఆదాయం తగ్గినా 2019లో ప్రభుత్వానికి మద్యం ద్వారా రూ.17,500 కోట్లు సమకూరింది. ఆదాయం మరీ ఎక్కువ తగ్గకపోవటానికి ప్రభుత్వం అనధికారికంగా టార్గెట్లు పెట్టటం కూడా కారణమని చెబుతున్నారు. ఉదయం 11 నుండి రాత్రి 8 గంటల వరకు మద్యం అమ్మకాలు జరగాల్సి ఉండగా, ఆ తర్వాత లెక్కలు చూసుకోవటానికి మరో గంటను అనుమతించారు. ఆ సమయంలో కూడా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. అలాగే ఎటువంటి పర్యవేక్షణ లేకుండా అమ్మకాలు యధేచ్ఛగా జరుగుతున్నాయి. ప్రభుత్వ ముందుచూపులేని ఆర్థిక, రాజకీయ విధానాల వల్ల రాష్ట్రంలోని ఉత్పాదక శక్తి వికసించకపోవటంతో.. ఆదాయం అవసరమై, మద్యం అమ్మకాల్ని ప్రోత్సహించేలా ధరల్ని ఒక్కసారిగా తగ్గించారు. పర్మిట్ రూంలు లేకపోయినా, దుకాణం వద్దే మద్యం తాగుతున్నా పట్టించుకోవటం లేదు. బాటిళ్ల సంఖ్య నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. 43 వేల బెల్టుషాపుల్ని రద్దు చేశామని చెప్పుకుంటున్నా మొబైల్ బెల్టుషాపులు పలుచోట్ల కనిపిస్తున్నాయి. అదనపు సిబ్బందిని అనధికారికంగా నియమిస్తున్నారు. దీంతో అమ్మకాలు ఇంకా పెరిగాయి. బడ్జెట్ అంచనాలు, ఇతర గణాంకాల్ని బట్టి ఏపీలో మద్యం అమ్మకాలు రూ.20,000 కోట్ల మార్కును దాటేశాయి (2014-15లో ఈ అమ్మకాలు రూ. 11,569.65 కోట్లు). నెలకు రూ.2,000 కోట్లకు పైగా మద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమ్ముతోంది. చౌక బ్రాండ్‌లను సరఫరా చేస్తూ ప్రజల నుండి డబ్బు పిండుతున్న వైకాపా ప్రభుత్వంలోని పెద్దలు ఆ బ్రాండ్‌ల తయారీని తమ ఆశ్రితులకు అప్పగించి భారీగా ఆర్జిస్తున్నారనే (ఈ మొత్తం



రూ.6,000 కోట్ల దాకా ఉంటుందని ప్రతిపక్షాల అంచనా) ఆరోపణల సంగతి అలా ఉంచితే.. సూత్రప్రాయంగా కొన్ని మంచి అంశాలున్న మద్యం విధానాన్ని చేపట్టి కూడా అమలులో అసమర్థంగా వ్యవహరిస్తుండటంతో ఫలితాలు సమకూరటం లేదు. తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుండి బ్రాండెడ్ మద్యాన్ని తెచ్చుకోవటాన్ని అడ్డుకునేందుకు సరిహద్దుల్లో ఆపి వాహనాలను తనిఖీ చేసే ప్రహసనం పట్ల ప్రజల అసహనపూరిత వ్యాఖ్యల్ని చూస్తే ప్రభుత్వం ఎంత మొక్కుబడిగా మద్యం విధానంలో వ్యవహరిస్తోందో అర్థమవుతుంది. ఖజానాకు ఆదాయాన్ని పెంచే మార్గాలను ఏర్పరచుకోకుండా, అదనంగా మద్యం దుకాణాలను తెరిచి భర్తీ చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. అంతకుముందు ప్రభుత్వాన్ని విమర్శించి, మళ్లీ అదే పద్ధతిలో పర్యాటకం పేరుతో దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. మద్యంపై అదనపు రిటైల్ ఎక్సయిజ్ పన్ను వేసి ఆ ఆదాయాన్ని అప్పు చెల్లింపుకి పాతికేళ్ల పూచీకత్తుగా చూపిస్తున్నారు.

**భారత్‌లో ఎక్సయిజ్ పన్ను ద్వారా రూ.1,75,000 కోట్ల ఆదాయం**

భారతదేశంలో ఎక్సయిజ్ పన్ను రూపంలో రాష్ట్రాలు ఏటా రూ.1,75,000 కోట్లు దాకా ఆర్జిస్తున్నట్లు అంచనా. ఈ మొత్తం పెరుగుతోందే తప్ప తగ్గటం లేదు. వీటిలో దాదాపు సగం వాటా ఏపీ, తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాలదే ఉంది.

దక్షిణ భారతదేశంలోనే వేగంగా మద్యం వ్యసనం పెరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉన్నాయి.

ఏడాదికి రూ.50,000 కోట్ల పైచిలుకు మద్యం అమ్మకాలు జరుగుతుండటం తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ, కిట్లు వంటి స్కీములున్నా కూడా అనారోగ్యం కట్టడి కాకపోవటానికి ఒక ప్రధాన కారణంగా ఉంది. దానికితోడు నేరాలు, రోడ్డు ప్రమాదాలు, సోషల్ మీడియా ఆగడాలు పెద్దసంఖ్యలో పెరిగిపోవటానికి మద్యం పెద్ద కారణం. మన దేశంలో చట్టబద్ధపాలన అంతంత మాత్రంగా ఉండటం వల్ల మద్యం దురాగతాలు మరీ పేట్రేగిపోతున్నాయి.

**సంక్షేమం పేరుతో అమలు చేస్తున్న పథకాలకు డబ్బు లేదు కాబట్టే తాగబోయిస్తున్నామంటున్న ప్రభుత్వాలు**

మరోవైపు, ప్రభుత్వాలు తాము చేయాల్సిన పనుల్ని చేయకుండా సంక్షేమం పేరుతో తాత్కాలిక తాయిలాల్ని ఇబ్బడిముబ్బడిగా పంపిణీ చేస్తున్నాయి. ఆ సంక్షేమానికి డబ్బు సరిపోవటం లేదు కాబట్టి, మద్యం అమ్మకాల్ని విస్తరించటం తప్ప తమకు గత్యంతరం లేదన్నట్లు మాట్లాడుతున్నాయి.

కరోనా తొలి దశ ఉధృతి సమయంలో లాక్‌డౌన్ తర్వాత ప్రభుత్వాలకు ఆదాయం లేదు కాబట్టే మద్యం అమ్మకాల్ని ప్రోత్సహిస్తున్నామని, మందుబాబులే ఖజానాను ఆదుకున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మీడియా సమావేశంలోనే వ్యాఖ్యానించారు (కొవిడ్ లాక్‌డౌన్ తర్వాత.. మద్యం విక్రయాలకు అనుమతి ఇవ్వటంతో 2021 జనవరిలో రూ.2,727.15 కోట్లు, ఫిబ్రవరిలో 2,331.65 కోట్లు, మార్చిలో 2,473.89 కోట్ల విక్రయాలు నమోదయ్యాయి). ఏపీలో నవరత్నాల పేరుతో రూపొందించిన స్కీముల అమలుకు మద్యం ఆదాయం కీలకంగా మారింది. మద్యాన్ని విచ్చలవిడి చేయటం పట్ల తీవ్ర అసంతృప్తి ఉన్నవారు కూడా ఇదంతా చూసి.. నిజమే కదా, ఆదాయం లేదు కదా అని ఆ అంశంలో రాజకీయ పార్టీలకవైఖరికి కొంత మినహాయింపు ఇస్తున్నారు.

సంక్షేమం పేరుతో పథకాల అమలుకు మద్యం ఆదాయాన్ని ఆసరా చేసుకునే ధోరణి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఎక్కువైంది. సంక్షేమ పథకాల్ని సంతృప్తస్థాయికి తెచ్చామని చెప్పుకున్న రాజశేఖర్ రెడ్డి.. అందుకు ఆదాయం కోసం మద్యాన్ని కూడా ప్రధాన మార్గం చేసుకున్నారు. బెల్టుషాపులను పెద్దఎత్తున ప్రోత్సహించారు. దీనిపై పోరాటంలో భాగంగా లోక్‌సత్తా మహిళా విభాగం 'మహిళాసత్తా' శ్రీకాకుళం నుండి 'మద్యనియంత్రణ' ఉద్యమాన్ని ప్రారంభించింది. వేల సంఖ్యలో ఉన్న బెల్టుషాపుల వివరాల్ని ముఖ్యమంత్రి, మంత్రులు, మీడియాకు తెలియచేసింది. రాష్ట్రంలో అసలు బెల్టుషాపులే లేవని, ఎక్కడైనా ఉన్నట్టు సమాచారం ఇస్తే వాటిని మూసివేస్తామని మార్చి 8, 2007న అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి.. సాక్షాత్తూ ఆయన సొంత నియోజకవర్గం పులివెందులలో కిళ్లీ షాపుల్లో నడుస్తున్న బెల్టుషాపుల వివరాల్ని సైతం మహిళాసత్తా అందచేయటంతో ఒప్పుకోవాల్సి వచ్చింది. కానీ వాటి కట్టడికి చర్యలు మాత్రం తీసుకోలేదు. చివరికి అప్పటి ఆర్థికమంత్రి రోశయ్య అసెంబ్లీలో మాట్లాడుతూ, బెల్టుషాపులున్నాయని సభాముఖంగానే అంగీకరించారు. సంక్షేమ పథకాలకు ఆదాయం కావాలంటే మద్యం అమ్మకాల్ని పెంచటం తప్పదని తేల్చిచెప్పారు. అంతకుముందు రూ.6,761 కోట్లు ఉన్న మద్యం ఆదాయాన్ని బెల్టుషాపులతో వైఎస్ ప్రభుత్వం 2007 అక్టోబర్ నాటికి రూ.8,500 కోట్లకు పెంచింది.

**ప్రభుత్వాలు చేయాల్సిన అసలు పనులు ఏమిటో గుర్తిస్తే.. మద్యంతో సంబంధం లేకుండానే సంక్షేమాన్ని అందించవచ్చు**

ప్రభుత్వాల్ని ఎందుకు ఏర్పాటు చేసుకున్నామో, అవి చేయాల్సిన అసలు పనులు ఏమిటో గుర్తిస్తే.. మద్యాన్ని ప్రధాన ఆదాయ మార్గం చేసుకోకుండానే ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమాన్ని అందించగలవని గుర్తించగలం. ఆ సంక్షేమం కూడా ఇప్పటిలా తాత్కాలికమైనది, నిరంతరం పేదరికాన్ని కొనసాగించేది కాకుండా.. శాశ్వతంగా ప్రజలకు మెరుగైన జీవితాన్ని, ఆత్మగౌరవంతో తలెత్తుకు బతకగల స్వతంత్ర జీవనాన్ని అందించేదిగా ఉంటుంది. ఇందుకు కావలసిన అన్ని వనరులూ తెలుగు రాష్ట్రాలకు, భారతదేశానికి పుష్కలంగా

ఉన్నాయి. కావలసిందల్లా అవగాహన, రాజకీయ సంకల్పం.

**రాజ్యం మౌలిక బాధ్యతల్లోని సంక్షేమ అంశాలకు తొలి ప్రాధానత్యనివ్వాలి**

కాబట్టి ప్రభుత్వాలు ముందు తాము చేయాల్సిన పనుల మీద స్పష్టత తేవాలి. రాజ్య వ్యవస్థ మౌలిక బాధ్యతల్లో ఉన్న సంక్షేమ అంశాలకు తొలి ప్రాధాన్యతనివ్వాలి. ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాలను 'నిజమైన సంక్షేమ కార్యక్రమాలు'గా గుర్తించి అమలు చేయాలి. అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ వంటి కార్యక్రమాలను ఓటు బ్యాంకు కార్యక్రమాలుగా కాకుండా నాణ్యత, జవాబుదారీతనం ఉండేలా అమలు చేయాలి. ఇందుకోసం ఇప్పుడున్న సంక్షేమ కార్యక్రమాలను సమూలంగా పునస్సమీక్షించాలి. తక్షణావసరం ఉన్నవారికి, నిస్సహాయులకు మాత్రమే తాత్కాలిక సాయాల్ని పరిమితం చేసి, మిగిలినవారికి ప్రభుత్వ మౌలిక బాధ్యతల్లోని సంక్షేమాన్ని మాత్రమే అమలు చేయాలి.

**తాత్కాలిక తాయిలాలను నియంత్రించేందుకు ఎఫ్ఆర్‌బీఎం తరహాలో చట్టం తేవాలి**

తక్షణావసరం ఉన్నవారి సంఖ్యపై ఓటు బ్యాంకు రాజకీయాల్లో పార్టీలు పోటీ పడే అవకాశం ఉంటుంది కాబట్టి, ప్రతి పార్టీ ఆ పరిధిలో కూడా ప్రజలను ఆకట్టుకునేందుకు ఎప్పటికప్పుడు కొత్త పథకాలను ప్రకటించే పరిస్థితి ఇంకా కొనసాగుతోంది కాబట్టి.. పోటీలో వెనుకబడకుండా ఉండే వెసులుబాటును ప్రతి పార్టీకీ ఇస్తూనే తాత్కాలిక తాయిలాలను ఒక పరిధిదాటి ప్రకటించే అవకాశం లేకుండా ఎఫ్ఆర్‌బీఎం తరహాలో ఒక చట్టం తీసుకురావాలి. అప్పుడు తాత్కాలిక తాయిలాలు ఒక పరిధిదాటి ఉండే అవకాశం ఉండదు కాబట్టి, పార్టీలు కూడా ఓటు బ్యాంకు రాజకీయాల నుండి కొంత ఊపిరి పీల్చుకుంటాయి. దళితబంధు తెలంగాణ ప్రభుత్వానికి ఎలా గుదిబండగా మారిందో చూస్తూనే ఉన్నాం. ఆ పథకానికి డబ్బు తేవటానికే సతమతమవుతుంటే, మాక్కూడా 'బంధు'ని వర్తింపచేయాలని పలు కులాల నుండి డిమాండ్లు పెరుగుతున్నాయి. తాత్కాలిక తాయిలాల ఉచితాలు, సబ్సిడీలకు హద్దు గీత గీసే చట్టం వస్తే.. అలాంటి సమస్య గణనీయంగా అదుపులోకి వస్తుంది. ప్రభుత్వం తన మౌలిక బాధ్యతల ద్వారా నిజమైన సంక్షేమాన్ని అందించే అవకాశాలు మెరుగవుతాయి. తాత్కాలిక మద్యాన్ని ఆదాయ మార్గం చేసుకోవటం వంటి ప్రజావ్యతిరేక రాజకీయాలు చేయాల్సిన అవసరం కూడా ప్రభుత్వాలకు తగ్గుతుంది (ఎన్నికల సమయంలో పార్టీలు మేనిఫెస్టోల్లో ప్రకటించే తాత్కాలిక తాయిలాల్లో అనేకం రాజ్యాంగ నిర్దేశాలు, విధులకు విరుద్ధంగా కూడా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఉచితాలపై సుప్రీంకోర్టు స్పందన ప్రాధాన్యత సంతరించుకుంది). దీంతోపాటు, ఎన్నికల విధానంలో ప్రోత్సాహకాల్ని మార్చే సంస్కరణల్నీ తీసుకొస్తే.. రాజకీయం తీరు మౌలికంగా మారి ప్రజలకు అన్ని రకాలుగా వాస్తవ సంక్షేమం సమకూరుతుంది. ప్రభుత్వాలకు ఆదాయం ప్రజల




సాధికారతను బలహీనపరిచే పద్ధతుల్లో, పరిమిత మార్గాల్లో కాకుండా – ప్రజల స్వతంత్ర జీవనం, బహుముఖ, స్థిరమైన మార్గాల నుండి లభిస్తూ సమ్మిళిత, సమగ్ర రీతిలో పెరుగుతూ, ఆర్థిక వ్యవస్థ బలమైన పునాది మీద ఎదుగుతుంది.

**కఠిన మద్యనియంత్రణకూ జాతీయ స్థాయి చట్టం..**

ఇదే సమయంలో, మద్యాన్ని కఠినంగా నియంత్రించేందుకు చట్టాన్ని తీసుకురావాలి. మద్యపానం నైతిక అంశం కాదు, ఇంతకుముందే అనుకున్నట్లు తాగాలా, వద్దా అని నిర్దేశించటం ప్రభుత్వ బాధ్యత కూడా కాదు. అందుకే డబ్బున్నవాళ్ల మద్యపానం గురించి ప్రభుత్వం పట్టించుకోనక్కర్లేదు. కేసీఆర్ ప్రభుత్వ విధానాలు, ఆయన పనితీరు గురించి తప్ప, ఆయన మద్యం తాగుతారా, లేదా వంటి చర్చలు మనకు అనవసరం. కానీ మద్యాన్ని విచ్చలవిడిగా విస్తరించటం వల్ల మన దేశంలో కోట్లాది పేద కుటుంబాలు నలిగిపోతూ, అది ప్రభుత్వ మౌలిక బాధ్యతల నిర్వహణకు కూడా ఆటంకం అవుతోంది కాబట్టి.. మద్యాన్ని నియంత్రించటాన్ని కూడా ప్రభుత్వమే బాధ్యతగా తీసుకోవాలి.

మద్య నియంత్రణలో భాగంగా.. మద్యం అందుబాటులో లేకుండా పరిమిత ప్రాంతాలలో మాత్రమే దుకాణాలను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం వీటి నిర్వహణ బాధ్యతను తీసుకోవాలి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత ప్రభుత్వం ఈ పంథాలోనే ప్రారంభమైనా, సంక్షేమం పేరుతో ఎడాపెడా పందేరాలు చేసే కార్యక్రమాల్ని అభివృద్ధిగా భ్రమిస్తుండటంతో, మద్యాన్ని తిరిగి విచ్చలవిడి చేసే నిర్ణయాలు తీసుకుంది. టార్గెట్లు పెట్టి మరీ రాష్ట్రంలో మద్యాన్ని అమ్మిస్తున్నారు. ఈ అసంబద్ధ ధోరణుల్ని రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే అవకాశం లేకుండా జాతీయ స్థాయిలో మద్యనియంత్రణకు ఒక సమగ్ర విధానాన్ని తీసుకురావటం మేలు. ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, పేదరిక నిర్మూలనకు, చట్టబద్ధపాలన పటిష్ఠపరిచేందుకు తగినటువంటి మద్యం విధానాన్ని రూపొందించటం భారతదేశానికి అవసరం.

స్వతంత్రం వస్తే మద్యనిషేధం అమలు చేయాలని గాంధీజీ

భావించారు. ఆయన, ఇతర జాతీయోద్యమ నేతల ఆలోచనలకనుగుణంగానే రాజ్యాంగ సూత్రాలలో ఈ లక్ష్యాన్ని చేర్చారు. మత్తు పదార్థాల వినియోగాన్ని నిరుత్సాహపరుస్తూ ఆరోగ్య భారతాన్ని నిర్మించాలని పాలకులకు రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశిస్తోంది. మద్యం కారణంగా భారత్‌లో ఏటా 2.60 లక్షల మంది మరణిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ 2018లో తెలిపింది. ఈ సంఖ్యకు రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు వంటివి కలిపితే మద్యం మరణాలు దేశంలో ఐదు లక్షల వరకు ఉంటాయని మరొక అధ్యయనం తెలిపింది. మద్యం ద్వారా వచ్చే ఆదాయం కంటే దాని వల్ల కలిగే ఆరోగ్యపరమైన నష్టం కనీసం 15 శాతం ఎక్కువని నిమ్‌హ్యాన్స్ సంస్థ అధ్యయనం దాదాపు దశాబ్దకాలం క్రితమే స్పష్టం చేసింది. కుటుంబ పెద్దలు మద్యానికి బానిసలు అవుతుండటం మిగిలిన ప్రపంచ దేశాలలో కంటే భారత్‌లో 10శాతం ఎక్కువగా ఉన్నది. పెరుగుతున్న తాగుడుతో ప్రజల వ్యయం పెరిగి, ఉత్పాదకత తగ్గుతుందని, దీనివల్ల భారతదేశం 2011-50 మధ్యకాలంలో రూ.97.89 లక్షల కోట్లు నష్టపోయే ప్రమాదముందని ఇంకొన్ని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఈ మొత్తం నేపథ్యాన్నీ పరిగణలోకి తీసుకుని భారతీయ పరిస్థితుల్లో వాస్తవిక దృక్పథంతో ఒక నిర్ణయాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉంది. మద్యాన్ని నిషేధించటం ఎక్కడా విజయవంతమైన దాఖలాలు లేవు. 2016 ఏప్రిల్ నుండి మద్యనిషేధం అమలులో ఉన్న బీహార్‌నే తీసుకుంటే, మద్యనిషేధం వల్ల అక్రమ సారా వ్యాపారం పెచ్చరిల్లింది. స్పిరిట్, శానిటైజర్లను కూడా కలిపిన సారా తాగి అనేకమంది అస్వస్థత పాలయ్యారు. పలువురు ప్రాణాలు కోల్పోయారు. అక్రమ మద్యం మాఫియా విజృంభించింది. అక్రమ మద్యం మాఫియా, పోలీసులు, ఎక్సయిజ్ సిబ్బంది లాలూచీలో ఖరీదైన మద్యం, కల్తీ మద్యం ప్రజలకు పీడనగా మారాయి. దీంతో తొలుత హర్షం వ్యక్తం చేసి నితీష్ కుమార్‌కి క్షీరాభిషేకాలు చేసిన



మహిళలు కూడా అమలులో మద్యనిషేధాన్ని చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకుపార్టీకి సీట్లు తగ్గటానికి.. బీజేపీ, లోక్‌జనశక్తి పార్టీల ఎత్తుగడలతోపాటు మద్యనిషేధంలో వైఫల్యం కూడా ఒక బలమైన కారణం.

కాబట్టి మద్యనిషేధం కాకుండా కఠిన మద్యనియంత్రణ విధానాన్ని ఆచరణసాధ్యమైన ఏర్పాట్లతో దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. మద్యనియంత్రణ అమలు విజయవంతం కావాలంటే, ప్రజా కమిటీలతో స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉండటం అవసరం. మద్యం బాధితులు కూడా ఉండేలా మహిళలతో కమిటీలను ఏర్పాటు చేసి అక్రమ మద్యం తయారీ, అమ్మకాలు లేకుండా కఠిన మద్యనియంత్రణ అమలు బాధ్యతల్ని అప్పగించాలి. ఎక్సయిజ్ పోలీసు విభాగాన్ని బలోపేతం చేసి ఈ కమిటీలతో వారిని సంధానించాలి. మద్యం వ్యసనపరులు ఆ బానిసత్వం నుండి బయటపడేందుకు డీఎడిక్షన్ సెంటర్లను అన్ని ప్రాంతాల్లో అందుబాటులోకి తెచ్చి విస్తృత ప్రచారం కల్పించాలి. ప్రధాన రహదారుల వెంబడి, విద్యాసంస్థల సమీపంలో, నివాస ప్రాంతాలు వంటి చోట్ల మద్యం దుకాణాలను ఏర్పాటు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

## తొలి ముద్దాయి మద్యం

తాగుడు వ్యసనం కావటం వల్ల నేరాలు పెరుగుతున్నాయని పలు అధ్యయనాలు తెలియచేస్తున్నాయి. తాగుడుకు బానిసవటం మనసుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, మంచిచెడుల మధ్య విచక్షణను నశింపచేస్తుందని, ఎదుటివారిని చంపే లేదా చచ్చే తెగింపును తెచ్చిపెడుతుందని చెబుతున్నాయి. 'మద్యపానం వల్ల దేశంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, 2018లో 7,193 మంది ఈ కారణంగా ఆత్మహత్య చేసుకోగా, 2020 నాటికి ఇవి 9,169కి పెరిగాయని' జాతీయ నేరాల నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక పేర్కొంది. మామూలు సమయంలో ప్రాణం తీసుకునేందుకు వెనుకాడే వ్యక్తి, మద్యం తాగిన తర్వాత మొండి ధైర్యంతో ముందుకు వెళతాడని, ఆత్మహత్యలకు ఇదో పెద్ద కారణంగా కన్పిస్తోందని ఎన్‌సీఆర్‌బీ విశ్లేషించింది. ఇదే సూత్రం ఇతర నేరాలకూ వరిస్తుంది. తెలంగాణలో జరిగిన 'దిశ' ఘటన, 'సమత'పై అత్యాచారం కేసుల్లోనూ మద్యం పాత్ర ప్రధానంగా ఉంది. పోక్సో కేసుల్లో నిందితులందరూ ఘటన సమయంలో మద్యం సేవించి ఉన్నవారే. గృహహింసపై నమోదవుతున్న కేసుల్లో తొలి ముద్దాయి మద్యమేనని, ఇదే విషయమై ఎక్కువమంది బాధితురాళ్లు ఫిర్యాదు చేస్తున్నారని రాచకొండ పోలీసు కమిషనర్ మహేష్ భగవత్ ఇటీవల తెలిపారు. మత్తు ఎక్కువైనప్పుడే తమను హింసిస్తున్నట్లు ఆ మహిళలు చెబుతున్నారన్నారు. వరకట్న వేధింపులు, అనుమానాలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనందించకుండా పైనుండి అమలు చేయాలని చూసే విపరీత కేంద్రీకరణ పాలనకి ఇకనైనా స్వస్తి చెప్పటం అవసరం. అవి బలంగా, జవాబుదారీతనంతో పనిచేస్తే మద్యనియంత్రణే కాదు, జనాభా లెక్కల నుండి అనేక పనులు ఆర్భాటం లేకుండా, తేలిగ్గా పూర్తవుతాయి.

అనేక ప్రపంచ దేశాల్లో మన కంటే ఎక్కువగా మద్యం సేవిస్తారు. భారత్‌లో వార్షిక తలసరి మద్యం వినియోగం 2016లో 5.7 లీటర్లుగా (2004లో అది 2.4 లీటర్లు మాత్రమే) ఉండగా, పలు పాశ్చాత్య, ఆసియా-పసిఫిక్ దేశాల్లో అది అంతకు మూడు నాలుగు రెట్లుగా ఉంది (తెలుగు రాష్ట్రాలతో పోలిస్తే మాత్రం రెండు రెట్లు). కానీ ముఖ్యంగా సంపన్న దేశాల్లో ఇటీవల ఆ ట్రెండ్ మారుతోంది. ఆయా దేశాల్లోని కొత్త తరం యువత మద్యానికి సాధ్యమైనంత దూరంగా ఉంటోంది. మద్యం లేకుండా సరదా పార్టీల్ని ఊహించను కూడా లేని ఆ దేశాల్లో, ఇప్పుడు మద్యరహిత పార్టీలు జరగటం మొదలైంది. కుటుంబసభ్యులతో నాణ్యమైన సమయాన్ని గడిపేందుకు ఇష్టపడుతున్నారు. మనం అగ్రరాజ్యాల్ని, ఇతర దేశాల్ని గుడ్డిగా అనుసరించకుండా, వాళ్ల కంటే మనం ఇంకా చాలా తక్కువ తాగుతున్నాం గదా అనుకోకుండా.. మన పరిస్థితుల్ని, మనకున్న కుటుంబ వ్యవస్థ వంటి బలాల్ని సద్వినియోగం చేసుకునేలా వ్యవహరించాలి. ఇతర దేశాల్లోని మంచి కంటే చెడును వేగంగా తీసుకుంటూ, వారిలాగా కాలక్రమంలో తప్పుల్ని దిద్దుకుందామనకుంటే, ఈ పోటీ ప్రపంచంలో మనం భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. వారికి లభించిన శతాబ్దాలు, దశాబ్దాల సమయాన్ని ప్రపంచీకరణ మనకు ఇవ్వదు. మన

## పెన్షన్ల వెనక దయనీయ గాథల్ని వినండి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గుడుంబా నియంత్రణకు కఠిన చర్యలు తీసుకున్నా, మద్యాన్ని ఆదాయమార్గంగానే కొనసాగించటంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగుడు పెచ్చరిల్లింది. దీంతో అకాల మరణాలతో చిన్న వయసులోనే వితంతువులవుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఈ సామాజిక ఉత్పాతం మీద కొన్ని అధ్యయనాలు జరిగాయి. తెలంగాణ రాష్ట్రంలో సంక్షోభం ఇంకా తీవ్రమైంది. ప్రభుత్వం వితంతు పింఛన్లు ఇవ్వటమే కాదు, అందుకు మూలమైన కారణాలను అన్వేషిస్తే మద్యం వల్ల కలుగుతున్న తీవ్ర దుష్ప్రభావాలు స్పష్టమవుతాయి.

## మద్యం వ్యాప్తికి మన ఎన్నికల వ్యవస్థా కారణమే

మద్యం వ్యాప్తికి ప్రభుత్వాలు అనుసరిస్తున్న మద్యం విధానంతోపాటు రాజకీయం తీరు కూడా కారణమవుతోంది. మన ఎన్నికల్లో డబ్బు, ఇతర ప్రలోభాలతోపాటు మద్యం పంచుడు ఆనవాయితీగా మారింది. కొత్తగా మద్యం అలవాటుకి, మద్యం వ్యసనంగా మారటానికి ఎన్నికలు ఓ ప్రధాన కారణంగా ఉన్నాయి. 2021లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక ఎన్నికల్లో, తెలంగాణలో నాగార్జునసాగర్, హుజూరాబాద్ అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో మద్యం ఏరులై పారింది. ప్రతి ఏరియాలో ప్రధాన పార్టీల నుండి ప్రచారంలో పాల్గొనే వారిలో అత్యధికులకు రోజూ సాయంత్రం మందుతో విందు తప్పనిసరి. ప్రచారంలో పాల్గొన్నవారికి, ఆ తర్వాత ఓటర్లకు పంపిణీ చేయటానికి కొనుగోళ్లు పెరగటంతో ఎన్నికల సమయంలో ఆయా ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో పెరిగాయి. ఆంధ్రప్రదేశ్ స్థానిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలన్నీ కలిపి రూ.6,900 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు ఎడిటర్స్ అసోసియేషన్, జనవిజ్ఞాన వేదిక, బెటర్ ఆంధ్రప్రదేశ్ (బాప్) సంస్థల సంయుక్త అధ్యయనం అంచనా వేసింది. నాగార్జునసాగర్‌లోని 7 మండలాలు, 2 మునిసిపాలిటీల్లో మార్చి 2020లో రూ.7.87 కోట్ల విలువైన మద్యం అమ్ముడుకాగా.. ఎన్నికలు ఉండటంతో 2021 మార్చిలో రూ.18.23 కోట్ల మద్యం విక్రయం జరిగింది. ఎన్నికలు జరిగిన ఏప్రిల్ నెలలో ఈ అమ్మకాల రికార్డు ఇంకా పెరిగింది. హుజూరాబాద్‌లో ఉప ఎన్నికకు మూడు నెలల ముందు నుండీ మద్యం ఏరుల్లా ప్రవహించిందని అమ్మకాల తీరును బట్టి అర్థమవుతుంది. గతంలో ఎన్నడూ లేని రీతిలో మద్యం నిల్వలు హుజూరాబాద్‌కు తరలటం చూసి అధికారులే అవాక్కయ్యారు. ఎన్నికకు నెల రోజుల ముందు నుండీ నియోజకవర్గంలో రోజుకు రూ.కోటికి పైగా మద్యం తరలించారు. ఎన్నికల ప్రచారం ముగియటానికి రెండు రోజుల ముందు సుమారు రూ.3.13 కోట్ల విలువైన మద్యం హుజూరాబాద్‌కు తరలినట్లు అంచనా. ఎన్నికలకు దసరా సీజన్ తోడవటంతో మద్యం జోరు మరింత పెరిగింది.

ఎన్నికల సమయంలో ఓటర్లను మత్తులో ముంచటానికే కాకుండా, ఎన్నికల్లో నల్లడబ్బు ఖర్చుకి పెట్టుబడిని సమకూర్చటానికి కూడా మద్యం ప్రధాన వనరుగా ఉపయోగపడుతోంది. పలువురు రాజకీయ నేతలు బినామీ పేర్లతో మద్యం వ్యాపారులు కూడా. నేర రాజకీయాలకు మద్యం వ్యాపారం ఒక మార్గంగా ఉంది. మద్య నియంత్రణలో భాగంగా ఓట్ల కొనుగోలును కట్టడి చేసేలా ఎన్నికల వ్యవస్థలో కూడా సంస్కరణలు తీసుకురావటం అవసరం. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతిని వంటి మార్పులు తీసుకొస్తే, ఓటర్లను ప్రలోభపెట్టే రాజకీయం మారి సమర్థులు, ఎజెండా ఆధారంగా రాజకీయం చేసేవారు ఎన్నికల్లో ప్రధాన అభ్యర్థులుగా మారతారు.

# మద్యాన్ని గ్రామాల్లో టీ, కాఫీల్లా మార్చిన బెల్ట్‌షాపులు



తెలంగాణ గ్రామాల్లోని పురుషుల్లో ప్రతి ఇద్దరిలో ఒకరు మద్యం తాగుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో బెల్టుషాపులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. బెల్టుషాపులంటే కిరాణా షాపుల్లో, పాన్ బడ్డీల్లో, కల్లు కాంపౌండ్ల పక్కన వంటి చోట్ల నడిచే అనధికార షాపులు. ఈ రకమైన వ్యాపారం నేరం. కానీ వాస్తవాన్ని గమనిస్తే.. వీరేమీ మద్యాన్ని తయారుచేయరు, ప్రభుత్వం అనుమతించిన దుకాణాల నుండే కొనుగోలు చేసి కొంత లాభం వేసి అమ్ముకుంటుంటారు. అంటే, వీరు అధికారుల అండతో చట్టవిరుద్ధంగా వ్యాపారం చేస్తున్నారు. ప్రభుత్వం మద్యం అమ్మకాలకు టార్గెట్లు పెట్టటం, ముడుపులు ముడుతుండటం, ఈ వ్యాపారంలో కూడా పలువురు ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉండటం వల్లే అధికారులు బెల్టుషాపుల్ని పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎప్పుడైనా పైనుండి ఏ అధికారయినా హడావుడి చేసినా, కిందిస్థాయి సిబ్బంది ముందే బెల్టుషాపుల నిర్వాహకుల్ని హెచ్చరించి తప్పించుకునేలా చేస్తున్నారు. లైసెన్స్ మద్యం దుకాణాల వారికి కోపం వచ్చినప్పుడు మాత్రమే ఎక్సయిజ్ వారి ద్వారా బెల్టుషాపుల వారిని ఇరికిస్తున్నారు. కొన్ని మీడియా రిపోర్టుల ప్రకారం, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పల్లె ప్రాంతాల్లో ఉన్న బెల్టుషాపుల్లోని మద్యం అమ్మకాలు లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల్లో అమ్మకాల కంటే ఎక్కువగా ఉంటున్నాయి. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ, కరీంనగర్ జిల్లాల్లో సందుసందులో బెల్టుదుకాణాలున్నాయి. వీటిలో రోజుకు రూ.10,000 - 20,000 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. కరీంనగర్, హనుమకొండ జిల్లాల్లో 7,000కు పైగా బెల్టు దుకాణాలున్నాయని ఎక్సయిజ్ అధికారులే అంచనా వేస్తున్నారు. అధికారులే అనధికారికంగా బెల్టుషాపుల్ని ప్రోత్సహిస్తుండటంతో, కొన్ని చోట్ల గ్రామ పాలకవర్గాలే బెల్టుషాపులకు వేలంపాటల్ని నిర్వహిస్తున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ మొదలైన జిల్లాల్లో ఈ తరహా బహిరంగ రహస్య వేలాలు జరుగుతున్నాయి. మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల జిల్లాలో 762 బెల్టుషాపులున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ 255 గ్రామ పంచాయితీలు ఉండగా, దాదాపు 100 గ్రామాల్లో వేలం పాటల్ని గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ)లే నిర్వహిస్తున్నాయి.

యువత నిర్వీర్యమైపోతే భారత్ వట్టి మార్కెట్‌గా, మధ్యస్థ ఆదాయ దేశంగా మిగిలిపోతుంది. అందువల్ల మన చేతుల్లో లేని ప్రపంచీకరణను ఒక అవకాశంగా మలచుకుని ఇతర దేశాల అనుభవాల నుండి, మన దేశ పరిణామాల నుండి పాఠాలు నేర్చుకుంటూ వేగంగా సరైన విధానాలను అనుసరించటం విజ్ఞతతో కూడిన పని.

కఠిన మద్యనియంత్రణ అమలుకు, తాత్కాలిక తాయిలాల పథకాలను పరిమితి చేసేందుకు జాతీయ స్థాయి చట్టాల్ని రూపొందించాల్సిన, అన్ని రాష్ట్రాల్లో పటిష్ఠంగా అమలు చేయాల్సిన, వ్యవస్థపరంగా కొన్ని మౌలిక మార్పుల్నీ తీసుకురావాల్సిన సమయమిది.

# మద్యనిషేధం కొత్త సమస్యలు తెస్తుంది, కఠిన మద్య నియంత్రణే పరిష్కారం: జేపీ



మద్యనిషేధం వల్ల మాఫియా, కల్తీ మరణాలు పెరుగుతాయి. నిషేధం.. అవినీతిని, నేరాలు, నేరముఠాలను పెంచుతుంది. అంతిమంగా విఫలమవుతుంది. ప్రపంచమంతా అదే రుజువైంది. అలవాటుగా కాకుండా పరిమితిలో తీసుకునేవారి స్వేచ్ఛను హరించే రీతిలో, సౌదీ అరేబియాలోని షరియా చట్టంలాగా మద్యనిషేధం అమలు చేస్తే నైతిక పోలీసింగ్‌లా మారుతుంది. మద్యాన్ని తేలిగ్గా అందుబాటులో లేకుండా కఠినంగా నియంత్రించటం వల్ల పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, జీవనపరంగా చితికిపోకుండా నివారించవచ్చు. తాగి వాహనాలు నడిపేవారిపై స్థానిక న్యాయాలయాల చట్టాన్ని ప్రయోగించి వేగంగా, కఠినంగా శిక్షించాలి. ఈ దిశగా యూనియన్ ప్రభుత్వం, అన్ని రాష్ట్రాలూ ఆలోచన చేయాలి. ●

# సంక్షేమ పథకాలు - అవినీతి కోణం

## - ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్, ఎం. చిదంబరరావు

రాజకీయ పార్టీలు లేదా ప్రభుత్వాలు హామీ ఇచ్చిన/ప్రకటించిన/అమలు చేసిన సంక్షేమ పథకాలు చాలా మేరకు ఓటర్లను తమకు ఓటు వేసేలా ప్రలోభపెట్టటం కోసమేనని ప్రజానీకానికి చాలా స్పష్టంగానే తెలుసు. ఈ రకమైన స్కీముల రాజకీయం అవినీతా, కాదా? వాటి స్థూల పర్యవసానాలేమిటి.. కొంత పరిశీలిద్దాం.

'అవినీతి'కి ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు ఇచ్చే సాధారణ అర్థం: "నామవాచకం – అధికారంలో ఉన్నవారు లంచగొండితనంతో నిజాయతీలేకుండా, మోసపూరితంగా వ్యవహరించటం".

ప్రజల డబ్బును ఖర్చు చేసేటప్పుడు పాటించాల్సిన మౌలిక సూత్రాలపై శతాబ్దాలుగా అనుసరిస్తూ వస్తున్న ప్రమాణాలున్నాయి. 'సంక్షేమ పథకాల ఔచిత్యం' అనే వ్యాసం ఈ అంశాల గురించి స్పష్టంగా తెలియచెప్పింది. 'ఆర్థిక ఔచిత్యానికి సూత్రాలు'గా వాటిని పరిగణిస్తారు. ప్రజల పన్నుల డబ్బు నుండి ఏ రకమైన రాయితీని ఇవ్వాలన్నా, అందుకునేవారికి అది లాభం చేకూర్చేది కాకూడదనేది మరో సూత్రం. సాధారణ ప్రజలకు ఈ మౌలిక సూత్రాల గురించి పెద్దగా ఎరుక లేదు. సంక్షేమ పథకాలను ప్రకటించటం/అమలు చేయటం వెనక రాజకీయ నాయకుల అసలు ఉద్దేశాలపై అభిప్రాయాన్ని వ్యక్తం చేయటానికి వారికి స్పష్టత ఉండటం లేదు.

**ఏ సంక్షేమ పథకమైనా అవినీతి చర్యా, కాదా అని నిగ్గుతేల్చుకునేందుకు ఈ ప్రమాణాలతో పరీక్షించుకోవాలి:**

1. సంకల్పం నిజాయతీగానే, లంచాలను ఆశించకుండానే ఉందా
2. ఆర్థిక ఔచిత్య సూత్రాలు ఉల్లంఘనకు గురికాకుండా ఉన్నాయా
3. డబ్బు రూపంలో, లేదా వస్తు రూపంలో చేస్తున్న సంక్షేమ చెల్లింపులు ఒక వర్గానికి లేదా కొన్ని వర్గాలకు మాత్రమే లబ్ధి చేకూర్చేలా ఉన్నాయా (మిగిలిన సగం జనాభా తమ గురించి పట్టించుకుంటారు కాబట్టి తాము ఏ పనీ చేయాల్సిన అవసరం లేదని జనాభాలో సగం మంది భావిస్తున్నప్పుడు.. తాము పనిచేస్తుండటం వల్ల వేరెవరో లబ్ధి పొందుతున్నారు కాబట్టి తాము పనిచేయటం వల్ల ప్రయోజనం లేదని మొదటి సగభాగం జనాభా అనుకుంటున్నప్పుడు, చాలా దేశాల్లో పతనానికి అదే ప్రారంభం అవుతుంది).

ఈ మార్గదర్శకాలతో ప్రతి పౌరుడూ తమకు హామీ ఇచ్చిన లేదా అమలు చేసిన సంక్షేమ పథకం స్వభావం ఏమిటో అంచనా వేసుకోవచ్చు. కొన్ని వర్గాలకు నగదు పందేరం చేస్తే, సైకిళ్లు, పరికరాలు, నమ్మశక్యంకాని తరహా ప్రోత్సాహకాలు వంటివి



అమలు చేస్తే.. అది అవినీతి పథకంలో భాగమనేది నిర్వివాదాంశం.

మొత్తంగా ప్రజల్ని లేదా కొన్ని వర్గాలని (దీన్నే ఓటు బ్యాంకులను నిర్మించుకోవటంగా చెబుతారు) ప్రలోభ పెట్టటం కోసం, అవినీతి మామూలే అని చెప్పే రకం రాజకీయ నాయకులను తయారుచేయటం కోసమా ప్రజలు ట్యాక్స్‌పేయర్లుగా పన్నుల రూపంలో డబ్బు చెల్లిస్తున్నది? ఎక్కువమంది రాజకీయ నేతలు ఓటర్లను ప్రలోభపెట్టటం ద్వారా గద్దెనెక్కి తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని అవినీతి పద్ధతుల్లో వందల, వేల కోట్ల రూపాయలను పోగేసుకుంటున్నారని అందరికీ తెలుసు. చాలా సందర్భాల్లో, సదరు నేతలు భవిష్యత్ తరాలను తాకట్టు పెట్టి కూడా సంక్షేమ పథకాలకు డబ్బుల కోసం లక్షల కోట్ల రూపాయలను అప్పు తీసుకుంటున్నారు.

రాజకీయ నాయకుల ఈ తీరు విపరీత పర్యవసానానికి దారి తీస్తోంది. జీవితంలో అవినీతి భాగమే అనే ధోరణి ప్రజల్లో, ప్రజాసేవకుల్లో నాటుకుంటోంది. ఇది చాలా ప్రమాదకరం. ఈ ధోరణి ప్రబలితే.. ధర్మాన్ని నిలబెట్టాల్సిన ప్రభుత్వాలు అధర్మాన్ని ఆశ్రయిస్తాయి, మొత్తం పాలనా యంత్రాంగం అవినీతిమయమై పోతుంది, ప్రజల్లోనూ ఎక్కువమంది అవినీతిపరులవుతారు. దీనికితోడు, ప్రజల మధ్య విభజనతో రకరకాల ప్రతికూల అస్తిత్వ బృందాలు తయారై దేశ సమగ్రతకు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. ఈ ప్రమాదాల పట్ల ప్రజలు మేలుకొని అవినీతి కాలుష్యం నుండి జీవన నాణ్యతను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ పరిస్థితిలో మీడియా సానుకూల పాత్ర ఎంతో కీలకం.

# ఓట్ల కొనుగోలు, తాత్కాలిక తాయిలాలు:
# రాజకీయ పద్ధతులను మార్చటమే పరిష్కారం

-డా॥ ఆసయ్య



రాజకీయాలలో గెలవడమే ముఖ్యం. ఎలా గెలిచావు అని అడగరు. కలియుగంలో డబ్బే అన్నింటికి ప్రధానమని అంటారు. డబ్బులు సంపాయించిన తరువాత తృప్తి చెందని నాయకులు అధికారం కోసం పాకులాడతారు. డబ్బు డబ్బుగా అనుభవించలేరు. డబ్బు ఇచ్చి అధికారాన్ని పొందవచ్చు. మనిషి డబ్బు చుట్టూ తిరుగుతుంటే, అందని మనిషి డబ్బులకు అర్రులు జాస్తాడు. అదీగాక డబ్బు ఉచితంగా, అంటే కష్టపడకుండానే వస్తుందంటే మరీ అర్రులు చాస్తూ ఎదురుచూస్తూ ఉంటారు. ఉచితంగా వచ్చే డబ్బుతో హాయిగా బతకొచ్చనే ఆశ. ఓటుకు డబ్బులు కావాలి అని తెలంగాణలోని

ఏ పార్టీ కూడా డబ్బు పంచామని చెప్పుకోదు. ఎందుకంటే వారికి వారే డబ్బు పంచారు. ఇస్తున్నది నిజమే! పుచ్చుకున్నది నిజమే. రెండు వైపులా అంగీకారం ఉన్నట్లే కదా! డబ్బులు ఇస్తున్నారు, తీసుకుంటే తప్పేమిటి అని ప్రజలు అనడం అంటే దాదాపు రాజకీయ పార్టీలు అన్నీ కూడా డబ్బు ఇచ్చి, ఓట్లు కొని గెలుస్తున్నాయని అర్థం. ఇందుకు ఎవర్ని బాధ్యుల్ని చేయాలి? సమాజాన్ని, అది నడిచే తీరునా? రాజకీయ పార్టీలనా?

ఓటు అంటే ఏమిటి, దాని విలువ ఎంత? అని తెలిస్తే ఓటుకు ఓటర్లు డబ్బు అడిగి ఉండేవారు కాదు, ఇవ్వకపోవడం తప్పు అనేవారు కాదు. ఓటును అమ్ముకోకూడదని తెలియకనే డబ్బు తీసుకుంటున్నారు. ఓటుకు డబ్బు తీసుకుంటే.. ఎన్నికైనవారు ఏమి చేసినా ఓటరుకు అడిగే అర్హత ఉండదు కదా! 21 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు ఇవ్వాలని రాజ్యాంగ సభలో ప్రతిపాదించినప్పుడు ఆ చర్చలో ఆచార్య కృపలానీ పాల్గొంటూ, ఓట్లు ఖరీదు చేసి ఎంపీలవుతారన్నారు. నేడు అదే జరుగుతోంది. డబ్బులు ఇవ్వకుండా ఢిల్లీలోని ఒక

> "ప్రజాస్వామ్యాన్ని ఒక వస్తువులా అవమానిస్తున్నారు. ప్రజాస్వామ్యానికి టెర్రరిస్టులు, ఇతర దేశాల నుండి ముప్పు లేదు. మన చర్యలతోనే దాన్ని బలహీనపరుస్తున్నాం. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నాయా, లేదా ఆలోచించుకోవాలి. సామాన్యుల హక్కుల్ని పరిరక్షించాలి. రూల్ ఆఫ్ లా అమలవ్వాలి"
> –జస్టిస్ పరమోద్ కోహ్లి,
> సిక్కిం హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి

> "ఎమర్జెన్సీ విధించినందుకు ఇందిరాగాంధీ ప్రభుత్వాన్ని గద్దె దించిన నాటి చైతన్యం మరోసారి రావాలి"
> – ప్రొఫెసర్ కె.పురుషోత్తం రెడ్డి,
> ఉస్మానియా యూనివర్సిటీ

హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో (30-10-2021) ఓటర్లు సామూహికంగా పలు పార్టీలవారిని అడిగారు. ఓటుకు డబ్బు కవర్లలో పెట్టి నా గుర్తుకే వేయండి అని అడగడం చూశాం. ఇక్కడ ఓటర్లే లైవ్‌లో టీవీ ముందుకొచ్చి మరీ పెద్ద గుంపులుగా డబ్బుకు డిమాండ్ చేశారు. అంటే ఓటును అమ్ముకునే వస్తువుగా వారు పరిగణిస్తున్నారు. అందుకే వారు.. మా ఓటుకు విలువ లేదా? డబ్బులు ఎందుకు ఇవ్వలేదని బహిరంగంగా అడిగారు. ఒక హక్కుగా కాక ఓటును కూడా అమ్ముకునే వస్తువుగా పరిగణించడం వల్ల ఆ ఓటర్లు బహిరంగంగా డబ్బు డిమాండ్ చేశారు.

రాజకీయ పార్టీలు డబ్బులు పంచినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే అధికారులు చర్యలు చేపడతారు. కానీ లోపాయికారిగా డబ్బు ఇచ్చి ఓటు వేయించుకోవడం సర్వసాధారణం అయ్యింది.

రాజకీయ పార్టీ గెలిచామని చాటుకుంటోంది. ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించాలని బీజేపీ శతవిధాలుగా ప్రయత్నించింది. ఓటరుకు చూపని ఆశంటూ లేదు. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా మురికివాడల వారికి నీరు ఉచితం, కరెంటు ఉచితం అనే తీరు ప్రదర్శించి గెలిచింది. తమిళనాడులో ఎన్నో రకాలుగా సౌకర్యాలు ఉచితంగా ఇస్తామన్నారు. రూపాయికే టిఫిన్, ఉచిత భోజనం కల్పించారు. ఇది సంక్షేమ కార్యక్రమంలో భాగమేనని రాజకీయ పార్టీలు చాటుకుంటున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో కూడా సంక్షేమం పేరుతో రాజకీయ పార్టీలు ఇలా చేస్తున్నాయి, అధికారం చేజిక్కించుకుంటున్నాయి. ఈ స్థితిని మార్చేందుకు రాజకీయ పద్ధతులను మార్చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ●

# పెళ్లీడు పెంపు ప్రతిపాదనలో ఔచిత్యమెంత?

మహిళల వివాహ వయసును 18 నుండి 21 సంవత్సరాలకు పెంచుతూ పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో యూనియన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'బాల్య వివాహాల నిషేధ చట్ట (సవరణ) బిల్లు, 2021'పై రాజకీయంగానే కాకుండా సామాజికంగా కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బిల్లు ప్రతిపాదన వచ్చిన సమయం నుండి వ్యక్తమవుతున్న అభ్యంతరాలకు తగిన సమాధానాలిచ్చే ప్రయత్నం కొరవడటంతో శీతాకాల సమావేశాల్లో బిల్లు యధావిధిగా వివాదాస్పదమైంది. దీంతో ప్రభుత్వం బిల్లునయితే వాయిదా వేసి కమిటీకి నివేదించిందిగానీ.. అధ్యయనానికి వేసిన ఆ కమిటీ కూర్పులో కూడా మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించటంపై దృష్టి పెట్టలేదు. ఇవన్నీ చూశాక, 'బేటీ బచావ్ .. బేటీ పఢావ్' కార్యక్రమానికి కేటాయించిన నిధుల్లో డెబ్బై శాతానికిపైగా ప్రచారానికే ఖర్చు పెట్టిన ప్రభుత్వం.. అమ్మాయిల పెళ్లీడు పెంపుదలను కూడా రాజకీయ ప్రచార కోణంలోనే చూస్తోందన్న అభిప్రాయం కలిగితే తప్పేముంది?

మహిళల పెళ్లీడు గురించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని స్వాతంత్ర్య దినోత్సవ సమయంలో ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూన్ 2020లో ఒక టాస్క్‌ఫోర్స్‌ని ఏర్పాటు చేశారు. సమతాపార్టీ నేత జయా జైట్లీ నేతృత్వంలో నలుగురు సభ్యులు ఇందులో ఉన్నారు. వివాహ వయసుకి - గర్భం దాల్చటం, తల్లీబిడ్డల ఆరోగ్యం, శిశు మరణాల రేటు (ఐఎంఆర్), మాతృ మరణాల రేటు (ఎంఎంఆర్), సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్)కి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించటం, జననాల లింగ నిష్పత్తి (ఎస్ఆర్‌బీ), బాలల లింగ నిష్పత్తి (సీఎస్ఆర్) తదితర కీలక ఆరోగ్య, జనాభా గణాంకాలను పరిశీలించటం ఈ టాస్క్‌ఫోర్స్ విధివిధానాల్లో భాగంగా ఉన్నాయి. మహిళల్లో ఉన్నత విద్యను ప్రోత్సహించటానికి తగిన సూచనలివ్వాలని కూడా కమిటీని నిర్దేశించారు.

2020 డిసెంబర్‌లో టాస్క్‌ఫోర్స్ తన నివేదికను ప్రధానమంత్రి కార్యాలయానికి, మహిళా శిశు సంక్షేమ శాఖకు సమర్పించింది. మహిళల వివాహ వయసును 21కి పెంచాలని కమిటీ సిఫార్సు చేసింది. పురుషులకు, స్త్రీలకు వివాహ వయసు సమానంగా ఉండాలన్న హేతుబద్ధతతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జయా జైట్లీ తెలిపారు. అన్ని రంగాల్లో స్త్రీ, పురుషులు సమానమే అని మనం ఒకపక్క చెబుతూ వివాహ వయసులో ఇలా తేడాను పాటించటం సరైన సందేశాన్ని ఇవ్వదు అన్నారామె. టాస్క్‌ఫోర్సు సిఫార్సును యూనియన్ కేబినెట్ ఆమోదించి బిల్లును 2021 డిసెంబరులో పార్లమెంటులో ప్రవేశపెట్టింది.

గర్భధారణ, మాతృత్వం, ఉన్నత విద్య, ఉపాధి తదితర అన్ని విభాగాల నుండి సేకరించిన క్షేత్రస్థాయి సమాచారం ద్వారా చేసిన అధ్యయనంలో 21 ఏళ్ల తర్వాత పెళ్లి చేసుకున్న మహిళలే 18 ఏళ్లకే పెళ్లయినవారి కంటే మెరుగ్గా ఉన్నారని వెల్లడైందనటంలో సందేహం లేదు. 15 నుంచి 19 ఏళ్ల బాలికల మరణాలకు కారణాల్లో గర్భధారణ సంబంధ సమస్యలే అధికమని యునిసెఫ్ అధ్యయనం సైతం స్పష్టం చేస్తోంది. పెళ్లి వయసు 21 ఏళ్లు ఉండటం వల్ల ఎక్కువ చదువుకోవటానికి, స్వతంత్రంగా సంపాదించటానికి పురుషులకు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయన్నది కూడా వాస్తవమే. అలాగే, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం, 2019-2021 కాలంలో 20 నుండి 24 ఏళ్ల మధ్య వయసున్న మహిళల్లో 23.3% మందికి 18 ఏళ్లలోపే పెళ్లయినా.. చట్టవ్యతిరేకంగా 18 ఏళ్లలోపు వయసులో పెళ్లిళ్లు జరగటం 2015-16లో 26.8%తో పోలిస్తే 2019లో పరిస్థితి మెరుగైంది. ఇన్ని సానుకూలతలున్నా.. మహిళల వివాహ వయసు పెంపుపై వచ్చిన విమర్శలు కూడా తోసిపుచ్చలేనివి. ఉదాహరణకు..

- పద్దెనిమిదేళ్లకే మహిళ మేజర్ అయినప్పుడు, ఓటు వేసి తమకు ప్రాతినిధ్యం వహించే నాయకుడు/నాయకురాలిని ఎన్నుకోగలిగినప్పుడు.. ఎప్పుడు వివాహం చేసుకోవాలో ఆమె నిర్ణయించుకోలేదా? 21 ఏళ్ల దాకా పెళ్లి చేసుకోకూడదని ప్రభుత్వం ఎందుకు చట్టపరమైన నిబంధన విధించటం?
- పురుషులకయినా ఇదే వర్తిస్తుంది. 18 ఏళ్ల వయసొచ్చాక, పెళ్లి గురించి పురుషుడు నిర్ణయించుకోలేడా? మరో మూడేళ్ల దాకా (21 ఏళ్లు)



ఎందుకు ఎదురుచూడటం?

- దేశవ్యాప్తంగా అందరికీ సమానంగా వర్తించాల్సిన చట్టాల అమలులో, ప్రభుత్వం తన బాధ్యతగా అందరికీ సమానంగా అందించాల్సిన మౌలికాంశాల్లో ఘోర వైఫల్యాలను సరిచేయకుండా.. ఒకే పౌర స్మృతి అమలుకి హడావుడి పడటం, వివాహానికి వయసును నిర్ణయించటం ఎందుకు?

మహిళ పుట్టింటి వారి సొత్తుగా ఉండాలా, అత్తింటి వారి సొత్తుగా ఉండాలా అనే ఆలోచనా చట్రంలోపలే ప్రభుత్వ బిల్లు ప్రధానంగా తిరుగుతోంది. ఆ చట్రాన్ని ఛేదించి, తన పరిధిలోని మౌలిక సవాళ్లను పరిష్కరించే ప్రయత్నం లేకుండా బిల్లును ప్రవేశపెట్టటమంటే.. మహిళల జీవితాల్లో సానుకూల మార్పు తేవటం కంటే, మహిళల కోసం ఏదో చేసినట్లు కన్పించి రాజకీయ లబ్ధి పొందటం ప్రభుత్వ లక్ష్యంగా ఉన్నట్లు కనిపిస్తుంది.

మన దేశంలో అమ్మాయిలకు త్వరగా వివాహం చేసేయాలనే ధోరణి కేవలం ఆచారం మాత్రమే కాదు, అందుకు తగ్గ భౌతిక పరిస్థితులు కూడా ఉన్నాయని ప్రభుత్వం గుర్తించాలి. ఎదిగిన అమ్మాయికి రక్షణ కల్పించటం, ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా ఆమె చదువుకు, ఇతరత్రా అవసరాలకు ఆర్థిక పెట్టుబడులు వంటి వన్నీ భారమని కుటుంబ పెద్దగా ఉండే తండ్రి, ఆయన్ను అనుసరించి ఆ ఇంట్లోని మహిళలు సహా ఇతర సభ్యులు ఎక్కువగా భావించే సమాజంలో ఉన్నాం. అమ్మాయి అంటే 'ఆడ'పిల్లగా.. ఇంటిపనికే పరిమితమైనా, ఒకవేళ ఉద్యోగం వంటివి చేసినా ఆ ఆదాయం ఆమె భర్తకే చెందుతుందని పిల్ల తల్లిదండ్రులు భావిస్తుంటారు. ఈ కారణంగానే 18 ఏళ్ల వయసు నిబంధన ఉన్నా కూడా ముందుగానే పెళ్ళిళ్లు చేయటం ఇంకా పెద్దసంఖ్యలోనే కొనసాగుతోంది. కులం, రాజకీయం వంటి కారణాలతో ప్రేమ వివాహాలను అడ్డుకోవటానికే ఈ చట్టం ఎక్కువగా ఉపయోగపడుతోంది. బాల్యవివాహాలు కొంతకాలంగా తగ్గుతున్నా.. కొవిడ్ కారణంగా తలెత్తిన ఆర్థిక ఒడిదుడుకులు, విద్య, ఇతర రంగాల్లో సవాళ్ల కారణంగా ఇంకా పెరిగే అవకాశముందని హైదరాబాద్‌కు చెందిన ఆర్థిక, సామాజిక అధ్యయన కేంద్రం (సెస్) రీసెర్చ్ స్కాలర్లు 2021లో వెల్లడించారు. 2025 నాటికి దేశంలో 25 లక్షల మంది బాలికలు బాల్యవివాహాల ముప్పు ఎదుర్కోనున్నారని తెలిపారు. కొవిడ్ వ్యాపించాక గత రెండేళ్లలో తెలంగాణలో సగటున రోజుకు మూడు చొప్పున బాల్యవివాహాలను అడ్డుకున్నట్లు శిశు సంక్షేమ శాఖ తెలిపింది. సంక్షోభం మూలకారణాల్ని పరిష్కరించే ప్రయత్నం చేయకుండా, కేవలం వివాహ వయసును పెంచి, స్త్రీ, పురుషుల సమానత్వం కోసం అని చెప్పటం వల్ల ఒరిగేదేమీ లేదు. వారికి మరిన్ని సమస్యల్ని సృష్టించటం తప్ప. ఇప్పుడున్న చట్టాల్ని ఎలా ఉపయోగించుకోవాలో కూడా తెలియని స్థితిలో పలువురు మహిళలున్నారు. కొవిడ్-19 వల్ల దక్షిణాసియాలో స్త్రీ-పురుషుల అంతరాలు భారీగా పెరగనున్నాయని, పురుషులతో పోలిస్తే కరోనా సమయంలో 19 శాతం అధికంగా మహిళలు ఉద్యోగాలను పోగొట్టుకుంటున్నారని, మహిళల కోసం ప్రభుత్వాలు సమగ్ర సామాజిక వ్యూహాలను అమలు

చేయాలని ఐక్యరాజ్యసమితి అభివృద్ధి పథకం (యుఎన్‌డీపీ) పదేపదే చెప్పినా, ఇప్పటివరకూ మన ప్రభుత్వం తగిన చర్యల్ని తీసుకోలేకపోయింది. ఆర్థిక వృద్ధి రేటు పెరుగుతోంది అని చెప్పుకోవటమే తప్ప, ఉపాధి గురించి, అందులోనూ మహిళల ఉపాధి గురించిన ఊసే లేదు. అందువల్ల వివాహ వయసు పెంపు కన్నా ముందు ప్రభుత్వం తాను అమలు చేయాల్సిన చట్టబద్ధపాలన, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, స్థానిక సాధికారత, చిన్న పట్టణాల అభివృద్ధి, సత్వర న్యాయం తదితర అంశాల్లో పటిష్ఠ చర్యలు చేపట్టాలి. ఇవన్నీ ప్రభుత్వం అదనంగా చేసే పనులు కావు.. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వంగా చేయాల్సిన మౌలిక బాధ్యతలు. ప్రభుత్వం ఈ పనుల్ని సక్రమంగా చేస్తూ సామాజిక సంస్కరణల్ని ప్రోత్సహిస్తుంటే మహిళలకు సాధికారత సమకూరి.. పుట్టింటి సొత్తుగానో, అత్తింటి సొత్తుగానో కాకుండా, వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితమున్న పౌరులుగా ఎదగగలుగుతారు. పిల్లల్ని కనే యంత్రాలుగా కాకుండా, సంతానోత్పత్తిపై తమ హక్కును అందిపుచ్చుకుని స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు. ఎక్కడైనా తలెత్తుకు బతకగల, ఎక్కడికైనా, ఏ సమయంలోనైనా భద్రత గురించి భయం లేకుండా ప్రయాణించగల అవకాశమున్నప్పుడు మహిళల జీవితంలో గణనీయమైన మెరుగుదల చోటుచేసుకుంటుంది.

కాబట్టి, పద్దెనిమిదేళ్లకు మేజర్ అయినా వివాహానికి అదనంగా కొంత వయసు అవసరం అనటానికి శాస్త్రీయ, తార్కిక కారణాలున్నా కూడా.. ప్రభుత్వం తన పాత్రను తాను సక్రమంగా నెరవేరిస్తే, మహిళలకైనా, పురుషులకైనా పెళ్లీడు 21 ఏళ్లు అని నిర్దేశించాల్సిన అవసరం ప్రభుత్వానికి ప్రత్యేకించి ఉండదు. 18 ఏళ్ల వయసొచ్చి వయోజనులైన యువతీయువకులే ఆ మేరకు విజ్ఞతతో నిర్ణయం తీసుకోగలుగుతారు. ప్రభుత్వం తాను సమకూర్చాల్సిన ఉమ్మడి ప్రయోజనాలకు, పౌరులు తమ పరిధిలో నెరవేర్చుకునే ఉమ్మడి ప్రయోజనాలకు భంగం వాటిల్లే పరిస్థితుల్లో నియంత్రణకు.. మాత్రమే పరిమితం కావాలి.

ఈ నేపథ్యంలో, చర్చ.. మహిళల వివాహ వయసు పెంపు మీద కన్నా రాజ్యవ్యవస్థ చేయాల్సిన మౌలిక బాధ్యతల మీద జరగటం మేలు.

## ప్రభుత్వాలపై తగ్గిన విశ్వాసం




కొవిడ్ మహమ్మారి వచ్చాక అంతర్జాతీయంగా గత ఏడాది కాలంలో ప్రభుత్వాలు, మీడియాపై విశ్వాసం తగ్గిందని ఓ సర్వే వెల్లడించింది. బూటకపు వార్తల పట్ల ఆందోళనలు మునుపెన్నడూలేని గరిష్ఠ స్థాయికి చేరాయని తెలిపింది. భారత్ సహా 28 దేశాల్లో సర్వే నిర్వహించారు. ఇటీవల విడుదల చేసిన ఎడెల్మన్ ట్రస్ట్ బారోమీటర్ నివేదిక ప్రకారం..

+ తప్పుడు సమాచారం, బూటకపు వార్తలను ఇతరులు తమ ఆయుధాలుగా ఉపయోగించుకునే ముప్పుందని వివిధ దేశాల్లో 76% మంది ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో 82% మంది ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. నెదర్లాండ్స్, జపాన్, ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీల్లో మాత్రం ప్రజలు బూటకపు వార్తలపై మరీ ఎక్కువ ఆందోళన వెలిబుచ్చలేదు.

+ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారాలు, ప్రభుత్వాలు, మీడియాపై సగటు విశ్వాసం పరంగా చూస్తే.. జాబితాలో చైనా అగ్రస్థానంలో ఉంది. భారత్ నాలుగో స్థానంలో ఉంది. రష్యా అట్టడుగున ఉంది.

+ ఆర్థిక ఆశావాదం విషయంలో భారత్ టాప్-5లో స్థానం దక్కించుకుంది.

+ భారత్‌లో వ్యాపారాలు, ప్రభుత్వం, మీడియాపై విశ్వాసం తగ్గగా, స్వచ్ఛంద సంస్థల విషయంలో అది స్థిరంగా ఉంది.

+ అత్యధిక దేశాల్లో ప్రజలు ప్రభుత్వాలతో పోలిస్తే వ్యాపారాల మీదే ఎక్కువ నమ్మకం వ్యక్తం చేశారు.

# దీర్ఘకాలిక దృష్టిని ప్రదర్శించారు గానీ..

# కొన్ని కీలక అవకాశాల్ని జారవిడిచారు

## -యూనియన్ బడ్జెట్ 2022-23పై జేపీ-

యూనియన్ బడ్జెట్ 2022-23లో చాలా ఆహ్వానించదగ్గ అంశాలు, అదేసమయంలో కొన్ని తీవ్రంగా నిరాశపరిచే విషయాలూ ఉన్నాయని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

ఒక దీర్ఘకాలిక దృష్టితో మంచి ప్రయత్నం తాజా బడ్జెట్‌లో జరిగిందని జేపీ అన్నారు. తాత్కాలికంగా తాయిలాలు చూపటమో, ఎర వేయటమో కాకుండా.. నిజంగా పేదరికాన్ని తొలగించటానికి, ఉపాధిని పెంచటానికి, మన ఆర్థిక వ్యవస్థ సౌష్ఠవాన్ని పెంచటానికి దీర్ఘకాలిక ఏర్పాట్ల కోసం గట్టి ప్రయత్నం సంక్షోభ సమయంలో జరిగిందన్నారు.



"గత రెండేళ్లుగా మన దేశంలో, ప్రపంచవ్యాప్తంగా కూడా ప్రభుత్వాలకు ఆదాయాలు తగ్గాయి, ఖర్చు పెరిగింది. కానీ ఈ సమయంలో కూడా దాదాపు 35% పెట్టుబడుల్ని బడ్జెట్‌లో పెంచారు. సాదర ఖర్చులకు కాకుండా, రేపు మన పిల్లల భవిష్యత్తుకు పనికొచ్చే పెట్టుబడులు- రోడ్ల విస్తరణ కావచ్చు, నగర ప్రాంతాల అభివృద్ధి, గృహ నిర్మాణం, ఇతర ప్రాజెక్టులు కావచ్చు- సుమారు రూ.7 లక్షల 50 వేల కోట్లు ఈ ఏడాది ప్రతిపాదించారు. ఈ క్రమంలో రాష్ట్రాలకి జాతీయ స్థాయి నుండి వడ్డీ లేని రుణాలు, ఇతరత్రా గ్రాంట్లు రూ. లక్ష కోట్ల వరకూ ప్రకటించారు. యాభై ఏళ్లు వడ్డీలేని రుణాలు అంటే అంటే దాదాపు ఉచితంగా ఇచ్చినట్లే. ఇలా ప్రభుత్వాల నుండే దాదాపు రూ.10,68,000 కోట్లు పెట్టుబడులు వస్తున్నాయి. ఇది చాలా గొప్ప విజయం. బహుశా మన చరిత్రలో ఒక ఏడాది ఇంత ఎక్కువ పెట్టుబడి పెంచటం జరగలేదు. మూడేళ్లలో రెండున్నర, మూడు రెట్ల పెంపు, అదీ ఒక సంక్షోభ సమయంలో అంటే, గణనీయ విజయం.

"రెండోది, ఆర్థిక క్రమశిక్షణను పాటించారు. ఆదాయాలు తగ్గుతూ ఖర్చులు పెరుగుతుంటే, దీర్ఘకాలిక క్రమశిక్షణ లేకుంటే మన పిల్లలు మనం చేసిన అప్పుల భారాన్ని భరించాల్సి వస్తుంది. ఇప్పటికే మన దేశం జాతీయాదాయంలో దాదాపు 90 శాతం మేర ప్రభుత్వాల అప్పులు ఉన్నాయి. వీటికి చెల్లించే వడ్డీ కోసం మనందరం పన్నులు వంటి రూపాల్లో ఏడాదికి 5-6% చెల్లిస్తున్నాం. దీనికి కళ్లెం వేసే ప్రయత్నం చేశారు. మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి అప్పులు అవసరమేగానీ, మరీ ఎక్కువైతే ప్రమాదం. ఆ ద్రవ్యలోటును కట్టడి చేసే ప్రయత్నం బడ్జెట్‌లో కన్పించింది. ఈ ఏడాది ఆ లోటు 6.9% ఉన్నా, వచ్చే ఏడాది 6.4కు, మూడేళ్లలో 4 శాతం పరిధిలోకి తెస్తామన్నారు" అని జేపీ వివరించారు.

అయితే బడ్జెట్‌లో బాగా నిరాశపరచిన అంశం ఆరోగ్యరంగంలో సరైన ఏర్పాట్లకు కనీస ప్రయత్నం కూడా కొరవడటమని జేపీ అన్నారు.

"కొవిడ్ మహమ్మారి ప్రభావం ఇంకా కొనసాగుతూనే ఉంది. కొవిడ్ తీవ్రత వల్ల ఎన్ని లక్షల మంది అకాల మరణం పాలయ్యారో, అప్పుల పాలయ్యారో, ఉపాధిని కోల్పోయారో, పొట్ట చేత పట్టుకుని వలసలు పోయారో మనం కళ్లారా చూశాం. కొవిడ్ వల్లే ఈ సంక్షోభం రాలేదు. కొవిడ్ కేవలం మన ఆరోగ్య వ్యవస్థలోని ఘోరవైఫల్యాలను బట్టబయలు చేసింది. కేవలం అనారోగ్యం కారణంగా మన దేశంలో ఏడాదికి 6 కోట్ల మంది అప్పటివరకూ పేదలు కానివారు పేదరికంలోకి జారిపోతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోనే 50 లక్షల మంది ఇలా పేదలవుతున్నారు. ప్రభుత్వం ఇంకేమీ చేయకుండా కేవలం మంచి ఆరోగ్యాన్ని ఆర్థిక భారం లేకుండా ప్రజలకు అందిస్తే, పదేళ్లలో పేదరికం పోతుంది. ఇంత కీలక ఘట్టంలో కూడా సమగ్ర ఆరోగ్య వ్యవస్థను నిర్మించే అవకాశాన్ని బడ్జెట్‌లో జారవిడిచారు. జేబుఖర్చు లేకుండా ప్రజలందరికీ ప్రాథమిక స్థాయి నుండి సూపర్ స్పెషాలిటీ వరకూ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే వినూత్న పథకాన్ని లోక్‌సత్తాయే రూపొందించి

# బడ్జెట్ ఆదాయ వ్యయాల తీరు

**రూ. 39,44,909 కోట్లతో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్‌లో 24% వడ్డీలకే పోతుంది. నాలుగింట మరో వంతు రక్షణ, రవాణా, రాష్ట్రాలకు వెళ్తుంది. మిగిలిన రెండొంతులను వివిధ్న రంగాలకు ప్రాధాన్యతా క్రమంలో ఖర్చు చేస్తారు. ఇందులోనూ అత్యధికం పింఛన్లు, సబ్సిడీలకే వెళ్తుంది. 2022–23లో రెవెన్యూ వసూళ్లు రూ.22,04,422 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం రూ.31,94,663 కోట్లు. మూలధన వసూళ్లు 17,40,487 కోట్లు, మూలధన వ్యయం 7,50,246 కోట్లు. కొత్త ఏడాదిలో స్థూల అప్పులు 14,95,000 కోట్లు.**

ప్రభుత్వాలకు అందించింది. ఇందుకయ్యే ఖర్చు అదనంగా కేవలం రూ. లక్ష కోట్లు. అంటే, జాతీయాదాయంలో 0.4%. యూనియన్, రాష్ట్రాలు కలిపి ఈ ఖర్చును భరించినా తెలిగ్గా అమల్లోకి వచ్చి ప్రజలందరికీ ఆరోగ్యం అందేది. కోట్ల మంది ఉత్పాదక శక్తి పెరిగి, పేదరికం తొలగేది, దేశం ఆర్థికంగా ఎంతో బలపడేది. ఇప్పటికైనా మేలుకొని ఏడాదిలోగా ఈ సమగ్ర ఆరోగ్య పథకాన్ని అమల్లోకి తేవాలి" అని జేపీ విజ్ఞప్తి చేశారు.

అలాగే పన్ను చెల్లింపుల్లో పొరపాట్లను సవరించుకునే అవకాశం కల్పించటాన్ని కూడా జేపీ అభినందించారు.

మరోవైపు, భూతాపం సమస్యపై నిర్దిష్ట భవిష్యత్ ప్రణాళికలతో దృష్టి పెట్టటం కీలకాంశమని జేపీ అన్నారు. "భూతాపం వల్ల మహమ్మారులు విజృంభించటం సహా పలు సమస్యల్ని ఎదుర్కొంటున్నాం. తొలిసారి ఈ సంక్షోభం మీద దృష్టి పెట్టి ఉపాధి అవకాశాలతో కూడిన పర్యావరణహిత అభివృద్ధికి అడుగులు ప్రారంభించారు" అన్నారు.

నగరాల అభివృద్ధి మీద కూడా బడ్జెట్ దృష్టి పెట్టటం మంచి పరిణామమని, అయితే చిన్న పట్టణాల అభివృద్ధి ప్రయత్నాలు లేవని జేపీ అన్నారు.

"మన నగరాల నిర్మాణం, నిర్వహణ అధ్వాన్నంగా ఉండటం వల్ల కోట్ల మంది వలస కార్మికులు ఎన్ని అవస్థలు పడ్డారో కొవిడ్ ఉధృతిలో చూశాం. నగరాలను జీవనయోగ్యంగా మార్చటంతోపాటు ప్రజలు సుదూర ప్రాంతాలకు పొట్ట చేత పట్టుకుని వలసలు పోవాల్సిన అవసరం లేకుండా చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి. చిన్న పట్టణాల అభివృద్ధి మీద ఈ బడ్జెట్ దృష్టి పెట్టలేదు. చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయటం వల్ల ప్రజలు గ్రామాల్లో ఉంటూనే విద్య, ఆరోగ్యం సహా అన్ని సౌకర్యాలనూ పొందగలుగుతారు, సంపద సృష్టిలో భాగం కాగలుగుతారు. చిన్న పట్టణాల అభివృద్ధి లేకుండా గ్రామీణ ప్రజలకు న్యాయం చేయలేం" అని జేపీ అన్నారు.

వ్యవసాయంలో ఆదాయం పెంచటం దేశాభివృద్ధికి ఎంతో కీలకమైనా, ఇటీవలి వ్యవసాయ చట్టాల ఉపసంహరణ నేపథ్యంలోనో ఏమో ఆ ప్రధానరంగాన్ని పక్కనపెట్టారని జేపీ అన్నారు. ఈ వైఫల్యాన్ని వేగంగా సరిదిద్దుకోవాలన్నారు.

ఇక సామాన్యుడికి భద్రత, ఆర్థిక వ్యవస్థకు పెద్దఎత్తున ఊతం ఇచ్చే చట్టబద్ధపాలన అమలు గురించి బడ్జెట్‌లో



పట్టించుకోలేదని జేపీ విమర్శించారు. "పోలీసు, ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్, న్యాయస్థానాలు.. వీటిని వేగంగా సంస్కరించి చట్టబద్ధపాలనను పటిష్ఠం చేయకపోతే, ఆర్థిక వృద్ధి పరిమితంగానే కొనసాగుతుంటుంది" అన్నారు.

"ఒక బడ్జెట్‌తో అన్ని సమస్యలూ పరిష్కారం కావు. దీర్ఘకాలిక దృష్టితో నిలకడగా కృషి జరగాలి. ఇలా దీర్ఘకాలిక దృష్టితో దృఢసంకల్పంతో తదేకంగా పనిచేయబట్టే చైనా కొన్నేళ్లలో ప్రపంచస్థాయి దేశంగా ఎదిగింది. మనం కూడా ఏడాదికి 8–9% ఆర్థిక ప్రగతిని కొనసాగిస్తూ, విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, నాణ్యమైన పౌర సేవలు మొదలైన అంశాల మీద దృష్టి పెట్టాలి. ప్రభుత్వాలు చేయాల్సింది ఈ పనులే తప్ప, ఫ్యాక్టరీలు నడపటం, కార్లు తయారు చేయటం, టెలికాం వ్యాపారం కాదు.

"యూనియన్ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రదర్శించిన దీర్ఘకాలిక దృష్టిని కొనసాగిస్తుందని, అందరికీ నాణ్యమైన ఆరోగ్యం, విద్య, ఉపాధి నైపుణ్యాలు, అవకాశాలు, చట్టబద్ధ పాలన వంటి తన మౌలిక విధుల్లో కొరతల్ని అధిగమిస్తుందని ఆశిద్దాం" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

# వేగంగా కోలుకున్న భారత ఆర్థిక వ్యవస్థ

ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ తిరిగి గుర్తింపు పొందనుందని ఆర్థిక సర్వే వెల్లడించింది. కొవిడ్ వల్ల ఏర్పడిన ఒడిదుడుకులను, అంతరాయాలను అధిగమించటమే కాకుండా ఈ ఆర్థిక సంవత్సరం జాతీయాదాయంలో 9.2 శాతం వృద్ధిని, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 8-8.5 శాతం వృద్ధిని సాధించవచ్చని అంచనా కట్టింది. ఆర్థిక వ్యవస్థకు ఆసరా ఇవ్వగలిగే స్థితిలో ప్రభుత్వం ఉందని తెలిపింది. కొవిడ్ టీకా వల్లే ఇది ప్రధానంగా సాధ్యమైందని స్పష్టం చేసింది. అందుకే కొవిడ్ వ్యాక్సినేషన్‌ని ఆరోగ్య రంగానికి సంబంధించిన అంశంగానే భావించకూడదని, స్థూల ఆర్థిక సూచీగా పరిగణించాలని పేర్కొంది. స్థూల ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన సూచీలను పరిశీలిస్తే భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవటానికి భారత్ సన్నద్ధంగా ఉందని వివరించింది. దేశంలో వ్యాక్సినేషన్ విస్తృతంగా జరగటం, సరఫరా రంగంలో సంస్కరణలు చోటుచేసుకోవటం, ఆంక్షల సడలింపు వంటి పరిణామాలు వచ్చే ఏడాది ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలవనున్నాయని తెలిపింది.




ఆర్థిక వ్యవస్థ పోకడలను వివరించే 2022 ఆర్థిక సర్వే నివేదికను ఆర్థిక మంత్రి పార్లమెంటుకు సమర్పించారు. ఇందులో వివిధ దేశీయ, అంతర్జాతీయ సంస్థల గణాంకాల క్రోడీకరణతో దేశం ఉన్న స్థితిని పేర్కొనటం తప్ప పెద్దగా దిశానిర్దేశం కొరవడిందన్న విమర్శలు ఉన్నా.. భారత్‌కున్న సానుకూలావకాశాల్ని బలంగా ఆవిష్కరించటంలో ఈ పత్రం సఫలమైంది.

అంతర్జాతీయ ద్రవ్యోల్బణం, మహమ్మారి సంబంధ అనిశ్చితి కారణంగా పొంచి ఉన్న అవరోధాలను కూడా ఆర్థిక సర్వే ప్రస్తావించింది. కొవిడ్ ముందునాటితో పోలిస్తే ప్రస్తుత జీడీపీ 1.3 శాతం ఎక్కువగా ఉందని నివేదిక రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన ముఖ్య ఆర్థిక సలహాదారు సంజీవ్ సన్యాల్ తెలిపారు.

**ఆర్థిక సర్వేలోని ముఖ్యాంశాలు:**

- వచ్చే ఏడాది పెట్రోల్ ధరలు పీపాకు 70-75 డాలర్లు ఉండొచ్చన్న అంచనాల ప్రాతిపదికన సర్వేలో లెక్కలు కట్టారు. అయితే ప్రస్తుతం ఆ ధర 90 డాలర్లుగా ఉంది. రాబోయే సీజన్‌లో సాధారణ వర్షపాతం ఉండవచ్చని, వివిధ దేశాల కేంద్రీయ బ్యాంకులు ఒక క్రమపద్ధతిలో ద్రవ్య లభ్యతను తగ్గించుకోవచ్చన్న అంచనాలూ దీనికి ప్రాతిపదిక అయ్యాయి.
- 2022-23 ఆర్థిక సంవత్సర వృద్ధి రేటుకు సంబంధించి సర్వేలో పేర్కొన్న అంచనాలు.. ప్రపంచ బ్యాంకు అనుగుణంగానే ఉన్నాయి. అయితే అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) వేసిన 9 శాతం అంచనా కన్నా ఇది తక్కువగా ఉంది. ఎస్ అండ్ పీ, మూడీస్ కట్టిన లెక్కల కన్నా ఇది స్వల్పంగా ఎక్కువగా ఉంది.
- 2022-23లో అంచనా వేసిన 8-8.5 శాతం వృద్ధి అనేది తక్కువ ప్రాతిపదికన రూపొందించినది కాదు. 2021-22లో వాస్తవ వృద్ధి జీడీపీ 9.2 శాతంగా ఉండవచ్చని ముందస్తు అంచనాలు చెబుతున్నాయి. కొవిడ్ ముందునాటి (2019-20) ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు ప్రాతిపదికన చూస్తే దాన్ని 10 శాతంగా పరిగణించొచ్చు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్నుల రాబడి పెరిగింది. దీంతో ప్రభుత్వ పెట్టుబడి వ్యయాన్ని కొనసాగించటానికి, అవసరమైతే పెంచటానికి సర్కారుకు వెసులుబాటు లభించింది. 2021-22 బడ్జెట్‌లో పేర్కొన్న 6.8 శాతం ద్రవ్యలోటుకు పరిమితం కావటానికి ఇది వీలు కల్పిస్తోంది.
- గత రెండేళ్లలో కరోనా ఉధృతి వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ రెండుగా చీలింది. ఎంఎస్ఎంఈ రంగాలు, వాణిజ్యం, రవాణా, పర్యాటకం, చిల్లర వ్యాపారం, హోటల్, వినోదం వంటి రంగాలు ఒక భాగంలో ప్రతికూల ప్రభావాన్ని ఎదుర్కొన్నాయి. కొవిడ్ ప్రభావం నుండి అవి ఇంకా బయటపడలేదు. మరోవైపు కొన్ని రంగాలు కరోనాను సమర్థంగా తట్టుకున్నాయి. మహమ్మారి సమయంలోనూ వృద్ధి సాధించాయి. మొత్తంగా.. 2019-20లో సేవారంగం వాటా 55 శాతంగా ఉండగా, 2021-22లో అది 53 శాతానికి తగ్గింది.
- కొవిడ్-19ను వ్యవసాయం బాగా తట్టుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ రంగం 3.9 శాతం మేర వృద్ధిని సాధించే అవకాశముంది. గత ఏడాది వృద్ధి 3.6 శాతం. పంట మార్పిడికి, సేద్యానికి సంబంధించిన అనుబంధ రంగాలకు, నానో యూరియా వంటి ప్రత్యామ్నాయ ఎరువులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యవసాయ పరిశోధన, అభివృద్ధి, సేంద్రియ సాగును మరింత పెంచాలి.
- అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, మత్స్య వంటి విభాగాల వల్ల వ్యవసాయ కుటుంబాలకు స్థిరమైన ఆదాయం అందుతోంది. వారి

# ఆంధ్రప్రదేశ్‌లో భారీగా పడిపోయిన సేవల రంగం వృద్ధిరేటు

- ఆంధ్రప్రదేశ్‌లో సేవల రంగం వృద్ధిరేటు భారీగా పడిపోయింది. గత మూడేళ్లుగా ఇది తిరోగమనంలో సాగుతోంది. 2018-19లో 8.24%, 2019-20లో 6.20%గా నమోదైన ఈ రంగం వార్షిక వృద్ధిరేటు 2020-21లో మైనస్ 6.71%కి పడిపోయిందని ఆర్థిక సర్వే వెల్లడించింది. రాష్ట్ర స్థూల అదనపు విలువలో ఈ రంగం వాటా 2018-19లో 42.25% ఉండగా, 2019-20లో 41.86%, 2020-21లో 41.64%కి పడిపోయింది. తెలంగాణలోనూ సేవల రంగం వృద్ధి రేటు మూడేళ్లుగా క్రమంగా తగ్గుతోంది. 2018-19లో 7.91% ఉన్న ఈ వృద్ధిరేటు 2019-20లో 5.69 శాతానికి చేరింది. 2020-21లో అది ఏకంగా మైనస్ 3.94 శాతానికి పడిపోయింది.
- ఆంధ్రప్రదేశ్‌లో మెరుగైన పారిశుద్ధ్య వాతావరణంలో జీవించేవారి సంఖ్య తగ్గిపోయింది. చక్కటి పారిశుద్ధ్య వసతులున్న ఇళ్లలో నివసించే జనసంఖ్య 2015-16 ఆరోగ్య సర్వే-4 ప్రకారం 77.3% ఉండగా, 2019-21 ఆరోగ్య సర్వే-5 నాటికి 54.4%కి పడిపోయింది. వంట కోసం శుద్ధ ఇంధనం వాడే కుటుంబాల సంఖ్య ఇదివరకు 83.6% ఉండగా, తాజాగా 62%కి పడిపోయింది.
- విశాఖ పోర్టులో సరకు రవాణాకు వెచ్చించే రోజులు దేశంలోనే అత్యధికం.
- లక్ష హెక్టార్లలో ప్రకృతి సేద్యంతో ఆంధ్రప్రదేశ్ దేశంలో తొలిస్థానంలో ఉంది.
- నీతి ఆయోగ్ విడుదల చేసిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచి 2020-21లో ఆంధ్రప్రదేశ్ 4వ స్థానంలో నిలిచింది. దేశంలోని కోస్తా రాష్ట్రాలపరంగా చూస్తే ఒడిషా తర్వాతి స్థానాన్ని ఏపీ దక్కించుకుంది.
- మైనస్‌లో నికర ఉత్పత్తి రేటు: ఉమ్మడి రాష్ట్ర విభజన జరిగిన తొలి ఆరేళ్లలో రెండంకెల మేర నమోదైన ఆంధ్రప్రదేశ్ నికర ఉత్పత్తి వృద్ధి రేటు 2020-21లో ఏకంగా 1.6%కి పడిపోయింది. 2011-22 సిరీస్‌ను అనుసరించి తాజా ధరల ప్రకారం ఏపీ నికర ఉత్పత్తి వృద్ధి రేటు.. 2014-15లో 14%, 2015-16లో 15.7%, 2016-17లో 12.4%, 2017-18లో 15,3%, 2018-19లో 10.8%, 2019-20లో 11.3% నమోదు కాగా, 2020-21లో మాత్రం 1.6%కి పడిపోయింది. రాష్ట్ర నికర ఉత్పత్తి విలువ 2019-20లో రూ.8,70,064 కోట్లుగా నమోదు కాగా.. 2020-21లో రూ.8,84,199 కోట్లకు, తలసరి నికర ఉత్పత్తి విలువ రూ.1,68,480 నుండి రూ.1,70,215కి చేరింది.

నెలవారీ ఆర్జనలో అది 15 శాతంగా ఉంటోంది.

- పంట మార్పిడికి సాధనంగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ను యూనియన్ ప్రభుత్వం ఉపయోగించుకుంటోంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయంతో పనిచేయాలి. తద్వారా అధిక విలువ కలిగిన పంటల వైపు మళ్లటంతోపాటు, పంటలకు నీటి వినియోగాన్ని తగ్గించాలి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయటానికి ఇది దోహదపడుతుంది.
- డ్రోన్లు, కృత్రిమ మేధ ఆధారిత విధానాలను విరివిగా వినియోగించాలి. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి.
- **ఎరువుల రాయితీ రూ.85,300 కోట్లు:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి 9 నెలల్లో ఎరువులపై ప్రభుత్వ రాయితీ రూ.85,300 కోట్లు. దేశీయంగా ఎరువుల ఉత్పత్తి 2.85 లక్షల కోట్ల టన్నులకు చేరింది. 2020-21లో ఎరువులపై ఇచ్చిన రాయితీ రూ.1,38,500 కోట్లు.
- **మెరుగుపడ్డ ఉపాధి సూచికలు:** కొవిడ్ వల్ల విధించిన లాక్‌డౌన్‌తో 2020 ఏప్రిల్-జూన్‌లో దేశవ్యాప్తంగా ఉపాధికి సంబంధించిన భిన్న సూచికలు భారీగా పడిపోయాయి. ప్రస్తుతం అవి కోలుకొని, తిరిగి వృద్ధి బాట పట్టాయి. పట్టణాల్లో ఉపాధి మెరుగుపడింది. కొవిడ్ రెండో ఉధృతిలో.. అసంఘటిత నుండి సంఘటిత రంగంలోకి ఉద్యోగాల మార్పిడి జరిగినట్లు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) చందాదారుల సంఖ్య సూచిస్తోంది. ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకోవటంతో నిరుద్యోగిత రేటు, కార్మిక శక్తి భాగస్వామ్య రేటు, కార్మిక జనాభా రేటు.. దాదాపుగా కొవిడ్ ముందునాటి స్థితికి చేరాయి. 2020లో దేశవ్యాప్త లాక్‌డౌన్ కాలంలో ఉపాధి హామీ పథకంలో చేరిన వారి సంఖ్య గరిష్ఠ స్థాయికి చేరింది.
- **అంతరిక్షంలో ప్రయివేటు రంగం:** రోదసి రంగంపై ప్రయివేటు రంగం, విద్యాసంస్థల ఆసక్తి పెరుగుతోంది. వాహకనౌకల తయారీ నుండి భూ పరిశీలన కోసం ఉపగ్రహాలను పంపటం వరకూ వివిధ అంశాలకు సంబంధించి 40 ప్రతిపాదనలు ఈ సంస్థల నుండి వచ్చాయి. ఈ రంగంలో ప్రయివేటు భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం తెచ్చిన విధానాల వల్ల అంతరిక్ష వాణిజ్యంలో భారత్ తన వాటాను మరింత పెంచుకోవటానికి వీలు కలుగుతోంది.
- **రవాణా రంగంలో అనిశ్చితి:** కరోనా వైరస్‌లో ఒమిక్రాన్ రకం కారణంగా అంతర్జాతీయంగా పర్యాటక రంగంలో అనిశ్చితి నెలకొంది. భారత్ సహా అన్నిచోట్లా దీని ప్రభావం కనిపిస్తోంది. 2020లో ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ పర్యాటకుల రాక 74% మేర తగ్గిపోయింది.
- **సామాజిక సేవల రంగంపై వ్యయం రూ.71.61 లక్షల కోట్లకు:** 2021-22 ఆర్థిక సంవత్సరంలో సామాజిక సేవల రంగంపై యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా చేసిన వ్యయం రూ.71.61 లక్షల కోట్లకు చేరింది. 2020-21తో పోలిస్తే ఇది 9.8 శాతం అధికం. విద్యపై రూ.6.21 లక్షల కోట్లు, ఆరోగ్యంపై 3.5 లక్షల కోట్లు వెచ్చించారు. 2019-20తో పోలిస్తే 2021-22లో

## ఉల్లి, టమాటాలపై ప్రత్యేక విధానం అవసరం

**ఉల్లితోపాటు టమాటా ఉత్పత్తిలో సీజన్‌ల వారీగా వ్యత్యాసాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఒక్కోసారి ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు తేవటానికి ప్రత్యేక చర్యలతో ఒక విధానం రూపొందించాలని ఆర్థిక సర్వే సూచించింది. ఈ రెండు పంటలూ యాసంగి (రబీ) సీజన్‌లో ఎక్కువగా, వానాకాలం (ఖరీఫ్)లో తక్కువగా పండిస్తున్నారు. రైతులకు ప్రోత్సాహకాలు ఇచ్చి తక్కువగా పండించే సీజన్‌లోనూ ఎక్కువ ఉత్పత్తి వచ్చేలా చూడటంతోపాటు టమాటా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి. ఉల్లి నిల్వకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి.**

ఆరోగ్య రంగంపై వ్యయం 73 శాతం పెరిగింది. కొవిడ్ ఇందుకు కారణం.

- కార్మిక సంస్కరణల్లో దేశంలో పురోగతి కన్పిస్తోంది. వేతనాలు, సామాజిక భద్రత, పారిశ్రామిక సంబంధాలు, వృత్తి భద్రత తదితర అంశాలపై 17 రాష్ట్రాలు ముసాయిదా నిబంధనల్ని ప్రచురించాయి.
- భారత విద్యావ్యవస్థపై కరోనా ప్రభావం చూపింది. 6-14 ఏళ్ల గ్రామీణ విద్యార్థుల నమోదు పడిపోయింది.
- మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా 2020-21లో 13,327 కిలోమీటర్ల మేర జాతీయ మార్గాలు నిర్మించారు. మునుపటి ఏడాది కంటే ఇది 30% ఎక్కువ. రహదారులకు కేటాయింపులు పెరగటంతో నిర్మాణ పనులు ఊపందుకున్నాయి.
- 2024-25 కల్లా భారత ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్ల (రూ.375 లక్షల కోట్ల) స్థాయికి చేరాలంటే.. మౌలిక వసతుల రంగంలో 1.4 లక్షల కోట్ల డాలర్ల (రూ.105 లక్షల కోట్ల) పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉంది. 2008-17 ఆర్థిక సంవత్సరాల్లో మౌలిక వసతుల కోసం 1.1 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.82 లక్షల కోట్ల)ను భారత్ వెచ్చించింది. 2020-25 మధ్య రూ.111 లక్షల కోట్ల (1.5 ట్రిలియన్‌ల) మౌలిక పెట్టుబడుల అంచనాలతో 6835 ప్రాజెక్టులున్న జాతీయ మౌలిక వసతుల ప్రాజెక్ట్ (ఎన్ఐపీ)ను ఇప్పటికే ప్రకటించారు. 34 మౌలిక ఉపరంగాలకూ వర్తించేలా 9000కు పైగా ప్రాజెక్టులకు విస్తరించారు. ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యం కింద 2014-15 నుండి 2020-21 వరకు రూ.1,37,218 కోట్ల వ్యయంతో మొత్తం 66 ప్రాజెక్టులు చేపట్టారు.
- ఈసారి సర్వేలో రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాలను ప్రకటించలేదు. అయితే సరఫరా వ్యవస్థ మెరుగుపడి, ఇంధనంపై సుంకం తగ్గిస్తే ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుందని పేర్కొంది. 2021-22 ఏప్రిల్-డిసెంబర్‌లో 6 శాతం లోపే రిటైల్ ద్రవ్యోల్బణం ఉంది. కానీ ఆర్థిక కార్యకలాపాలు పెరగటం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు అధికమవటం, రవాణా వ్యయాలూ పెరగటం వల్ల టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణం 12 శాతం పైకి చేరింది. కూరగాయలు వంటి త్వరగా పాడయ్యే పంట ఉత్పత్తులకు శీతల గిడ్డంగుల వ్యవస్థ బలంగా ఉండాలి.
- దేశీయ అంకుర వ్యవస్థ సత్తా చాటుతోంది. గత ఆరేళ్లలో అంకురాలు పెద్దఎత్తున ఏర్పాటయ్యాయి. 2016-17లో 733 అంకురాలు ప్రారంభం కాగా, 2021లో కొత్తగా 14,000 సంస్థలు వెలిశాయి. ఇందులో అత్యధికంగా సేవల రంగానికి చెందినవే. ఈ ఏడాది జనవరి 10 నాటికి దేశంలో 61,400 అంకురాలు ఉన్నాయి. దేశంలో 555 జిల్లాల్లో కనీసం ఒక అంకుర సంస్థ ఉంది. 2016-17లో 121 జిల్లాల్లో మాత్రమే కనీసం ఒక అంకురం ఉంది.
- అత్యధిక యూనికార్న్ (సుమారు రూ.7,500 కోట్ల అంకురం)ల సంఖ్యలో అమెరికా, చైనా తర్వాత స్థానంలో భారత్ నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి 14 నాటికి దేశంలో 44 అంకురాలు కొత్తగా యూనికార్న్ హోదా సాధించాయి. వీటితో కలిపి భారత్‌లో యూనికార్న్‌ల సంఖ్య 83కు పెరిగింది. వీటి విలువ దాదాపు రూ.20.77 లక్షల కోట్లు (277.77 బిలియన్ డాలర్లు).
- 2020-21లో భారత ఆర్థిక వ్యవస్థ 6.6 శాతం క్షీణించింది. అప్పుడు జీడీపీ 7.3 శాతం క్షీణించిందని 2021 మే నెలలో వేసిన అంచనా కంటే ఇది మెరుగే. కొవిడ్ పరిణామాల ప్రభా వం ఆర్థిక వ్యవస్థపై ముందుగా అనుకున్నంత అధ్వాన్నంగా లేదని జాతీయ గణాంక కార్యాలయ అంకెలు వెల్లడిస్తున్నాయి.
- 2019-20లో వాస్తవ జీడీపీ వృద్ధి రేటును 3.7 శాతానికి సవరించారు. అంతకు ముందు అంచనా 4 శాతంగా ఉంది.
- వాస్తవ జీడీపీ లేదా 2011-12 స్థిర ధరల వద్ద జీడీపీ 2020-21, 2019-20 ఏడాదులకు వరుసగా రూ.135.58 లక్షల కోట్లు, రూ.145.16 లక్షల కోట్లకు చేరుకుంది. అంటే 2020-21లో 6.6 శాతం తగ్గింది.
- 2021 జనవరి సవరణలో 2019-20 వాస్తవ జీడీపీలో 4 శాతం వృద్ధి (రూ.145.69 లక్షల కోట్లు) నమోదవుతుందని అంచనా వేశారు.
- 2019-20, 2020-21లలో తలసరి ఆదాయం వరుసగా రూ.1,32,115, రూ.1,26,855గా నమోదైంది.
- భారత విమానయాన రంగం పుంజుకోవటం ప్రారంభించింది. మెట్రోల నుండి చిన్న నగరాలకు ఉడాన్ పేరిట విమాన సర్వీసులు నిర్వహిస్తున్న కార్యక్రమంతో దేశంలో విమానాశ్రయాల సంఖ్య 74 నుండి 153కు పెరిగింది.
- 2021 ఏప్రిల్-నవంబర్‌లో ఆదాయం 67.2 శాతం (వార్షిక ప్రాతిపదికన) పెరిగింది. వాస్తవానికి 2021-22 బడ్జెట్ అంచనాల్లో 9.6 శాతం వృద్ధి మాత్రమే అంచనా వేశారు. ప్రత్యక్ష, పరోక్ష పన్ను వసూళ్లు రెండూ బలంగా పుంజుకున్నాయి. ఆర్‌బీఐ మిగులు నిధులు

రూ.99,000 కోట్లను ప్రభుత్వానికి బదిలీ చేయటంతో పన్నేతర రాబడి బాగా పెరిగింది. స్థూలంగా పన్ను రాబడి 2021 ఏప్రిల్-నవంబర్‌లో 50 శాతం మేర పెరిగింది. కొవిడ్ ముందు (2019-20) పరిస్థితుల కంటే కూడా పన్ను రాబడి మెరుగ్గా ఉంది. 2021 ఏప్రిల్-నవంబర్‌లో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.10.74 లక్షల కోట్లకు చేరాయి. 2020 ఏప్రిల్-డిసెంబర్‌తో పోలిస్తే ఇది 61.5 శాతం అధికం.

- కొవిడ్ పరిణామాల వల్ల తలెత్తిన ఆర్థిక షాక్‌ను దేశ బ్యాంకింగ్ వ్యవస్థ ఇప్పటివరకు సమర్థంగా తట్టుకుంది కానీ.. ఇప్పటికీ కొంత ప్రతికూలత ఉందని ఆర్థిక సర్వే తెలిపింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీల) మొత్తం నికరలాభం 2020-21 ప్రథమార్థంలో రూ.14,688 కోట్లు కాగా, 2021-22 ప్రథమార్థంలో రూ.31,144 కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో ప్రయివేటు బ్యాంకుల నికర లాభం రూ.32,762 కోట్ల నుండి రూ.38,234 కోట్లకు చేరింది. మొత్తంగా షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల నికర లాభం 2020 సెప్టెంబర్ చివరకు 59,426 కోట్లు కాగా, 2021 సెప్టెంబర్‌కు రూ.78,729 కోట్లకు పెరిగింది.
- 2021 ఏప్రిల్-నవంబర్‌లో స్థూలంగా 54.1 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) దేశంలోకి వచ్చాయని, నికరంగా మాత్రం 24.7 బిలియన్ డాలర్లకు తగ్గాయని ఆర్థిక సర్వే తెలిపింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (ఐటీ-బీపీఎం) రంగ ఆదాయాలు 2020-21లో (ఇ-కామర్స్) మినహా 2.26 శాతం వృద్ధితో రూ.14.55 లక్షల కోట్లకు (194 బిలియన్ డాలర్లు) చేరుకున్నాయని సర్వే పేర్కొంది. కొత్తగా 1.38 లక్షల ఉద్యోగాలు వచ్చాయి.
- కొవిడ్ సంబంధిత ఔషధాలు, టీకాలకు గిరాకీ పెరగటంతో 2020-21లో ఫార్మా రంగంలోకి ఎఫ్‌డీఐలు బాగా పెరిగాయి. 2021 ఏప్రిల్-సెప్టెంబర్‌లో రూ.4,413 కోట్ల మేర ఎఫ్‌డీఐలు వచ్చాయి. 2020 ఇదే సమయంతో పోలిస్తే ఇవి 53 శాతం అధికం. ప్రపంచంలో ఉత్పత్తిపరంగా భారత ఔషధ పరిశ్రమ మూడవ స్థానంలో ఉంది. 2020-21లో మొత్తం ఫార్మా ఎగుమతులు 24.2 బిలియన్ డాలర్ల మేర జరిగితే, దిగుమతులు 7 బిలియన్ డాలర్లు మాత్రమే. మొత్తం ప్రపంచంలోనే జనరిక్ ఔషధాల సరఫరాలో భారత్ వాటా 20 శాతంగా ఉంది.
- 2021 ఏప్రిల్-నవంబర్‌లో పబ్లిక్ ఇష్యూల ద్వారా 75 కంపెనీలు రూ.89,066 కోట్లు సమీకరించాయి. 2020 ఇదే కాలంలో 29 కంపెనీలు రూ.14,733 కోట్లే సమీకరించాయి.
- టెలికాం సంస్కరణల వల్ల 4 జీకి మద్దతుతో పాటు 5జీ నెట్‌వర్క్‌లకు పెట్టుబడులను సిద్ధం చేసుకునే వాతావరణం ఏర్పడిందని సర్వే తెలిపింది. కరోనాతో డేటా వినియోగం భారీగా పెరిగినా, బ్రాడ్‌బ్యాండ్, టెలికాం అనుసంధానతలో అంతరాయాలు ఏర్పడలేదు. సగటు వినియోగదారు నెలవారీ డేటా వినియోగం 2017-18 తొలి త్రైమాసికంలో 1,24 జీబీ కాగా.. 2021-22లో అది 14.1 జీబీకి పెరిగింది. డిసెంబర్ 2021 కల్లా మొబైల్ టవర్ల సంఖ్య 6.93 లక్షలకు చేరింది.

## రైల్వేలో పెట్టుబడుల దశాబ్దం

**సామర్థ్యం పెంపు చర్యలను వేగవంతం చేస్తున్న దృష్ట్యా రైల్వే రంగంలో రాబోయే పదేళ్లలో భారీస్థాయి మూలధన పెట్టుబడులు రానున్నాయి. 2030 నాటికి డిమాండ్ కంటే రైల్వే అన్ని విధాలా ముందుంటుందని సర్వే అంచనా. సరకు రవాణాలో రైల్వే వాటా ఇప్పుడున్న 26-27% నుండి 40-45 శాతానికి చేరుతుంది. 2014 వరకు ఏటా సగటున 46,000 కోట్ల లోపు పెట్టుబడులు రాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అది రూ.2.15,000 కోట్లు దాటింది. రైలు మార్గాల విద్యుదీకరణ 2023 డిసెంబర్‌కు పూర్తవుతుంది. ఏటా 1835 కిలోమీటర్ల మేర నూతన రైలుమార్గాలు సిద్ధమవుతున్నాయి. 2030 నాటికి సామర్థ్యం ఇప్పుడున్న 470 కోట్ల టన్నుల నుండి 820 కోట్ల టన్నులకు చేరుతుంది.**

- భారీ నష్టాల్లో ఉన్న ఎయిరిండియాను విక్రయించగలగటంతో, దేశంలో ప్రయివేటీకరణకు జోష్ వచ్చినట్లయింది. ఆత్మనిర్భర్ భారత్, స్వయంసమృద్ధి లక్ష్యాల సాకారానికీ ఇది దోహదం చేస్తుంది. 20 ఏళ్ల తర్వాత జరిగిన తొలి ప్రయివేటీకరణ ప్రక్రియగా ఇది ఎంతో కీలకం.
- యూనియన్ ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్ఈ) స్థలాలు, ప్రధానేతర ఆస్తుల విక్రయ ప్రక్రియను వేగవంతం చేసేందుకు నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విక్రయ నిమిత్తం ఎంటీఎన్ఎల్, బీఎస్ఎన్ఎల్, బీఅండ్ఆర్, బీఈఎంఎల్, హెచ్ఎంటీ, ఇన్‌స్ట్రుమెంటేషన్ లిమిటెడ్ లాంటి సీపీఎస్ఈల నుండి 3,400 ఎకరాల స్థలం, ఇతర ప్రధానేతర ఆస్తులను ఇప్పటివరకు గుర్తించారు. 2021-22 నుండి 2024-25 వరకు నాలుగేళ్లలో ప్రభుత్వ రంగ కీలక ఆస్తుల విక్రయం ద్వారా రూ.6 లక్షల కోట్లు సమకూర్చొచ్చు.
- సెమీ కండక్టర్ల కొరత వల్ల వివిధ రంగాలకు చెందిన చాలా సంస్థలు తమ ఉత్పత్తిని తగ్గించడం లేదా నిలిపివేయాల్సి వచ్చింది. అందుకే సెమీ కండక్టర్లు, డిస్‌ప్లేల తయారీ విభాగం కోసం ప్రభుత్వం రూ.76,000 కోట్ల ప్రోత్సాహక పథకాన్ని ప్రకటించింది. ఇందువల్ల దేశంలో వాటి ఉత్పత్తి ప్రారంభమవుతుందని, అంతర్జాతీయ సరఫరా ఆటంకాల నుండి ఊరట లభిస్తుందని పేర్కొంది. ఇది దేశీయ ఎలక్ట్రానిక్ కంపెనీలకు ఉపయుక్తమే కాక, అంతర్జాతీయంగానూ పోటీపడవచ్చని తెలిపింది. చిప్ సెట్ల కొరత వల్ల గత డిసెంబర్ ఆఖరుకు వాహన కంపెనీల వద్ద 7 లక్షల ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయి.

# హైదరాబాద్‌లో నిర్మాణ రంగం జోరు.. తెలంగాణలో సేవారంగంలో తిరోగమనం

హైదరాబాద్‌లో గృహనిర్మాణ రంగం వేగంగా వృద్ధి చెందుతోందని ఆర్థిక సర్వే తెలిపింది. అత్యధిక గృహ లావాదేవీలు జరుగుతున్న టాప్‌-8 నగరాలలో హైదరాబాద్ ఉంది. కానీ తెలంగాణలో సేవారంగం వృద్ధి రేటు గత మూడేళ్లుగా తగ్గుతూ వస్తోంది. 2018-19లో 7.91% మేర ఉన్న ఈ రంగం వార్షిక వృద్ధి రేటు 2019-20లో 5.69 శాతానికి పడిపోయింది. 2020-21 నాటికల్లా ఇది మైనస్ 3.94%కి పడిపోయింది. మరోవైపు, కొవిడ్ ముందునాటి పరిస్థితులతో పోలిస్తే మహమ్మారి రెండో దశలో హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు, లావాదేవీలు భారీగా పెరిగాయి. గాంధీనగర్, అహ్మదాబాద్ తర్వాత గృహాల ధరల పెరుగుదల ఇప్పుడు హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉంది.

- ఆర్థిక సర్వే ప్రకారం హైదరాబాద్‌లో అటవీ విస్తరణ 2011తో పోలిస్తే 2021 నాటికి 146.8% వృద్ధి చెందింది. అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, ముంబయితో పోలిస్తే హైదరాబాద్‌లోనే పెరుగుదల ఎక్కువ నమోదైంది.
- గ్రామీణ ప్రాంతాల్లో 100% కుటుంబాలకు తాగునీటి సౌకర్యం కల్పించిన ఆరు రాష్ట్రాలు/యూనియన్ పాలిత రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణ నిలిచింది.
- మెరుగైన పారిశుధ్య వసతులతో కూడిన ఇళ్లలో జీవించే జనం సంఖ్య 2015-16 నాటి కుటుంబ ఆరోగ్య సర్వే-4 ప్రకారం తెలంగాణలో 76.2% ఉండగా, 2019-21 నాటి సర్వే-5 నాటికి ఆ సంఖ్య 52.3%కి పడిపోయింది.
- జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-4 ప్రకారం రాష్ట్రంలో శిశుమరణాల రేటు 27.7 ఉండగా, సర్వే-5 నాటికి అది 26.4కి తగ్గింది. అయిదేళ్లలోపు పిల్లల మరణాల రేటు ఇదే సమయంలో 46.5 నుండి 45.6కి తగ్గింది.
- రాష్ట్రంలో సంతాన సాఫల్య రేటులో మార్పు లేదు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 4,5ల్లో ఇది 1.8కి పరిమితమైంది.
- నీతి ఆయోగ్ విడుదల చేసిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచి 2020-21లో తెలంగాణ 69 పాయింట్లతో 11వ స్థానంలో నిలిచింది.
- జాతీయ క్లీన్ ఎయిర్ కార్యక్రమం కింద తెలంగాణకు నిధులు తగ్గాయి. రాష్ట్రానికి 2019-20లో దీని కింద రూ.11 కోట్లు విడుదల చేయగా, 2020-21లో అది రూ.3 కోట్లకు తగ్గింది.
- తెలంగాణ సహా పది రాష్ట్రాల్లో పొగాకు పండించే రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించే ప్రయత్నం జరుగుతోంది. ఇందుకోసం వీటన్నింటికీ రూ.10 కోట్లు కేటాయించారు.
- దేశంలో వామపక్ష తీవ్రవాద ప్రభావానికి గురైన 9 రాష్ట్రాల్లోని 44 జిల్లాల్లో రోడ్డు అనుసంధానత మెరుగుపరిచారు. అందులో తెలంగాణ కూడా ఉంది.
- నికర రాష్ట్ర ఉత్పత్తి రేటు 2.5%: తెలంగాణ ఏర్పడిన ఆరేళ్లలో రెండంకెల మేర నమోదైన రాష్ట్ర నికర ఉత్పత్తి రేటు 2020-21లో 2.5%కి పడిపోయింది. 2011-22 సిరీస్‌ను అనుసరించి ప్రస్తుత ధరల ప్రకారం నికర రాష్ట్ర ఉత్పత్తి వృద్ధి రేటు 2014-15లో 11.8%, 2015-16లో 14.6%, 2016-17లో 14.3%, 2017-18లో 13.7%, 2018-19లో 15%, 2019-20లో 11.6% నమోదుకాగా, 2020-21లో మాత్రం అది 2.5%కి పడిపోయింది. రాష్ట్ర నికర ఉత్పత్తి విలువ 2019-20లో రూ.8,71,374 కోట్లుగా నమోదవ్వగా, 2020-21లో అది రూ.8,93,473 కోట్లకు, తలసరి నికర ఉత్పత్తి విలువ రూ.2,33,325 నుండి రూ.2,37,632కి చేరింది. తలసరి వృద్ధి 1.8% మాత్రమే నమోదైంది.
- జీఎస్‌టీ కింద తెలంగాణకు 2021 నవంబర్ వరకు రూ.28,506 కోట్లు వచ్చాయి.
- సమీకృత అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనలో తెలంగాణ దేశంలో 11వ స్థానంలో నిలిచింది. లక్ష్యాల సాధన సూచీలో 75 శాతంతో కేరళ మొదటి స్థానంలో ఉండగా, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు తరువాతి స్థానాల్లో ఉన్నాయి. తెలంగాణ 69 శాతం సాధించింది. అందుబాటు ధరలో క్లీన్ ఎనర్జీ అంశంలో రాష్ట్రం ఇప్పటికే నూరుశాతం లక్ష్యం చేరుకోగా, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యంలో 96 శాతం మేర లక్ష్యం సాధించింది. 17 అంశాలను సమీకృత అభివృద్ధి లక్ష్యాలుగా ఐక్యరాజ్యసమితి నిర్దేశించింది. ప్రపంచ దేశాలు ఈ లక్ష్యాలను 2030లోగా సాధించాలని పేర్కొంది. మన దేశం ఇప్పటిదాకా ఎస్‌డీజీల సాధనలో 66 శాతం సాధించినట్లు నీతి ఆయోగ్ నివేదికలోని అంశాలను ఆర్థిక సర్వేలో పేర్కొన్నారు. ●

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయండి

రైతులు పండించిన ప్రతి గింజా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందంటూ అట్టహాసంగా రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు విభాగాలను ప్రారంభించినా ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో అన్నారు. విధిలేని పరిస్థితుల్లో రైతులు అయినకాడికి ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారన్నారు. వ్యవసాయానికి ఏదో చేస్తున్నట్లు ప్రభుత్వం పత్రికల్లో ప్రకటనలిచ్చి తప్పించుకు తిరుగుతుంటే, రైతులకు అండగా ఉంటామని చెప్పిన మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం పట్టించుకోవటం లేదన్నారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ పర్యటనకు వస్తే, కనీసం కలిసి రైతుల సమస్యల్ని వివరించే ప్రయత్నాన్ని జిల్లా ప్రజాప్రతినిధులు చేయలేదన్నారు. రైతు సమస్యల కంటే పార్టీ రాజకీయాలు అంత ముఖ్యమా అని ప్రశ్నించారు. జిల్లాలో ధాన్యం పంట ఉత్పత్తి ఈ సీజన్‌లో 6.32 లక్షల టన్నులుగా అంచనా వేసి కొనుగోలు లక్ష్యంగా 5.80 లక్షల టన్నుల్ని నిర్ణయించారని, కొనుగోలు కేంద్రాలుగా ప్రకటించిన పలుచోట్ల మౌలిక సదుపాయాలు లేవన్నారు. కొన్నిచోట్ల తూనిక యంత్రాలు కూడా లేవన్నారు. రైతు భరోసా కేంద్రాలకు వెళ్లిన రైతుల్ని మిల్లుల వద్దకు తిప్పుతూ దోపిడీకి ప్రభుత్వమే ఆస్కారమిస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు సమస్యల్ని వెంటనే పరిష్కరించి పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేయాలని, చెల్లింపుల్ని జాప్యం లేకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవలి అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులు కూడా తమ సమస్యలపై ముందుకొచ్చి మాట్లాడాలని, మద్దతు ధరకే పరిమితం కాకుండా వ్యవసాయాన్ని లాభసాటి చేసే సాగు, మార్కెటింగ్, ఇతర విధానాలపై అవగాహనతో పోరాడాలని, లోక్‌సత్తా పూర్తి సహకారాన్ని అందిస్తుందన్నారు.

**ఆర్‌బీకేల మీద పర్యవేక్షణ లేకుండా పోయింది**

ధాన్యం రైతులు రైతు భరోసా కేంద్రాల చుట్టూ తిరిగి విసిగిపోయి మద్దతు ధర కంటే బాగా తక్కువకు దళారులకు అమ్ముకుంటున్నారని రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఆకుల దామోదరరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు బొబ్బిలిలో అన్నారు. ఆర్‌బీకేల మీద పర్యవేక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రయివేటు దోపిడీ వల్ల ప్రతి రైతూ క్వింటా దగ్గర ఎనిమిది నుండి పది కేజీలు నష్టపోతున్నాడన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాలని, ధాన్యం కొనుగోళ్లు పక్కాగా జరిగేలా చేయాలన్నారు. మరోవైపు, ఎస్.కోట మండలం కిల్లంపాలెం పంచాయతీలో భర్తపురం ఎస్.టి కాలనీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కాండ్రేగుల ప్రసాద్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

# చింతామణి నాటకంపై నిషేధం ఏ రకమైన ప్రజాస్వామ్యం?



సామాజిక సంస్కరణ ఇతివృత్తంతో తెలుగు నాటకరంగ చరిత్రలోనే గొప్ప పేరుగాంచిన చింతామణి నాటకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిషేధించటం విచారకరమని భీశెట్టి బాబ్జీ అన్నారు. అధికార పార్టీ వాళ్లు కూడా ఈ చర్యను వ్యతిరేకిస్తున్నారన్నారు. నాటక ప్రదర్శనకు అనుమతినివ్వాలంటూ పౌర వేదిక, ప్రజాసంఘాలు, కళాకారుల ఆధ్వర్యంలో విజయనగరం కలెక్టరేట్ వద్ద జోతిబాపూలే విగ్రహం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో బాబ్జీ మాట్లాడారు. చింతామణిలో ఎవరి మనోభావాలను గాయపరిచే మాటలున్నా తొలగించటంలో తప్పులేదని, మూల నాటకానికి భిన్నంగా అసభ్య, అశ్లీల సంభాషణల్ని జోడించకుండా చర్యలు తీసుకుంటే సరిపోయేదన్నారు. చింతామణి నాటకం గురించి, ఆ సమయంలో సమాజం గురించి తెలిసినవారెవరూ ఇలాంటి చర్యల్ని హర్షించరన్నారు. ప్రతిదీ కులం కోణంలో చూసే ధోరణిని పాలకులు మానుకోవాలని, ప్రజలకు ఇది తప్పుడు సందేశాన్నిస్తుందన్నారు. రేపు వేరెవరో గొడవ చేశారని కన్యాశుల్కం నాటకాన్ని నిషేధిస్తారా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలవటమే కాకుండా, ప్రజాస్వామ్యం, వివిధ వర్గాల ప్రజల డిమాండ్ల మధ్య సమన్వయం వంటి అంశాల్లో పరిణతితో వ్యవహరించటం కూడా అలవరచుకోవాలన్నారు. రంగస్థల నటులు నెల్లూరు సంగీత్ కుమార్, గవర సత్తిబాబు, అబ్బులు, బత్తుల లక్ష్మి, పుష్ప, గుర్రాల వెంకట్రావు, కిషోర్, జి.వి.డి ప్రసాద్, గౌరి, శ్రీదేవి, స్వాతి, షేకర్, సూరిబాబు, జిల్లా ప్రజాసంఘాల ప్రతినిధులు మమ్ముల తిరుపతిరావు, ఇప్పలవలస గోపి, రామకృష్ణ, వేణు, తదితరులు పాల్గొన్నారు.

# నానాటికీ ఖరీదైపోతున్న వైద్యం - ప్రభుత్వాలదే నేరం

## ఇలపావులూరి మురళీమోహన రావు, సీనియర్ రాజకీయ విశ్లేషకులు

సుబ్బారావు (పేరు మార్చాను) అరవై అయిదు సంవత్సరాల వృద్ధులు. ఆయనకు పెన్షన్ కూడా రాదు. మధ్యతరగతి కుటుంబీకుడు. బీపీ, షుగర్ వ్యాధులు తప్ప మిగిలిన ఆరోగ్య సమస్యలు ఏమీ లేని సుబ్బారావుకు ఒకరోజు అకస్మాత్తుగా కళ్లు తిరిగినట్లనిపించింది. భార్యను వెంటబెట్టుకుని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడి డాక్టర్ ఆయన్ను నాలుగైదు రకాల ప్రశ్నలు వేశాడు. ఒకదానికి అవునండీ అన్నాడు. డాక్టర్ కొన్ని పరీక్షలు రాసి అక్కడున్న ల్యాబ్‌లో చేయించుకుని రమ్మన్నాడు. ఆయన ల్యాబ్‌కు వెళ్లగా ఆ పరీక్షల ఖరీదు పదిహేను వేల రూపాయలు అయింది. డాక్టర్‌గారు అరనిముషంలో రిపోర్టులు చూసి.. వృద్ధాప్యం, అలసట వల్ల అలా అనిపించింది, పరీక్షలు చెయ్యడమే నయమైంది, లేకపోతే అది గుండెజబ్బేమో అనిపించింది నాకు, అదృష్టవంతులు, ఈ మందులు వేసుకోండి.. అని వెయ్యి రూపాయల ఖరీదైన మందులు రాసి మళ్లీ పదిహేను రోజుల తర్వాత రమ్మని చెప్పారు. సుబ్బారావు తన ఇంటి దగ్గరలో గల పది మందుల షాపులకు వెళ్లాడు మందులు కొనడానికి. ఎందుకంటే ఆయనకు బయట షాపుల్లో పదిహేను శాతం డిస్కౌంట్ వస్తుంది. విచిత్రంగా ఏ షాపులోనూ ఆ డాక్టర్ రాసిన మందులు దొరకలేదు. చివరకు ఓ షాపు అతను సార్.. ఈ మందులు ప్రపంచంలో ఎక్కడా దొరకవు. వెళ్లి ఆ ఆస్పత్రి ఫార్మసీలో అడిగి చూడండి అని సలహా ఇచ్చాడు. సుబ్బారావుకు బీపీ పెరిగిపోయింది ఆ మాటలకు. అయినా చేసేదేమీ లేదు గనుక మళ్లీ ఆటో ఎక్కి ఆ కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడి ఫార్మసీలో అన్ని మందులూ దొరికాయి. మా దగ్గర డిస్కౌంట్ ఉండదు, తీసుకుంటే తీసుకోండి, లేకపోతే లేదు.. ఖండితంగా చెప్పారు ఉద్యోగులు. చచ్చినట్లు మందులు కొనుక్కుని ఇంటికి వెళ్లాడు.

నేను పైన ప్రస్తావించింది ఊహాజనిత కథ కాదు. వాస్తవంగా ఒక వ్యక్తి అనుభవం. ఇది ఒక్క ఆ వ్యక్తి అనుభవం మాత్రమే అనుకుంటే పొరపాటు. ఇది ఆస్పత్రులకు వెళ్లే అనేకమంది అనుభవం. నలభై ఏళ్ల క్రితం వరకూ అలోపతి వైద్యులు, హోమియో వైద్యులు, ఆయుర్వేద వైద్యులు ఎవరి దగ్గరకు వెళ్లినా ముందు మన చేతిని తీసుకుని నాడిని ఒక నిమిషం పాటు పరీక్షించేవారు. నాడి ప్రకంపనలు బట్టి బీపీ ఎంతుందో, మన వ్యాధి లక్షణాలు ఏమిటో చెప్పేవారు. తగిన మందులు ఇచ్చేవారు. మరి నేడు ఎంత పెద్ద డాక్టర్ అయినా నాడి పట్టుకుని చూడటం అనేది చేయగలుగుతున్నామా? రోగి వెళ్లగానే వెంటనే నాలుగైదు రకాల పరీక్షలు రాయడం, వాటిని ఫలానా సెంటర్లో చూపించుకుని రమ్మని సూచించడం, అవన్నీ



చేయించుకుని వచ్చాక వ్యాధి నిర్ధారణ చెయ్యడం, రోగి ఆర్థిక పరిస్థితి తెలుసుకుని ఖరీదైన మందులు రాయడం, మళ్లీ వారం రోజుల తర్వాత రమ్మని చెప్పడం, ఏ ఆస్పత్రికి వెళ్లినా ఇదే పరిస్థితి. మొదటి విజిట్‌లో మందులు ఇచ్చి.. వీటితో కచ్చితంగా తగ్గుతుంది, మళ్లీ రావలసిన అవసరం లేదు అని చెప్పే వైద్యులను ఎక్కడైనా చూస్తున్నామా?

ఒక ఉదాహరణ చెబుతాను. సుమారు పాతికేళ్ల క్రితం వరకు మధుమేహ వ్యాధిగ్రస్తులకు నూటికి తొంభై మందికి డయానిల్ అనే టాబ్లెట్స్ ఇచ్చేవారు వైద్యులు. అవి పది మాత్రలు అయిదు రూపాయలో, పది రూపాయలో ఉండేవి. నెలకు యాభై రూపాయలతో షుగర్ నియంత్రణలో ఉండేది. మరి నేడు? షుగర్ జబ్బు రోగి నెలకు అయిదారువేల రూపాయల మందులను వాడాల్సి వస్తున్నది. ప్రతి డాక్టరూ అయిదారు రకాల మందులను రాస్తారు. అన్నీ కొనుక్కోవాల్సిందే.

1975 వరకు ఆస్పత్రుల్లో కార్పొరేట్ అనే మాటే వినపడలేదు. నాకు గుర్తున్నంతవరకు 1980ల ప్రాంతంలో డాక్టర్ ప్రతాప్‌రెడ్డి అపోలో ఆస్పత్రులను ప్రారంభించారు. అదే తొలి కార్పొరేట్ ఆస్పత్రి అనుకుంటున్నాను. అప్పటివరకు చిన్న చిన్న ఆస్పత్రులను నిర్వహిస్తూ వైద్యసేవలు అందించే వారు వైద్యులు. వారి ఫీజులు కూడా చాలా తక్కువ. వారు నయం చెయ్యలేకపోతే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లమని చెప్పేవారు. 1990 వచ్చేసరికి వందల కార్పొరేట్ ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. నాలుగైదు ఎకరాల స్థలంలో రాజభవనాలను తలదన్నే రీతిలో ఏడెనిమిది అంతస్తుల భవనాలు, అయిదారువందల పడకగదులు, వీటిలో ఏసీ, నాన్ ఏసీ, షేరింగ్ రూమ్స్, జనరల్ వార్డు.. ఇలా రకరకాల వసతులు అందించడం మొదలుపెట్టారు. ఒక త్రీ స్టార్ హోటల్‌లో డబుల్ రూమ్ కంటే, ఈ కార్పొరేట్ ఆస్పత్రులలో షేరింగ్ రూంలలో ఒక మంచం అద్దె ఎక్కువ ఉంటుందంటే ఇంత ఖరీదైన వైద్యం

సామాన్యులు భరించగలరా? ఇక ఏదైనా సర్జరీ అవసరం అయితే మూడు నుంచి పది లక్షల రూపాయలు అవుతుంది. మూత్రపిండాలు, క్యాన్సర్ లాంటి వ్యాధుల సర్జరీ అయితే నలభై యాభై లక్షల రూపాయల బిల్లు అవుతుంది. ఒక ఉద్యోగి సర్వీసులో ఉన్నప్పుడు కష్టపడి కూడబెట్టిన సొమ్ము రిటైర్ అయిన తర్వాత ఏ సర్జరీయో చేయించుకోవాల్సిన ఆగత్యం ఏర్పడితే పది రోజుల్లో కరిగిపోతుంది. ఎంత దారుణంగా ఉన్నది పరిస్థితి!!

మరొక విషయం చెప్పుకోదగినది ఏమిటంటే... నాలుగు దశాబ్దాల క్రితం చిన్న చిన్న పట్టణాలు, నగరాల్లోనూ కూడా జనరల్ ఫిజిషియన్స్ ఎక్కువగా ఉండేవారు. శరీరంలో ఏ భాగానికి సమస్య వచ్చినా వీరు చికిత్స చేసేవారు. కానీ కార్పొరేట్ కల్చర్ పెరిగాక స్పెషలిస్టులు పెరిగారు. తలలో కళ్లు, చెవులు, ముక్కు, నోరు, మెదడు, పళ్లు ప్రధాన అంగాలు. ఈ ప్రతి అంగానికీ ఒక్కొక్క స్పెషలిస్టు. ఇక శరీరంలోని సుమారు పాతిక ముప్పయి భాగాలకు వేరువేరుగా స్పెషలిస్టులు ఉంటారు. వీటిలో ప్యాకేజీలు కూడా ఉంటాయి. ఒక మహిళ గర్భవతి అయితే, మా చిన్నతనంలో ప్రసవానికి గంట ముందుగా ఆస్పత్రికి తీసుకెళ్లేవారు. కొన్నిసార్లు గ్రామంలోని మంత్రసానులే ఆ పని చేసేవారు. ఒకవేళ ఆస్పత్రికి తీసుకెళ్లినా సిజేరియన్ అనేది అసలు వినిపించేది కాదు. వంద రూపాయల ఖర్చుతో బిడ్డను తీసుకుని తల్లి ఇంటికి చేరేది. కానీ, నేడు గర్భవతి అయిందా లేదా తెలుసుకోవడానికి ఆస్పత్రికి వెళ్తారు. గర్భవతి అని తేలితే ఇక నెలకు, పదిహేను రోజులకు, చివర్లో వారం రోజులకు ఆస్పత్రికి వెళ్లాలి. సహజ ప్రసవాలు కలికం వేసి గాలించినా కనిపించడం లేదు. తల్లిదండ్రులు కూడా తమ కూతురు కష్టపడటం చూడలేక సిజేరియన్ చేయమంటున్నారు. ఈ మొత్తానికి లక్ష రూపాయలు వసూలు చేస్తున్నాయి కొన్ని ఆస్పత్రులు. అలాగే కంటి శుక్లాల ఆపరేషన్‌కు ఒకప్పుడు అయిదారు వందలు మాత్రమే ఖర్చయ్యేది. నేడు అవి కూడా ప్యాకేజీల రూపం సంతరించుకుంది. ముప్పయి వేల నుంచి లక్ష రూపాయలు ఛార్జి చేస్తున్నాయి కంటి ఆస్పత్రులు.

చెప్పుకోవాలంటే నేటి కార్పొరేట్ ఆస్పత్రుల తీరు రోగుల శరీరాన్ని మాత్రమే కాక ఆస్తిపాస్తులను కూడా హరించివేస్తున్నది. పేదవారికి ఏదైనా జబ్బు చేస్తే ఆస్పత్రులకు వెళ్లలేక చావే శరణం అనుకుంటున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులు సాధారణంగా రాజకీయ నాయకులకు స్నేహితులు, బంధువులు లేదా బాగా విరాళాలు ఇచ్చేవారికి చెంది ఉంటున్నాయి. అందుకనే ప్రభుత్వాలు కూడా వీటిపై ఫిర్యాదుల్ని పట్టించుకోవు. వీరి అభివృద్ధి కోసం ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చెయ్యడానికి నిధులు కేటాయించడం లేదు. వైద్యులను నియమించరు. వైద్యులు తమ విధులను నిర్లక్ష్యం చేసి సొంత ప్రాక్టీసు చేసుకుంటుంటే చర్యలు తీసుకోరు. ఎంతమంది మంత్రులు, ఉన్నతాధికారులు ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యం చేయించుకుంటున్నారు? టోటల్‌గా చూస్తే ప్రభుత్వాస్పత్రుల వైఫల్యం, ఖరీదైన ప్రయివేటు వైద్యం నేడు పేదల పాలిట పెనుశాపంగా మారింది. తమ వద్దకు వచ్చే రోగులకు వారు పనిచేసే కంపెనీలు ఇచ్చే ఇన్సూరెన్స్, తెల్లకార్డు ద్వారా ప్రభుత్వాలు కల్పించే ఇన్సూరెన్స్ సౌకర్యాలు ఉంటే, ఆ మొత్తం లాగేయడంలో కార్పొరేట్ ఆస్పత్రులు సిద్ధహస్తులు. ఇందుకు ముమ్మాటికీ ప్రభుత్వాలే నేరస్తులు.

# ఫ్యామిలీ డాక్టర్ ఏర్పాటుతో 'అందరికీ ఆరోగ్యం' విధానం కోసం

**కులం, మతం, ప్రాంతం, భాషల కతీతంగా అందరూ ఏకం కావాలి**

**(మురళీమోహన రావు గారి వ్యాసంపై ఓ లోక్‌సత్తావాది స్పందన)**

'నానాటికీ ఖరీదైపోతున్న వైద్యం..' శీర్షికతో ఇలపావులూరి మురళీమోహన రావు గారు కొన్నాళ్ల క్రితం రాసిన పై వ్యాసంలోని సమస్యలు కొవిడ్ మహమ్మారి మూడు అలల తర్వాత కూడా తెలుగునాట, భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ దాదాపు అలాగే కొనసాగుతున్న నేపథ్యంలో ఓ లోక్‌సత్తావాదిగా స్పందించాల్సి వస్తోంది.

మన ఆరోగ్యరంగంలో పెరిగిపోతున్న సంక్షోభాన్ని గట్టిగా తెలియజెప్పే ప్రయత్నం మురళీమోహన రావు చేశారు. రాజకీయ విశ్లేషకులై ఉండి ఆరోగ్య రంగం గురించి మాట్లాడటం ద్వారా.. రాజకీయానికి ఆరోగ్యం కేంద్రబిందువు కావాలన్న సందేశాన్ని అందించారు. ఇందుకు ముందుగా వారికి అభినందనలు. ఆరోగ్యాన్ని, విద్యను రాజకీయానికి కేంద్రబిందువు చేయాలని లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తోంది. నాయకులు, వారి ఆర్భాటాలు, ఎన్నికల్లో గెలుపులు రాజకీయంలో మార్గాలు మాత్రమే. రాజకీయం అసలు లక్ష్యం.. వివక్ష లేకుండా ఎదిగే అవకాశాల్ని ప్రతి బిడ్డకూ కల్పించేందుకు, ప్రతి ఇంటా నివారించదగ్గ బాధలను తొలగించేందుకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటివి అందించటం, చట్టబద్ధపాలనను, స్థానిక స్వయంపాలన తదితరాల్ని అమలు చేయటం. ప్రభుత్వం చేయాల్సిన అసలు పనులివి అని ప్రజలకు స్పష్టత లేకపోవటం, దీంతో ప్రజల డిమాండ్‌గా బలంగా రూపుదిద్దుకోకపోవటాల్ని

ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలు చేస్తున్న ఓటు బ్యాంకు రాజకీయాల్లో ఈ మౌలికాంశాలు సమిధలుగా మారాయి. ఈ ఎజెండాపై, వీటి అమలుకు తగిన విధానాలపై ప్రజల్ని, పాలకుల్ని, రాజకీయ పార్టీల్ని, పౌర సమాజాన్ని స్పందింప చేయటానికి లోక్‌సత్తా అలుపెరగకుండా ప్రయత్నం చేస్తోంది.

ఇక వ్యాసంలోని కొన్ని అంశాల్లోకి వెళ్తే.. ఆరోగ్య రంగంలో ప్రజలు అనుభవిస్తున్న కష్టాలకు ప్రభుత్వాల వైఫల్యమే కారణమన్న మురళీమోహన రావు గారి ముగింపు వాక్యం అక్షర సత్యం. అయితే ప్రభుత్వ వైఫల్యం ఎక్కడుంది, ప్రభుత్వాలు ఏ విధంగా వ్యవహరిస్తే ప్రజల ఆరోగ్య కష్టాలు తీరతాయి అనే అంశాల మీద వ్యాసంలో స్పష్టత లోపించింది. అలాగే సమస్యను వర్ణించే క్రమంలో పరిష్కారాల మీద కూడా దాడి చేస్తే కొత్త సమస్యను సృష్టించినవారమవుతాం. ఈ సమస్య కూడా వ్యాసంలో కొంత కనిపించింది. ఉదాహరణకు, గతంలో పది రూపాయలకు షుగర్ నియంత్రణలో ఉండేది, వంద రూపాయలకు కాన్పు విజయవంతంగా పూర్తయి తల్లీ బిడ్డా ఇంటికి వచ్చేసేవారు వంటివి పూర్తి వాస్తవాలు కావు. వాటిల్లో చాలా లొసుగులు, వాటిని అనుసరించి పలు సమస్యలు కూడా ఉన్నాయి. వైద్యరంగంలో వచ్చిన నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం వల్ల గతంలో కంటే ఇప్పుడు అనేక జబ్బులకు మెరుగైన చికిత్స లభిస్తూ జీవనకాలం పెరిగిందన్నది వాస్తవం. అలాగే కాన్పులు పూర్వం కంటే అనేకరెట్లు సురక్షితమయ్యాయన్నది కూడా వాస్తవం.




అయితే మురళీమోహన రావు గారు చెప్పినట్లు గతంలో కంటే ఇప్పుడు వైద్యసేవలు భారంగా తయారయ్యాయి, వైద్యుల్లో సేవాభావం తగ్గింది. వ్యాపార ధోరణి పెరిగి రోగికి-వైద్యునికి మధ్య ఉండాల్సిన సుహృద్భావ వాతావరణం తక్కువైంది. దీనివల్ల ప్రజలే కాదు, వైద్యులు కూడా నష్టపోతున్నారు. వీటన్నింటికి మూలం ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైద్య, ఆరోగ్య విధానంలోనే ఉంది. ప్రభుత్వం సరైన ఆరోగ్య విధానాన్ని అవలంబిస్తే చాలు.. సమస్యను వేగంగా పరిష్కరించవచ్చు. ఈ కోణం మీద రచయిత తన ఆక్రోశాన్ని ఎక్కుపెడితే మరింత మెరుగ్గా పరిష్కారాన్ని అందించగలిగేవారు.

తెలుగు రాష్ట్రాలనే తీసుకుంటే, లోక్‌సత్తా వాదిస్తున్న విద్య, ఆరోగ్యం ఎజెండాలో ఓట్లు ఉన్నాయనే విషయాన్ని రాజకీయంగా స్పష్టంగా పసిగట్టిన నేత డా॥ వైఎస్ రాజశేఖర రెడ్డి. అయితే వైద్యుడై ఉండి కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన అసంబద్ధమైన రీతిలో ఆరోగ్య పథకాన్ని తీసుకొచ్చారు. ఆరోగ్యశ్రీ పేరుతో ఆయన ప్రవేశపెట్టిన పథకం ద్వారా జబ్బు కొంత ముదిరాక కార్పొరేట్ వైద్యాన్ని అందించటం మొదలుపెట్టారు. దీనివల్ల ఆయనకు ఓట్లు వచ్చాయి గానీ, ప్రజలకు మాత్రం ఆరోగ్యం సరిగా అందలేదు, ప్రజాధనం సద్వినియోగం కాలేదు. ఆయన కుమారుడు వైఎస్ జగన్ నూతన ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రయ్యాక ఆరోగ్య రంగంలో మార్పుల కోసం

ఒక అధ్యయన కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ తన నివేదికను ఇస్తూ, రాష్ట్రంలో అనేక కుటుంబాలు ఆరోగ్య సంరక్షణ కోసం అప్పుల పాలై పేదలుగా మారుతున్నాయని స్పష్టంగా పేర్కొంది. ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టి ఇన్నేళ్లయ్యాక కూడా ప్రజలకు ఆరోగ్యం ఎందుకు అందటం లేదు, ఎందుకు అప్పుల పాలవుతున్నారు?.. అని ఆలోచన చేయకుండా ఆరోగ్యశ్రీ జాబితాలో ఇతర వ్యాధులను కూడా చేరుస్తూ పోతుండటం వల్ల.. ఇతర రాష్ట్రాల ఖరీదైన ఆస్పత్రుల్లో కూడా ఏపీ ఆరోగ్యశ్రీ సేవలను తీసుకునే వెసులుబాటున్నా, డబ్బంతా ప్రభుత్వమే చెల్లిస్తున్నా ప్రజలకు ఇప్పటికీ సరైన ఆరోగ్యం సమకూరటం లేదు. వారిపై వ్యక్తిగత ఆర్థిక భారం తగ్గటం లేదు, ప్రభుత్వానికి వారు చెల్లించిన పన్నులు సద్వినియోగమవటం లేదు.

ఆరోగ్యశ్రీ ప్రయోజనకర పథకమే అయినా, ఆ పథకానికున్న పరిమితుల్ని గుర్తించకుండా సర్వరోగనివారణి అన్నట్లు తెలంగాణ ప్రభుత్వం కూడా యధాతథంగా కొనసాగిస్తుండటం.. తెలంగాణలో కూడా ఆరోగ్య సంక్షోభాన్ని పెంచుతోంది. యూనియన్ ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీ నమూనాలోనే 'ఆయుష్మాన్ భారత్' అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రపంచంలోనే అతిపెద్ద బీమా ఆధారిత స్కీమ్‌గా రూపొందిన ఈ పథకం ఆశించిన ఫలితాలనివ్వటం లేదని ఛత్తీస్‌గఢ్, మరికొన్ని రాష్ట్రాల్లో చేసిన అధ్యయనాల్లో వెల్లడైంది. మురళీమోహన రావు గారు చెప్పినట్లు, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల్లోని ఇన్సూరెన్స్ సదుపాయాన్ని కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులు అడ్డం పెట్టుకుని డబ్బుని పిండుకుంటున్నాయి. జబ్బు కొంత ముదిరాక, ఇన్సూరెన్స్ ద్వారా వైద్య సేవల్ని అందించటం వల్ల ఆరోగ్య సంక్షోభం తగ్గదని లోక్‌సత్తా వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టినప్పుడు కూడా గట్టిగా తెలియచెప్పింది. ఆరోగ్య సంక్షోభానికి పరిష్కారం ప్రయివేటు ప్రాక్టీసు చేయకుండా ప్రభుత్వ వైద్యులపై నిర్బంధం విధించటం వంటివి కాదు. పరిష్కారం- ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతో అందరికీ ఆరోగ్యాన్నిచ్చే సార్వత్రిక ఆరోగ్య విధానాన్ని (యూనివర్సల్ హెల్త్‌కేర్‌ను) ప్రవేశపెట్టటం. జేబులో నుంచి రూపాయి ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండా ప్రజలందరికీ మంచి ఆరోగ్యాన్ని అందించే ఈ సమగ్ర విధానం నమూనాను రూపొందించి ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్)/లోక్‌సత్తా యూనియన్ ప్రభుత్వానికి అందజేసింది, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ, రాష్ట్ర ప్రజాప్రతినిధులకు పంపింది. 2005లో జాతీయ ఆరోగ్య మిషన్‌ను రూపొందించిన అనుభవంతో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఈ సమగ్ర ఆరోగ్య విధానాన్ని తయారుచేశారు. ప్రపంచ దేశాల అనుభవాల్ని, భారతదేశ పరిస్థితుల్ని బేరీజు వేసి అందుబాటు బడ్జెట్‌లోనే అందరికీ ఆరోగ్యాన్ని అందించే విధానమిది. 2005లో జాతీయ ఆరోగ్య మిషన్‌ని యధాతథంగా అమలు చేసి ఉంటే ఈపాటికి దేశంలో అందరికీ ఆరోగ్యం అందేది, ఈవేళ మనం ఈ సంక్షోభం గురించి చర్చించుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. జేపీ రూపొందించిన ఎన్‌హెచ్ఎంలో చాలామేర కత్తిరించి 10-20 శాతం మాత్రమే అమలు చేయటం వల్లే కోట్లాదిమంది దేశ ప్రజలు నివారించదగ్గ దుర్భర బాధలతో ఇంకా కన్నీరు గారుస్తున్నారు.

కొవిడ్ తర్వాత ఆరోగ్యం కోసం ప్రజల్లో పెరిగిన డిమాండ్‌ను అవకాశంగా మలచుకుని ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా తాజాగా ప్రతిపాదించిన విధానంలో.. ప్రతి కుటుంబానికీ/ఇంటికీ ఎంబీబీఎస్ చదివిన ఒక డాక్టర్ అందుబాటులో ఉంటారు. ఈ జనరల్ ఫిజీషియన్ ఫ్యామిలీ డాక్టర్‌గా మొదటి కాంటాక్ట్ పాయింట్‌గా ఉంటారు. దీనివల్ల ఆరోగ్య సేవలపై ప్రజలకు ఒక స్పష్టత, భరోసా లభిస్తాయి. ఇటీవల కొవిడ్, అంతకుముందు రకరకాల జ్వరాలు వచ్చినప్పుడు దాదాపు 80 శాతం మంది ప్రజలు బెంబేలెత్తిపోయి అవసరమున్నా లేకున్నా వేల రూపాయలను ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు ధారపోశారు. అదే ఫ్యామిలీ డాక్టర్ ఉంటే ఆ భయం ఉండదు. తన తండ్రికి డయాలసిస్ చేయించినప్పుడు పడ్డ కష్టాలను తలచుకుని టీఆర్ఎస్ పార్టీ విప్ గొంగిడి సునీత అసెంబ్లీలోనే కన్నీరు కార్చారు. నాయకత్వ స్థాయిలో ఉన్నవారినే అంతగా కదిలించే అనారోగ్య సమస్యలకు సామాన్య ప్రజలు కార్చే కన్నీరు గురించి చెప్పనలవి కాదు. ఫ్యామిలీ డాక్టర్ ఉంటే ఈ బేలతనం, భయం, ఆందోళన ఉండవు. చాలా ఆరోగ్య సమస్యలకు కుటుంబ వైద్యుడి దగ్గరే పరిష్కారం లభిస్తుంది. మన సమస్యల్ని, సందేహాల్ని చెప్పుకునే స్వేచ్ఛ, చనువు ఉంటాయి. మన కుటుంబ ఆరోగ్య చరిత్ర గురించి కూడా ఫ్యామిలీ డాక్టర్‌కి అవగాహన ఉంటుంది. గ్రామాల్లో అనధికారికంగా వైద్య సేవలందించే ఆర్.హెచ్.పిలను ˜హడా ఈ ఫ్యామిలీ డాక్టర్ సూచన మేరకు ఉపయోగించుకోవచ్చు. దీంతో చాలా ఆరోగ్య సమస్యలు ఈ దశలోనే సమగ్రంగా, తేలిగ్గా

నివారించబడతాయి లేదా ప్రారంభంలోనే పరిష్కారమవుతాయి. జీవనశైలి వ్యాధులు కూడా అదుపులోకి వస్తాయి. మెరుగైన చికిత్స అవసరమైన ఆరోగ్య సమస్యలకు ఫ్యామిలీ డాక్టరే పై స్థాయిలో నర్సింగ్ హోమ్‌కి, ఇంకా అవసరమనుకుంటే తృతీయస్థాయి పెద్ద ఆస్పత్రికి పంపుతారు. ఈ మొత్తాన్నీ ఆ డాక్టరే సమన్వయం చేసుకుంటారు.

ఫ్యామిలీ డాక్టర్‌గా ప్రభుత్వం చెప్పినవారినే మనం అంగీకరించనక్కర్లేదు. పది, పన్నెండు మంది డాక్టర్ల పేర్లలో మనకు నచ్చినవారిని ఎంచుకోవచ్చు. మన పేరు మీద ప్రభుత్వమే ఏడాదికి ఇంతని వైద్యునికి చెల్లిస్తుంది. ఇలా మనకు ఎంచుకునే స్వేచ్ఛనిస్తూ ఫ్యామిలీ డాక్టర్ పునాదిగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ప్రాథమిక వైద్యాన్ని బలోపేతం చేస్తే ప్రజలకు నిజంగా ఆరోగ్యం అందుతుంది, ఆందోళన లేకుండా హాయిగా బతకగలుగుతారు, దోపిడీ, అవినీతికి అడ్డుకట్ట పడి ప్రజాధనం కూడా సద్వినియోగమవుతుంది.

అయితే మురళీమోహన రావు గారు చెప్పినట్లు ప్రైవేటు రంగాన్ని పూర్తిగా విస్మరించి ఈ వైద్యసేవల్ని అందించటం సాధ్యం కాదు. ఎందుకంటే, ప్రభుత్వం విద్య, ఆరోగ్యాల్ని దశాబ్దాలుగా ఘోరంగా నిర్లక్ష్యం చేయటం వల్ల ఆ రంగాల్లో ప్రభుత్వ రంగ సేవలకు అనేక పరిమితులు ఏర్పడ్డాయి. ఆరోగ్య రంగంలో ప్రభుత్వం పెడుతున్న ఖర్చుకు నాలుగు రెట్లు ఫలితాలున్నా, మౌలిక వసతులు, సిబ్బంది జీతభత్యాలు, ఇతరత్రా కారణాల వల్ల ప్రైవేటు రంగం కంటే బాగా వెనుకబడి ఉంది. అందువల్ల ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతోనే అందరికీ ఆరోగ్య విధానాన్ని అమలు చేస్తూ, ప్రభుత్వ వైద్యశాలల్ని పటిష్ఠం చేయాలని లోక్‌సత్తా విధానం సూచిస్తోంది. ద్వితీయ స్థాయిలో ప్రయివేటు నర్సింగ్ హోంలను భాగస్వాముల్ని చేస్తూ, అక్కడ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ స్కీముల్ని ఉపయోగిస్తారు. తృతీయ స్థాయి వైద్యం ఖరీదైనది కాబట్టి అక్కడ వైద్యం పూర్తిగా ప్రభుత్వం అధీనంలో ఉండాలని, మౌలిక వసతులు, అత్యాధునిక పరికరాలు, పారిశుద్ధ్యం వంటి వాటి వరకు మాత్రం ప్రైవేటు సేవల్ని వినియోగించుకోవచ్చని లోక్‌సత్తా సిఫారసు చేస్తోంది. ప్రభుత్వ- ప్రయివేటు భాగస్వామ్యంతో అందించినా కూడా ఎటువంటి ఆర్థికభారం లేకుండా నాణ్యమైన వైద్య ఆరోగ్య సేవల్ని అందించాల్సిన బాధ్యత మాత్రం ప్రభుత్వానిదే (ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా రూపొందించిన ఆరోగ్య విధానపత్రం'Towards Viable Universal Healthcare'ని www.fdrindia.orgలో, జేపీ సోషల్ మీడియా ఖాతాల్లో చూడగలరు).

బ్రిటన్ ఎంతో సంక్షోభంలో ఉన్నప్పుడు 1948లో ఇలాంటి ఆరోగ్య విధానాన్ని అనుసరించి అందరికీ మంచి ఆరోగ్యాన్ని అందిస్తోంది. దీన్ని నీరుగార్చాలని కొంతకాలం క్రితం ప్రయత్నించినప్పుడు అక్కడి ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. వైద్యుల జీతాలను పెంచాలని అన్ని రంగాల ప్రముఖులు, ఇతర ప్రజానీకం రోడ్ల మీదకొచ్చి డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తూ అందరికీ ఆరోగ్యాన్ని అందించే విధానాన్ని ప్రవేశపెట్టాలని భారత్‌లో స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో ఇచ్చిన కమిటీ నివేదికను పట్టించుకోలేదు. ఆ తర్వాత ప్రజల ప్రాణాలకు, ఎదిగే అవకాశాలకు ఏమాత్రం ప్రాధాన్యతనివ్వని పాలకుల హయాం మొదలైంది. దీంతో విద్య, ఆరోగ్య రంగాలలో ప్రభుత్వ పాత్ర క్రమంగా తగ్గిపోయింది. బ్రిటన్‌లో ప్రజలు వైద్యులకు మెరుగైన ఆదాయం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే, మన దేశంలో పాలకులు అనుసరిస్తున్న అధ్వాన్నమైన ఆరోగ్య విధానం వల్ల ప్రజలు వైద్యుల మీద దాడులు చేస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీనివల్ల మళ్లీ ప్రజలే తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటు ప్రజానీకం, అటు వైద్యులు ఇద్దరి సమస్యలకూ పరిష్కారం ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ విధానాన్ని మార్చటంలోనే ఉంది.

స్వతంత్రం వచ్చి డెబ్భై ఏళ్లు దాటిన తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు ప్రాథమిక ఆరోగ్యం చుట్టూ సమగ్ర ఆరోగ్య విధానం కోసం డిమాండ్ బలం పుంజుకుంటోంది. ఇందులో లోక్‌సత్తా, కొందరు ఉదాత్త వైద్యనిపుణుల కృషే కీలకమనటంలో సందేహం లేదు. ఏదోక తరహా యూనివర్సల్ హెల్త్‌కేర్ కాకుండా, బ్రిటన్ తరహాలో ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ పునాదిగా ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా రూపొందించిన ఆరోగ్య విధానం కోసం మురళీమోహన రావు గారి లాంటి వాళ్లు గళం విప్పి ప్రచారం చేయాలి. అన్ని వర్గాల ప్రజానీకం దీన్ని తమ డిమాండ్‌గా చేసుకోవాలి. తమ కోసం, తమ తల్లిదండ్రుల కోసం, మెరుగైన భవిష్యత్ భారతం కోసం యువతీయువకులంతా ఇందుకు కలిసిరావాలి. కులం, మతం, ప్రాంతం, భాషలకతీతంగా మనందరం పట్టుబట్టి ఈ ఆరోగ్య సంరక్షణ విధానాన్ని సాధించుకోగలిగితే చాలు.. తెలుగునాట, భారతదేశంలో కూడా అందరికీ ఆరోగ్యం సాకారమవుతుంది, దాదాపు 2 కోట్ల కొత్త ఉద్యోగాలు కూడా వస్తాయి. ఇది పూర్తిగా ఆచరణసాధ్యం.

# సమగ్ర ఆరోగ్య వ్యవస్థ ఉంటే..
# 150 ఏళ్లు బతకటం సాధ్యమే

వెయ్యేళ్ల జయంతి ఉత్సవాలలో భాగంగా 2022 ఫిబ్రవరిలో విగ్రహావిష్కరణ జరుపుకున్న సమతామూర్తి రామానుజాచార్యులు వారు అప్పట్లో 120 ఏళ్లు బతికినట్లు చెబుతారు.



తాను 125 ఏళ్లు బతకాలనుకుంటున్నట్లు గాంధీజీ చెప్పేవారు. భారత్‌లో స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చటం కోసం, అహింసా మార్గాన్ని అనుసరిస్తూ అరమరికలు లేని స్నేహంతో బ్రిటన్-భారత్ ప్రపంచానికి నైతిక నాయకత్వం అందించే రోజుని చూడటం కోసం 125 ఏళ్లు బతకాలనుందని ఆయన అంటుండేవారు.

హైదరాబాద్‌లో జరిగిన అక్కినేని నాగేశ్వరరావు సహస్ర చంద్రదర్శన కార్యక్రమంలో ప్రముఖ కవి డా॥ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ, ఏఎన్నార్ 120-130 ఏళ్లు బతకటానికి సరిపడా పరిజ్ఞానాన్ని సమీకరించుకున్నారని అన్నారు. ఎన్నో ఏళ్లుగా బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నా వీల్‌చైర్‌లో వచ్చి మరీ ఆ కార్యక్రమంలో పాల్గొన్న అక్కినేని అన్నపూర్ణ .. సినారె వ్యాఖ్యలు తన భర్తకు దిష్టి కలిగిస్తాయేమోనన్నట్లు ఓ చూపు చూశారు కూడా.

ప్రపంచంలోనే అత్యధికంగా ఫ్రెంచి మహిళ జీనె కాల్మెంట్ 122 సంవత్సరాలు బతికినట్లు చెబుతారు. 1875లో ఆమె జన్మించినప్పుడు మనిషి సగటు జీవితకాలం 43 ఏళ్లు! ఇటీవల ఓ ఆఫ్రికన్ 127 ఏళ్లు జీవించినట్లు చెబుతున్నారు.

అయితే దీర్ఘాయుషు ఇక ఎంతమాత్రం యాదృచ్ఛికమో, ఆకాంక్షో, ఆశీర్వాదమో మాత్రమే కాదు.. వాస్తవరూపం దాల్చగల లక్ష్యం కూడా అని ధీమాగా చెప్పుకోవచ్చని ఇటీవలి కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి.

మనిషి ఆయుషును పొడిగించటానికి ఎప్పటి నుండో పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే ఎన్నో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావటంతో.. 'మనిషి గరిష్టంగా ఎంతకాలం బతికే అవకాశముంది?' అన్న ప్రశ్న పరిశోధకులను ఇటీవల ఎక్కువగా తొలిచి వేస్తోంది. ఈ నేపథ్యంలో సింగపూర్, రష్యా, అమెరికాలకు చెందిన శాస్త్రజ్ఞులు ఈమధ్య చేసిన అధ్యయనం మనిషి గరిష్టంగా 150 ఏళ్లు బతికే అవకాశముందని తేల్చింది. ఇప్పటిదాకా పలు అధ్యయనాలు... మనిషి గరిష్టంగా 140 సంవత్సరాలు బతికే అవకాశముందని అంచనా వేశాయి.

అయితే 150 ఏళ్ల ఆయుర్దాయం దానంతటదే ప్రకృతి వరంలా సమకూరదు. పటిష్ఠ మానవ ప్రయత్నం ఉండాలి, నాణ్యమైన సమగ్ర వైద్య వ్యవస్థను నిర్మించుకోవాలి అని అధ్యయనం పేర్కొంది.

వాస్తవానికి వైద్య ఆరోగ్య సేవల ఫలితాల్ని అంచనా వేసే కీలక పరామితుల్లో ఆయుర్దాయం కూడా ఒకటి. ఆరోగ్య వ్యవస్థ మరీ అధ్వాన్నంగా ఉండటం వల్లే మన దేశంలో 60 ఏళ్లు రాగానే వృద్ధాప్యం అనుకుంటాం. 80 ఏళ్లు బతికితే గొప్పన్నట్లే భావిస్తాం. పుట్టుకకు ముందు జన్యు లోపాల్ని సరిచేయటం, ఆహార-వ్యాయామ ప్రణాళికతోపాటు వ్యాధుల నివారణ, ప్రాథమిక వైద్య స్థాయి నుండి నాణ్యమైన ఆరోగ్య సేవలు, ఔషధాలు 150 ఏళ్ల నాణ్యమైన దీర్ఘాయుషుని అందిస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. అంటే ఇప్పుడున్న ఆయుర్దాయం కంటే దాదాపు రెట్టింపు కాలం బతికే అవకాశాలు మన ముందున్నాయి.

సింగపూర్, రష్యా, అమెరికా శాస్త్రవేత్తలు తమ లెక్కలో 19వ శతాబ్దం నాటి 'గోంపెర్ట్జ్ ఈక్వేషన్'ను పరిగణలోకి తీసుకున్నారు. వయసు, అవయవాల క్షీణత, ఏ వయసులో పనిచేయడం నిలిపివేస్తారు... తదితర అంశాల ఆధారంగా కంప్యూటర్ మోడల్ సహాయంతో మరో లెక్క కూడా వేశారు. రెంటిలో కూడా మనిషి 150 ఏళ్లు బతికే అవకాశముందని తేలింది.

"శరీరం తన ధర్మాన్ని నిర్వర్తించే సామర్థ్యం క్రమంగా క్షీణించే దశను వృద్ధాప్యంగా పేర్కొంటాం. ఒక్కో అవయవం పనిచేయడం మానేస్తున్నప్పుడు శరీరం సమస్థితి (హోమియోస్టాసిస్) కోల్పోతుంది. ఫలితంగా వ్యాధుల నుంచి కోలుకునే సామర్థ్యం తగ్గిపోతుంది. చివరికి మరణం గుప్పిట్లో దేహం చేరిపోతుంది. ఒకవేళ సమస్థితిని స్థిరంగా ఉంచుకుని, వ్యాధుల నుంచి కోలుకునే సామర్థ్యం తగ్గకుండా చూసుకుంటే... మనిషి భేషుగ్గా 150 ఏళ్లు జీవించే అవకాశం ఉంది" అని పరిశోధకులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా వారు 70 వేల మంది రక్తనమూనాలను పరీక్షించారు.

గత సంచిక తరువాయి

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

## జులై 2021

(తెలుగులో స్థూల అనువాదం)

**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**



మెరుగైన సేవలున్న రాష్ట్రాల్లో (తమిళనాడు, గుజరాత్) అనధికారికంగా వైద్య సేవల్ని అందించేవారు.. వైద్య సేవల సూచికలు మరీ నాసిరకంగా ఉండే రాష్ట్రాల్లో (ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్, బీహార్)ని ఎం.బి.బి.ఎస్ డాక్టర్ల కంటే మెరుగ్గా వైద్యం అందిస్తున్నారు. ఆయా రాష్ట్రాల సామాజిక-ఆర్థిక స్థాయి పెరుగుతున్నా కూడా అనధికార వైద్య సేవలదార్ల సంఖ్య మరీ తగ్గిపోవటం ఉండదు. పైగా ఆ వృద్ధి వారు పరిజ్ఞానాన్ని పెంచుకోవటానికి కూడా దోహదం చేస్తుంది.

రెండోది, డాక్టర్-రోగి మధ్య సంకర్షణలో పెద్దగా చొరవ లేదని దాస్ అండ్ హ్యామర్ అధ్యయనంలో గుర్తించారు. దీనివల్ల 'తెలిసిన వైద్యాన్ని చేయటంలో అంతరం' ఏర్పడి, వైద్య సేవలదారునికి ఉన్న పరిజ్ఞానం అతను/ఆమె అందించే సేవల్లో ప్రతిఫలించటం లేదు. వైద్య సేవలదారు పరిజ్ఞాన స్థాయి పెరిగిన కొద్దీ ఈ అంతరం విస్తరిస్తోందని వారు గమనించారు. ఈ సమస్య ప్రయివేటు రంగంలో పెద్దఎత్తునే ఉన్నప్పటికీ.. వైద్య సేవలు అందించే ప్రయత్నానికి, అందిస్తున్న వాస్తవ సేవలకి మధ్య అంతరం ప్రయివేటు రంగంలో కంటే ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలోనే ఎక్కువగా ఉంది. ఈ అంతరాన్ని తగ్గించటానికి ప్రభుత్వ రంగంలో పాలనా జవాబుదారీతనం కంటే.. వైద్యుడు రోగికి పూర్తిగా జవాబు దారీగా ఉండే సేవకు-ఫీజు నమూనాలో ఆర్థిక, సామాజిక ప్రోత్సా హకాలు ఇవ్వటం ఎక్కువగా ఉపయోగపడుతుంది, తెలిసిన వైద్యాన్ని చికిత్సలో ప్రదర్శించటంలో అంతరాన్ని తగ్గించటానికి దోహదం చేస్తుంది.

**4.1.2. ప్రభుత్వ ప్రాథమిక వైద్యంపై అరకొర వ్యయం**

ఆరోగ్య వ్యయాల్ని ఖర్చు చేసే పద్ధతిని బట్టే.. అందించే సేవల ప్రభావశీలత ఆధారపడి ఉంటుంది. నివారణ వైద్యం సాధారణంగా పేదలకు అనుకూలంగా ఉంటుందని, జబ్బు వచ్చాక చికిత్సా విధానం సంపన్నులకు అనుకూలంగా ఉంటుందని అనుభవాలు సూచిస్తున్నాయి. చికిత్సలపై ప్రభుత్వం చేస్తున్న వ్యయంలో, నిరుపేద వర్గ జనాభాకు కేవలం 10 శాతం వనరులు దక్కుతుండగా, అత్యంత సంపన్న వర్గాలకు దాదాపు 33 శాతం లభిస్తున్నాయి. అంటే, చికిత్సలో జనాభాలోని 20 శాతం నిరుపేదలపై వెచ్చించే ప్రతి రూపాయికీ, జనాభాలో 20 శాతం అత్యంత సంపన్నులపై మూడు రూపాయిలు ఖర్చవుతోంది (గణాంక పటం 4.2). కాబట్టి, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను, నివారణ సేవల్ని బలోపేతం చేయటం పేదల ఆరోగ్యాన్ని మెరుగుపరచటానికి ఎంతో కీలకం.

**(గణాంక పటం 4.2: ఆదాయ వర్గం వారీగా ఆరోగ్య చికిత్సల వ్యవస్థపై ప్రభుత్వ రాయితీ వాటా శాతం)**

ప్రస్తుతం మొత్తం ప్రాథమిక ఆరోగ్య వ్యయంలో ప్రభుత్వం వాటా 31 శాతం (పట్టిక 4.5). ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొన్నట్లు, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం చేస్తున్న మొత్తం వ్యయం అక్కడ కాస్త, ఇక్కడ కాస్త అన్నట్లే ఉంది. దీనివల్ల ప్రాథమిక వైద్యం అరకొర అన్నట్లు తయారుకావటంతోపాటు, ద్వితీయ స్థాయి వైద్య సేవలకు రెఫరల్ అనుసంధానాలు కూడా దెబ్బతిన్నాయి. చికిత్స సేవలు ముందుకొచ్చి, నివారణ ఆరోగ్య సేవలు వెనక్కి వెళ్లాయి. ప్రాథమిక వైద్య వ్యయంలో జాతీయ స్థాయి ప్రభుత్వం వాటాగా చేస్తున్న వ్యయం ప్రధానంగా టీకాలు, కుటుంబ నియంత్రణ, మాతా, శిశు ఆరోగ్య సేవలకు సంబంధించే ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్యంలో ఎక్కువ ఆర్థిక వనరులను అందించే రాష్ట్రాల ప్రధాన వాటా, జీతాలకు, వసతుల నిర్వహణకే సరిపోతోంది.

చాలా సమర్థవంతమైన ఆరోగ్య వ్యవస్థల్ని నిర్మించిన దేశాల్లో ఆరోగ్య వ్యయ పద్ధతులు దేశ ఆరోగ్య అవసరాలకు ఎలా నిధుల్ని అందించాలో, నిర్వహించాలో మనకు లోతైన దృష్టి కోణాల్ని అందిస్తాయి. జి.డి.పిలో ఆరోగ్యానికి చేస్తున్న వ్యయం విషయంలో ఓ.ఇ.సి.డి దేశాలను అనుకరించే పరిస్థితి ఇప్పుడు మనకు లేదు గానీ, పౌరులకు నాణ్యమైన వైద్య సేవలను అందించటంలో, ఖర్చుల్ని అదుపులో ఉంచటంలో వారి అనుభవాల నుండి పాఠాలు నేర్చుకోవటం ముఖ్యం. పట్టిక 4.5 భారతదేశం ఆరోగ్య రంగంలో వ్యయం చేస్తున్న పద్ధతుల్ని బ్రిటన్, ఇటలీ, ఫ్రాన్స్, కెనడాలతో పోలుస్తుంది. ఆ నాలుగు దేశాలకూ పటిష్ఠమైన ప్రాథమిక ఆరోగ్య నెట్‌వర్క్ ఉంది, రెఫరల్ అనుసంధానాలు ఉన్నాయి, ఆరోగ్య ఫలితాల్లో మంచి స్థానాల్లో ఉన్నాయి (అధ్యాయం 1లో పట్టిక 1.3).

**(పట్టిక 4.5: ఎంపిక చేసిన దేశాల మధ్య ప్రాథమిక ఆరోగ్య వ్యయాల పోలిక)**

ఆరోగ్య వ్యవస్థలో మెరుగైన ఫలితాలు రావాలంటే ప్రాథమిక ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం మరింతగా ఉండటం, మెరుగైన రీతిలో ఉండటం అవసరమైన ముందస్తు షరతు. ప్రాథమిక స్థాయిలో సమర్థవంతమైన సంరక్షణ వల్ల సాంక్రమిక వ్యాధుల్ని తొలుతే నివారించటం, వాటికి చికిత్స చేయటమే కాకుండా, రక్తపోటు, డయాబెటిస్, గుండె జబ్బు, క్యాన్సర్ వంటి దీర్ఘకాల వ్యాధుల్ని తొలిదశలోనే గుర్తించి, వాటిని మెరుగ్గా అదుపులో ఉంచుకునేందుకు, భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా, వ్యాధి ప్రబలతను, మరణాల్ని తగ్గించటం సాధ్యమవుతుంది. ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యాలతో అనుసంధానమైన విశ్వసనీయ ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ నెట్‌వర్క్ లేకుంటే.. ఆస్పత్రి సేవల వ్యయం అనూహ్యంగా పెరిగిపోతుంటుంది, ఫలితాలు మాత్రం అందుకు తగ్గట్లు రావు.

**4.1.3. ఆరోగ్య స్థితిలో అంతరాలు:**

ఆరోగ్య సేవల్లో సాధించిన ఫలితాల్లో ఎంతో ఎక్కువస్థాయి తేడాలతో కూడిన అంతరాలు వివిధ రాష్ట్రాల మధ్య ఉండటం భారత ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థలో కనిపించే మరో ప్రధాన లక్షణం. ఒకవైపు, కేరళ లాంటి రాష్ట్రాలు సాపేక్షంగా మెరుగైన ప్రజారోగ్య ప్రమాణాలను సాధించగా, మరోవైపు, బీహార్ వంటి రాష్ట్రాలు వెనుకబాటులో ఉన్నాయి. ఇవాళ్టికి కూడా ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలు ప్రతి 1000 జననాలకు మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలో వరుసగా 56, 47 దాకా ఉన్నాయి. దిగువాదాయ దేశాల్లో మాత్రమే ఇలాంటి పరిస్థితి ఉంది. ఇంకోపక్క, 1000 జననాలకి గణనీయంగా తక్కువ సంఖ్యలో 10 మరణాలు మాత్రమే ఉన్న కేరళ అధికాదాయ దేశాలతో పోటీపడుతోంది. పలు ఇతర ఆరోగ్య సూచికల్లో కూడా ఇదే తరహా అంతరాలు వెల్లడవుతాయి

(అధ్యాయం 2లో పట్టిక 2.1). ఆరోగ్య సంరక్షణపై తలసరి వ్యయం, ఆ వ్యయాన్ని ఖర్చు చేసే పద్ధతి, వ్యవస్థాగత సామర్థ్యం, ప్రజారోగ్య చర్యలు, దశాబ్దాలుగా చారిత్రక అభివృద్ధి పోకడలు, స్థానిక కమ్యూనిటీ భాగస్వామ్యం, జవాబుదారీతనం, పర్యవేక్షణ వ్యవస్థలు మొదలైన అనేక అంశాల సమాహారం ఒక రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థ ఫలితాల్ని నిర్ణయిస్తుంది.

ఒకే స్థాయి ఆదాయమున్న రాష్ట్రాల మధ్య అంతరాలు ప్రభుత్వ ఆరోగ్య వ్యయాన్ని మరింత మెరుగైన రీతిలో ఖర్చు చేయాల్సిన ఆవశ్యకతను స్పష్టం చేస్తున్నాయి. ఉదాహరణకి, హర్యానా తలసరి ఆదాయం, ఆరోగ్య రంగంలో మెరుగ్గా ఫలితాలను సాధిస్తున్న రాష్ట్రాలన్నిటికన్నా కూడా ఎక్కువ. కానీ హర్యానాలో ఫలితాలు మాత్రం చాలా అధ్వాన్నంగా ఉన్నాయి (అనుబంధం 4.2). మెరుగైన ఫలితాలు సాధిస్తున్న రాష్ట్రాల మధ్య చూసినా కూడా, కేరళ ఆదాయ స్థాయిలు మిగతా రాష్ట్రాలతో సమానంగా ఉన్నప్పటికీ మిగిలిన రాష్ట్రాల కన్నా ఫలితాల్లో కేరళ ఎంతో ముందుంది.

తలసరి ఆదాయం, ఆరోగ్య ఫలితాలను పోల్చి చూస్తే, భారతదేశంలోనే ఆరోగ్య సేవల్లో అసమానతలు ఎంతున్నాయో మనకు కొంతమేర తెలుస్తుంది. పౌరులకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించాలంటే మన ప్రయత్నం ఎంత ఉండాలో తెలియజేస్తుంది. అధ్యాయం 2లో చర్చించినట్లు, ఓ.ఓ.పి.ఇ భారత్‌లో దిగ్భ్రాంతికర స్థాయిలో ఎంతో ఎక్కువగా ఉంది. దేశంలో దాదాపు 59 శాతం టి.హెచ్.ఇ ప్రజలు సొంతంగా జేబులో నుంచి పెట్టుకుంటున్నదే. దీనివల్ల, అనారోగ్యం వల్ల, ఆరోగ్య సేవల వ్యయం వల్ల కోట్లాది మంది ప్రజలు ఏటా పేదరికంలోకి జారిపోతున్నారు.

**4.2. ప్రజలకు ఎంపిక స్వేచ్ఛ, వైద్యుల మధ్య పోటీ ఏర్పాట్లతో ఫ్యామిలీ ఫిజీషియన్ నేతృత్వంలో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ**

నాణ్యమైన ఆరోగ్యానికి గ్యారంటీ ఇవ్వాలంటే పటిష్ఠమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ అనివార్యంగా అవసరం. ఇదేసమయంలో, ప్రజలు జేబుల్లో నుంచి సొంతంగా చేసే వ్యయం నామమాత్రంగా ఉండాలి. భారత్‌లో ప్రస్తుతమున్న ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ నిర్మాణంలో అన్నీ ఉన్నాయి గానీ, కుప్పకూలిపోయింది. ఆరోగ్య సేవలదారులు రోగులకు, వ్యవస్థకు ఏమైనా జవాబుదారీతనం వహించటమంటూ ఉంటే, అది పరిమితంగానే. అందించే సేవల నాణ్యతలో నిర్లక్ష్యం ఫలితంగా, ప్రాథమిక వైద్య ఫిజీషియన్లపై ప్రజలకు పెద్ద అంచనాలు లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో.. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మెరుగుపరిచే ఏ ప్రయత్నమైనా కూడా, డిమాండ్ వైపు లోటును పరిగణలోకి తీసుకుంటూ దేశంలో ఆరోగ్య సేవల నాణ్యతను పెంచేందుకు ప్రోత్సాహకాలతో నిర్మాణం చేయాలి. ప్రాథమిక ఆరోగ్యంలో సవాళ్లను ఎదుర్కోవటంలో వైఫల్యం ఆరోగ్య రంగంలోని ఇతర విభాగాలు – ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యంలో సాధించే ఫలితాల సామర్థ్యాన్ని తగ్గిస్తుంది.

కాబట్టి, సమర్థవంతమైన, జవాబుదారీతనమున్న, అందుబాటులో ఉండే, ప్రభుత్వమే నిధులను సమకూర్చే, ప్రజలందరి ప్రాథమిక ఆరోగ్య అవసరాలను తీర్చే, ఆరోగ్య అవసరాలకు ఓ.ఓ.పి.ఇ భారాన్ని భారీగా తగ్గించే లేదా తొలగించే, రోగులకు డాక్టర్ల మధ్య ఎంపిక చేసుకునే స్వేచ్ఛనిచ్చే, వైద్య సేవలదారుల మధ్య పోటీని, ప్రోత్సాహకాన్ని ఏర్పరిచే, ఆస్పత్రి సేవలకు తొలి రెఫరల్ స్థానంగా వ్యవహరించే, ప్రస్తుత ప్రాథమిక ఆరోగ్య మౌలిక వసతులు, వ్యవస్థతో పూర్తిగా సంధానం అయ్యే ప్రాథమిక ఆరోగ వ్యవస్థను రూపొందించటానికి, నిర్మించటానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలి.

అందుకోసం, అందరికీ నాణ్యమైన వైద్య సేవలకు గ్యారంటీ ఇచ్చే, ఓ.ఓ.పి.ఇ రూపంలో రోగిపై ఆర్థిక భారాన్ని తగ్గించే, అదే సమయంలో ప్రభుత్వ ఖజానా నుండి చేసే ఖర్చును ప్రయోజనదాయకంగా చేసే ప్రజారోగ్య వ్యవస్థను రూపొందించి పనిచేయించటం మన లక్ష్యం కావాలి.

**ఈ పత్రంలో ప్రతిపాదించిన సమగ్ర ప్రాథమిక ఆరోగ్య నమూనా ఈ దిగువ లక్ష్యాల్ని సాధించేందుకు ఉద్దేశించినది:**

1. ఫిజీషియన్‌తో రోగి సంప్రదింపు రేటుని (ప్రభుత్వ రంగంలో) ఇప్పుడున్న వార్షిక తలసరి 0.6 శాతం నుండి 1.5 శాతం తలసరికి పెంచటం (రాష్ట్రాలవారీ వివరాలకు పట్టిక 4.4ను చూడండి).
2. పేదలపై ఆర్థిక భారాన్ని తగ్గించటం.
3. సేవలను అందించటంలో సామర్థ్యాన్ని మెరుగుపరిచి, ఆరోగ్య సంరక్షణ వ్యయాల్ని అదుపులో ఉంచటం.
4. ఆరోగ్య సంరక్షణ నాణ్యతను మెరుగుపరచటం, వ్యవస్థలోకి జవాబుదారీతనాన్ని తేవటం.
5. రోగులకు వైద్యుల మధ్య ఎంపిక స్వేచ్ఛను కల్పించటం, పోటీ ఆధారంగా వైద్య సేవలదారులకు ప్రోత్సహకాలను సృష్టించటం.
6. ప్రస్తుత పి.హెచ్.సి నమూనాతో సంధానించుకోవటం.
7. ఆస్పత్రి సేవలకు తొలి స్థాయి సిఫార్సుదారు (రెఫరల్)గా వ్యవహరించటం.

**4.2.1. ప్రాథమిక ఆరోగ్య నమూనాలను పోల్చి చూస్తూ అధ్యయనం**

ప్రపంచవ్యాప్త రోగులకు సేవలందించటంలో గణనీయ స్థాయి విజయాల్ని సాధించిన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలను అధ్యయనం చేయటం మన దేశ పరిస్థితులకు తగిన నమూనాను రూపొందించటంలో ఉపయోగపడుతుంది. వైద్య సేవలందించేవారికి ప్రోత్సాహకాలను అందించే నమూనాలను, దీంతోపాటు రోగులకు చాలా తక్కువ ఖర్చుతో సేవలు, మందులు అందిస్తున్న నమూనాలను బేరీజు వేయటమైంది. బ్రిటన్‌లోని జాతీయ ఆరోగ్య సేవ, కెనడా ఆరోగ్య సరంక్షణ పద్ధతి, ఇటాలియన్ జాతీయ ఆరోగ్య సేవ.. భారత్‌కు విధాన రూపకల్పనలో, పనితీరులో ప్రయోజనకర పాఠాల్ని అందిస్తున్నాయి. ఆ నమూనాల్లోని ప్రధానాంశాలను పట్టిక 4.6లో ఇవ్వటమైంది. వీటిలో కొన్నిటిని భారతదేశ ప్రాథమిక ఆరోగ్య నమూనాలోకి స్వీకరించవచ్చు. వినూత్న పరిష్కారాలను గుర్తించేందుకు ఢిల్లీలోని మొహల్లా క్లినిక్‌ల నిర్మాణం, అందులోని

పద్ధతులను కూడా సమీక్షించాము.

**(పట్టిక 4.6: ఎంపిక చేసిన దేశాల్లో ప్రాథమిక ఆరోగ్య నమూనాల మధ్య పోలికతో అధ్యయనం)**

**4.2.2. భారతదేశానికి ఆచరణసాధ్యమైన పటిష్ఠ ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ**

**మంచి ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలో ఉండాల్సిన ప్రధానాంశాలు ఏమిటంటే-**

1. ఒక వ్యక్తి తన అన్ని వైద్య అవసరాలకూ మొదటగా సంప్రదించే కేంద్రంగా ఉండటం (ఆస్పత్రి సేవలకు అనుసంధానంతో సమగ్ర సేవలు)
2. వైద్యుల మధ్య పోటీ .. రోగికి వైద్య సేవల మధ్య ఎంపిక చేసుకునే స్వేచ్ఛ. దీనివల్ల జవాబుదారీతనం, నాణ్యత ఉంటాయి.
3. ఆస్పత్రి సేవలకు సిఫారసు చేసే రెఫరల్ వ్యవస్థ.
4. వ్యవస్థ లోపల సమన్వయానికి వీలు కల్పించే ఆరోగ్య రికార్డుల వ్యవస్థ.
5. టీకాలు, పౌష్టికాహారం, పాఠశాల ఆరోగ్యం కోసం కార్యక్రమాలు వంటి ప్రజారోగ్య వ్యవస్థలోని ఇతర చర్యలతో సంధానం చేయటం

ఏ విజయవంతమైన ప్రజారోగ్య వ్యవస్థకయినా పటిష్ఠంగా, ఆచరణసాధ్యంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను నెలకొల్పటం ముందస్తు అవసరం. ప్రభుత్వ రంగంతో పోలిస్తే ప్రయివేటు రంగ సౌకర్యాలకి ఎంతో ఎక్కువ ఆదరణ ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇది సాధ్యం కావాలంటే.. సమర్థవంతంగా పనిచేయగలిగేలా ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను రూపొందించాలి. భారతదేశ సామాజిక-ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, ఉన్నతాదాయ వర్గాల వారు అన్ని స్థాయిల్లో ప్రయివేటు ఆరోగ్యంపై ఆధారపడటాన్ని కొనసాగిస్తారు. కానీ, ప్రభుత్వ వ్యవస్థ పరిధి సార్వజనీనంగా ఉండటంతోపాటు, కోరేవారందరికీ సేవలను అందించాలి. నాణ్యమైన సేవల్ని రోగిపై పెద్ద ఆర్థిక భారం లేకుండా లేదా అసలు ఎటువంటి భారం లేకుండా అందించాలి. జనాభాలో 70-75%కి సేవలందించే ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను నెలకొల్పటం సముచితమైన, ఆచరణసాధ్యమైన లక్ష్యం. మిగిలిన 25-30% మంది ప్రయివేటు వైద్యం నుంచి సేవలను తీసుకోవటం కొనసాగిస్తుంటారు. ప్రభుత్వ వ్యవస్థ ఎటువంటి విచక్షణనూ చూపనిదిగా ఉండాలి. దీనివల్ల సేవలు విశ్వసనీయంగా, ఆధారపడతగినవిగా, సమర్థవంతంగా మారి, మధ్యతరగతి వర్గాల వారు ఆ సౌకర్యాలను ఉపయోగించుకుంటారు. ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను వినియోగించుకునేందుకు పౌరులందరికీ సమాన హక్కులు ఉండటం ముఖ్యం. ప్రశ్నించే తత్వం, అవగాహన గల కాస్త మెరుగైన ఆదాయ వర్గాలవారు వ్యవస్థలో భాగస్వాములుగా ఉంటే, సేవలు మెరుగవుతాయి. కేవలం పేదల కోసమే రూపొందించిన వ్యవస్థ ఫలితాల్లో కాలక్రమంలో నాణ్యత లోపిస్తుంది. ఈ నేపథ్యంలో, పైన పేర్కొన్న లక్ష్యాలను అందుకోగలిగేలా రూపొందించిన నమూనాను మేము ప్రతిపాదిస్తున్నాము.

దేశంలో ప్రాథమిక ఆరోగ్య చట్రాన్ని బలోపేతం చేయటానికి ఫ్యామిలీ ఫిజీషియన్-ప్రాథమిక ఆరోగ్యాలను అనుసంధానం చేసిన నమూనా అత్యంత ఆచరణాత్మకమైనది, సమర్థవంతమయినది. ఈ నమూనా కింద, ఒక వ్యక్తికి అన్ని ఆరోగ్య అవసరాలకూ మొదటి సంప్రదింపు స్థానంగా ఒక ఫ్యామిలీ ఫిజీషియన్ (ఎఫ్.పి) ఉంటారు. ఆ వ్యక్తికుండే ప్రాథమిక ఆరోగ్య సమస్యలకు, సాధారణ అనారోగ్యాలకు చికిత్స ఇవ్వటంతోపాటు క్రమం తప్పకుండా పరీక్షలు చేస్తూ ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తుంటారు. అటువంటి వ్యవస్థ.. వైద్యుడు-రోగి మధ్య విశ్వాసాన్ని నిర్మిస్తుంది. ఆస్పత్రి వ్యవస్థకు ఎఫ్.పి తొలి సంప్రదింపు స్థానంగా వ్యవహరించటం వల్ల.. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయి ఆరోగ్య సంరక్షణల మధ్య బలమైన సంధానాలు ఏర్పడతాయి, దీనివల్ల తృతీయ స్థాయి ఆస్పత్రులపై భారం తగ్గుతుంది.

**4.2.2.1. మొదటి సంప్రదింపు స్థానంగా ఫ్యామిలీ ఫిజీషియన్**

ప్రపంచవ్యాప్తంగా మారుతున్న జనాభా ముఖచిత్రాలు, వ్యాధుల వ్యాప్తి తీరు వల్ల, ప్రజారోగ్య వ్యవస్థలు కొత్త అవసరాలకనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులు చేసుకోవాల్సిన అవసరముంది. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లోలాగే, భారతదేశంలో కూడా పెరుగుతున్న ఎన్.సి.డిలతోపాటు వైద్య ప్రక్రియలు సంక్లిష్టమవుతున్నకొద్దీ, ఆరోగ్య ఖర్చులు పెరుగుతూ పోతున్నాయి. అటువంటి పరిస్థితిలో అందరికీ ఆరోగ్యం అందించటానికి ప్రాథమిక ఆరోగ్యం కేవలం అనారోగ్యాలకు పరిమితం కాకుండా మరింత రోగి ప్రధానం కావాలి.

ప్రాథమిక, నివారణ వైద్య సేవల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ పాత్ర కీలకం. ప్రాథమిక ఆరోగ్యం అట్టడుగు స్థాయి మౌలిక ఆరోగ్య అవసరాలను తీర్చటానికి పరిమితం కాదు. ఇది సమగ్రమైన, వ్యక్తి-ఆధారితమైన ఆరోగ్య వ్యవస్థకు కేంద్రబిందువు. అటువంటి వ్యవస్థను నెలకొల్పటానికి, ఫ్యామిలీ ఫిజీషియన్ (ఎఫ్.పి) కాన్సెప్ట్‌ను భారతదేశంలో తిరిగి తీసుకొచ్చి, బలోపేతం చేయాలి.

ఫ్యామిలీ ఫిజీషియన్ అంటే, ఫ్యామిలీ ఆరోగ్య వ్యవస్థలో ధృవీకరణ కలిగిన శిక్షణ పొందిన డాక్టర్. రోగికి అన్ని రకాల ఆరోగ్య అవసరాలకూ మొదటి సంప్రదింపు స్థానంగా ఎఫ్.పి వ్యవహరించాలి. ఈ నమూనా మూలసూత్రమేమంటే, రోగులు తమ ఎఫ్.పితో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంటారు. దీనివల్ల విశ్వాసంతో కూడిన బంధం ఏర్పడి, రోగుల మానసిక బలాన్ని పెంచుతుంది. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ అనారోగ్యాలను నివారించటం ద్వారా మెరుగైన ఆరోగ్య ఫలితాలకు ఇది దోహదం చేస్తుంది. దీంతోపాటు, మిగతా ఆరోగ్య వ్యవస్థకు ఎఫ్.పి తొలి బాధ్యునిగా వ్యవహరిస్తూ, ప్రత్యేకీకరించిన (స్పెషలైజ్డ్) వైద్య సేవలు అవసరమున్న జబ్బులకు మాత్రమే ఉన్నత స్థాయిల్లోని ఆస్పత్రి చికిత్సకు సిఫార్సు చేస్తారు. సాపేక్షంగా తక్కువ సంఖ్యలోని అనారోగ్యాలకు మాత్రమే అటువంటి స్పెషలైజ్డ్ వైద్యం అవసరమవుతుంది కాబట్టి, ఎఫ్.పి వ్యవస్థ అంతర్లీనంగానే సేవలదారునికి, రోగికి కూడా ఆరోగ్య వ్యయాన్ని తగ్గిస్తుంది.

**(ఇంకా ఉంది...)**

## ఐఏఎస్, ఐపీఎస్‌ల డెప్యుటేషన్‌లో ఫెడరల్ నిబంధనల్ని,

# సంప్రదాయాల్ని గౌరవించాలి



అఖిల భారత స్థాయిలో ఎంపికై రాష్ట్రాల పాలనలో సేవలందించే హైబ్రిడ్ ఉన్నతాధికారుల వ్యవస్థ మనకు బ్రిటిష్ పాలన నుండి వచ్చింది. ఐఏఎస్, ఐపీఎస్‌లు ఢిల్లీకి చెందినవాళ్లా, రాష్ట్రాలకు చెందినవాళ్లా అని ఇటీవల వివాదాస్పద చర్చ జరుగుతోంది. ఈ పరిణామాలు వాంఛనీయం కాదు. అధికారి అంగీకారం, రాష్ట్రాల అనుమతితో యూనియన్ ప్రభుత్వం అఖిల భారత సర్వీసులోని వారిని డెప్యుటేషన్‌కు తీసుకోవచ్చు. దక్షిణాది రాష్ట్రాలు ఎక్కువగా ఐఏఎస్‌లను డెప్యుటేషన్ పంపటానికి ఇష్టపడటం లేదు. భాష, ఇంకా ఇతరత్రా కారణాల రీత్యా ఉత్తరాది రాష్ట్రాల నుండి ఎక్కువమంది ఉన్నతాధికారులు ఢిల్లీలో పనిచేయటానికి మొగ్గు చూపుతున్నారు. కానీ అఖిల భారత అధికారులు యూనియన్‌కి డెప్యుటేషన్‌కి వెళ్లడం రాష్ట్రాలకే ప్రయోజనకరం. రాష్ట్రం నుండి ఎంతమంది ఐఏఎస్‌లు యూనియన్ ప్రభుత్వంలో ఉంటే అంత మేలు జరుగుతుంది. గతంలో ఎన్.టి రామారావు ముఖ్యమంత్రి ఉన్నప్పుడు ఐదేళ్లు సర్వీసు ఉన్న ఓ ఐఏఎస్ అధికారిని ముఖ్య కార్యదర్శిగా నియమించాలనుకున్నా, యూనియన్ కేబినెట్ కార్యదర్శి కాగలిగే అవకాశముండటంతో ఆ అధికారి ఢిల్లీలో పనిచేయటానికే మొగ్గు చూపారు. యూనియన్ ప్రభుత్వ సేవలో ఉండే అధికారి వల్ల రాష్ట్రానికి కూడా మేలు జరుగుతుందని గుర్తించిన ఎన్‌టీఆర్ ఆ ఐఏఎస్‌ను సంతోషంగా ఢిల్లీకి పంపారు. కాబట్టి, యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరాన్ని బట్టి ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో అఖిల భారత అధికారులను సర్దుబాటు చేసుకోవాలి. ఫెడరల్ నిబంధనల్ని, సంప్రదాయాల్ని గౌరవించాలి. అఖిల భారత సర్వీసు నిబంధనల్ని మార్చుతామని హడావుడి చేయవచ్చు గానీ.. అది అంత సులభం కూడా కాదు.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th February, 2022 Posting Date 15 &16th of every month

# ఉచితాలను ఉత్పాదక వ్యయాలకు పరిమితం చేస్తూ యూనియన్ ప్రభుత్వమే చట్టం చేయాలి .. వ్యవస్థీకృత మార్పులే తేవాలి



ఉచితాలను ఉత్పాదక వ్యయాలకే పరిమితం చేయాలి. కానీ ఇప్పుడు పరిస్థితి ఎన్నికల సంఘం చేయి దాటిపోయింది. ఎన్నికల్లో రాజ్యాంగాన్ని ఉల్లంఘించి హామీలివ్వటం మన దేశంలో ప్రధానంగా 2006లో మొదలైంది. ఆ ఏడాది తమిళనాడు శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఉచిత కలర్ టీవీల హామీని డీఎంకే తన మేనిఫెస్టోలో ప్రకటించింది. రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని పరిహసించే ఆ ఎన్నికల హామీపై వెంటనే చర్య తీసుకోవాలని లోక్‌సత్తా తరపున ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాయటంతోపాటు ప్రత్యక్షంగా కూడా సమావేశమై వివరించటం జరిగింది. కానీ ఈసీ మొక్కుబడిగానే స్పందించింది. దాంతో ఆ ధోరణి మిగతా రాష్ట్రాలకూ వ్యాపించింది. 2008లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ పార్టీ కాంగ్రెస్ కూడా బాధ్యత మరచి అదే హామీనిచ్చింది. కాంగ్రెస్ హామీపై కూడా లోక్‌సత్తా ఫిర్యాదు చేసింది. అప్పుడూ ఈసీ పట్టించుకోలేదు. ఆ తర్వాత 2009లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ ఆ హామీనిచ్చింది. లోక్‌సత్తా మళ్లీ భారత ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. అయినా ఎన్నికల సంఘం కదలలేదు. దీంతో.. అటువంటి అసంబద్ధమైన ఉచితాల్ని ఇవ్వబోమని ఒక ఎన్నికలో గట్టిగా నిలబడిన పార్టీలు కూడా ఓట్లు, సీట్లలో దెబ్బతిన్న అనుభవంతో ఉచితాల పోటీలో చేరిపోయాయి. 2014 నుంచి ఎన్నికల సంఘం సరిదిద్దగలిగే స్థాయిని మించి పార్టీలు పోటాపోటాగా రాజ్యాంగ విరుద్ధ హామీల్ని, ఉచితాల్ని గుప్పిస్తున్నాయి. ఉచిత టీవీలు ఇస్తామన్న పార్టీలు రేపు ఉచితంగా మద్యం, 10 గ్రాముల బంగారాన్ని పంపిణీ చేస్తామంటూ పథకాలను ప్రవేశపెడతాయి. ఇది రాజకీయ పార్టీల లక్షణం. వాటిని తప్పు పట్టలేము. ప్రజలకు ఉచితంగా సినిమాలు చూపించండంటూ రాజ్యాంగంలో ఎక్కడా చెప్పలేదు. ఇలాంటి వాటిని ఇప్పుడు ఎన్నికల సంఘం కట్టడి చేయలేకపోవటంతోపాటు.. పార్టీలు కూడా బాధితులుగా మారాయి. తెలుగు రాష్ట్రాలనే తీసుకుంటే, అనుత్పాదక పథకాలకు వేల కోట్ల రూపాయలను వెచ్చించాల్సి వస్తుండటంతో మౌలిక సదుపాయాల కల్పనకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో, పార్టీలు ప్రకటించే ఉచిత పథకాలకు సంబంధించి యూనియన్ ప్రభుత్వం కొత్త చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి. ప్రజలు ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల విధానాన్ని సంస్కరించి రాష్ట్రాధినేతల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి వంటి మార్పుల్ని తీసుకురావాలి. పేదల నిజమైన సంక్షేమానికి సంబంధించిన విద్య, వైద్యం వంటి రంగాల్లో మాత్రమే ఉచితాల్ని అమలు చేయాలి.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు
(ఎన్నికల వేళ రాజకీయ పార్టీల పోటాపోటీ ఉచిత హామీలపై సుప్రీంకోర్టు ఇటీవల ఘాటుగా స్పందించిన నేపథ్యంలో)

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020